www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 4-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 96 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: నవమి సా.4:32 తదుపరి దశమి; నక్షత్రం: చిత్ర సా.4:50 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.11:08-12:56; దుర్ముహూర్తం: ఉ.8:25-9:17, మ.12:45-1:37; అమృతఘడియలు: ఉ.9:38-11:26; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 5:49; సూర్యాస్తమయం: 6:50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



భారత్ X ఇంగ్లండ్

మహిళల మూడో టీ20 నేడు

రాత్రి 11.05 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

జొకో జోరు



19వ సారి మూడోరౌండ్‌కు

వింబుల్డన్ నుంచి జాస్మిన్ అవుట్

లండన్: సెర్బియా వీరుడు నొవాక్ జొకోవిచ్ మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో 19వసారి మూడో రౌండ్‌కు చేరిన ఘనత అందుకున్నాడు. ఇక..మరో సీడెడ్ ఆల్ ఇంగ్లండ్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈసారి నాలుగో సీడ్ జాస్మిన్ పోలిని వంతైంది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఆరో సీడ్ జొకో 6-3, 6-2, 6-0తో ఇవాన్స్‌ను చిత్తు చేశాడు. వింబుల్డన్‌లో నొవాక్‌కిది మొత్తంగా 99వ మ్యాచ్‌కాగా..ఫెడరర్ (18)ను అధిగమించి 19వసారి జొకో ఇక్కడ మూడో రౌండ్‌లో అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో అన్‌సీడెడ్ రఖిమోవా 4-6, 6-4, 6-4తో నిరుటి రన్నరప్ జాస్మిన్‌కు షాకిచ్చింది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో 8వ సీడ్ స్వియటెక్ 5-7, 6-2, 6-1తో మెక్‌నాలీపై, డిఫెండింగ్ చాంప్ క్రెజికోవా 6-4, 3-6, 6-2తో డొలిడేపై, లోకల్ స్టార్ రదుకాను 6-3, 6-3తో 2023 వింబుల్డన్ విజేత ఒండ్రుసోవాపై, 7వ సీడ్ ఆండ్రీవా 6-1, 7-6 (4)తో బ్రోంజెటీపై, 10వ సీడ్ నవారో 6-1, 6-2తో కుడెర్మెటోవాపై, 11వ సీడ్ రిబకినా 6-3, 6-1తో సకారిపై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో 11వ సీడ్ డిమినార్, 19వ సీడ్ డిమిత్రోవ్ మూడో రౌండ్‌కు చేరారు.

రెండో రౌండ్‌లో బాలాజీ జోడీ: భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ/మిగ్వెల్ రేయస్ (మెక్సికో) ద్వయం 6-4, 6-4తో అమెరికా జంట టీన్/అలెక్సాండర్‌పై నెగ్గి డబుల్స్ రెండో రౌండ్‌కు చేరింది.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

న్యూఢిల్లీ: భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ కాల్గెరీలో జరుగుతున్న కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-19, 21-12తో వాంగ్ పొ వీ (చైనీస్ తైపీ)ని ఓడించాడు.

హైహై.. నాయకా!

ఏకంగా నాలుగు సెషన్లపైగానే బ్యాటింగ్.. ఎక్కడా చెదరని ఏకాగ్రత.. షార్ట్‌పిచ్ బంతులనే అస్త్రంగా ప్రయోగిస్తున్నా తొణకలేదు, బెణకలేదు. ఆఫ్ స్టంప్‌కు ఆవలగా బంతులేసి ఊరిస్తున్నా.. షాట్లను నియంత్రించుకోవడంలో క్రమశిక్షణను ప్రదర్శించాడు. తొలి రోజు జట్టు ఎంతో ఒత్తిడిలో కూరుకుపోయిన సమయంలో ఓర్పు, నేర్పుతో క్రీజులో గోడకట్టిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రెండో రోజు తన క్లాస్ ఆటకు కొంత మాస్ జోడించి తన శతకాన్ని.. అద్భుత రీతిలో ద్విశతకంగా మార్చాడు. ట్రిపుల్ సెంచరీని కొద్దిలో చేజార్చుకొన్నా.. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక స్కోరు చేసిన భారత కెప్టెన్‌గా నయా రికార్డు సృష్టించాడు. నాయకుడన్న వాడు జట్టు కోసం ముందుండాలి.. ఈ సూత్రాన్ని చిన్నవయసులోనే ఆకళింపు చేసుకొన్న గిల్ జట్టు కోసం ఎదురు నిలిచాడు. వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో.. ఒక్కసారిగా గందరగోళం తలెత్తినా.. ప్రశాంతంగా పరిస్థితిని చక్కదిద్దాడు. కెప్టెన్‌గా మ్యాచ్‌లో తాను దూకుడుగా ఆడకపోయినా.. మరో ఎండ్‌లోని భాగస్వాములకు సహకరిస్తూ జట్టును గిల్ ఆదుకొన్న తీరు అద్భుతం.

మైండ్‌సెట్ మారిందా..: సారథ్యాన్ని చేపట్టకముందు మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచడంలో గిల్ ఇబ్బందులు పడేవాడు. కానీ, ఈ మ్యాచ్‌లో మాత్రం అతడి మైండ్‌సెట్‌లో ఎంతో మార్పు కనిపించింది. రాహుల్, కరుణ్ నాయర్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన గిల్.. పరిణతి చెందిన ఆటతో బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. సాంకేతికంగా ఎంతో బలమైన గిల్.. చివరి వరకు బంతిని గమనిస్తూ ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. పటిష్ఠస్థితికి చేరామనిపించగానే.. గేర్ మార్చాడు. బషీర్ బౌలింగ్‌లో శుభ్‌మన్ రివర్స్ స్వీప్ షాట్ ఆడడం విశేషం. స్పిన్నర్‌కు పెద్దగా సహకారం లేకపోవడంతో బషీర్ టార్గెట్‌గా గిల్ ఎక్కువ పరుగులు రాబట్టాడు. అయితే, నియంత్రణ మాత్రం ఎక్కడా కోల్పోకపోవడం గిల్ ఆటలో ప్రత్యేకత. టంగ్ బౌలింగ్‌లో సింగిల్‌తో డబుల్ సెంచరీ పూర్తి చేసుకొన్న శుభ్‌మన్.. ట్రిపుల్ దిశగా వడివడిగా కదిలాడు. కానీ, దురదృష్టవశాత్తూ ఆ మార్క్‌ను త్రుటిలో చేజార్చుకొన్నా.. కెప్టెన్‌గా తన ఎంపికను ప్రశ్నించిన వారికి మాత్రం తన బ్యాట్‌తోనూ సమాధానం చెప్పాడు. రోహిత్, కోహ్లీ లాంటి దిగ్గజాల రిటైర్మెంట్ తర్వాత సంధిదశలో ఉన్న టీమిండియాను నడిపించడానికి సమర్థుడైన నాయకుడినని పించుకొన్నాడు. లీడ్స్ టెస్టు సమయంలో రో-కో ప్రభ గిల్‌లో లేదంటూ వ్యంగ్యంగా మాట్లాడిన ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్‌కు.. ఈ ఇన్నింగ్స్‌తో 'డబుల్ స్ట్రోక్' ఇచ్చాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



గిల్ (269)

గిల్ డబుల్

ద్విశతకంతో రికార్డు

రాణించిన జడేజా, సుందర్

వహ్వా.. శుభ్‌మన్. టెస్టు పగ్గాలు చేపట్టాక ఈ యువ నాయకుడి బ్యాటింగ్ ప్రదర్శన శుభప్రదంగా సాగుతోంది. తొలి టెస్టులో సెంచరీతో అదరగొట్టిన గిల్ ఎడ్జ్‌బాస్టన్‌లో మరింత జోరు చూపాడు. ఇంగ్లండ్ బౌలర్లు ఎంతగా కవ్వించినా.. సిసలైన కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కెరీర్‌లో తొలి డబుల్ సెంచరీ రాబట్టి అదుర్స్ అనిపించాడు. ఈక్రమంలో అనేక రికార్డులను ఖాతాలో వేసుకున్నాడు. తన మారథాన్ ఇన్నింగ్స్‌లో జడేజా, సుందర్‌లతో కలిసి శతక భాగస్వామ్యాలను నెలకొల్పి.. జట్టు స్కోరును 211/5 నుంచి 600 దరిదాపులోకి చేర్చడం విశేషం. ఆ తర్వాత పేసర్లు ఆకాశ్, సిరాజ్ ఆరంభంలో వికెట్లు తీయగా.. బ్రూక్, రూట్ తమ జట్టును కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

1 ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి భారత కెప్టెన్‌గా గిల్. 'సేన' (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో ఈ ఫీట్ సాధించిన తొలి ఆసియా కెప్టెన్ కూడా అతడే. ఇంగ్లండ్ గడ్డపై అత్యధిక వ్యక్తిగత స్కోరు (269) కూడా గిల్‌దే.

భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన కెప్టెన్‌గా కోహ్లీ (254 నాటౌట్)ని దాటేసిన గిల్ (269).

2 భారత్ నుంచి డబుల్ సెంచరీ సాధించిన రెండో పిన్న వయసు (25 ఏళ్లు) కెప్టెన్‌గా గిల్. మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ (23 ఏళ్లు) ముందున్నాడు.

విదేశాల్లో టెస్టు డబుల్ సాధించిన రెండో భారత కెప్టెన్‌గా గిల్. 2016లో విండీస్‌పై విరాట్ బాదాడు.

ఐదు వికెట్లు కోల్పోయాక ఎక్కువ పరుగులు (376) సాధించడం భారత్‌కిదే తొలిసారి.

3 గవాస్కర్, ద్రవిడ్ తర్వాత ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ చేసిన మూడో భారత ప్లేయర్ గిల్. విదేశాల్లో 250+ స్కోరు సాధించిన మూడో భారత బ్యాటర్‌గా గిల్. సెహ్వాగ్ (309, 254), ద్రవిడ్ (270) ముందున్నారు.

6 టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన ఆరో భారత కెప్టెన్‌గా గిల్. గతంలో పటౌడీ, గవాస్కర్, సచిన్, ధోనీ, కోహ్లీ ఈ ఘనత సాధించారు.

భారత్ 587 ఆలౌట్ • ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 77/3



జడేజా (89)

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా రెండో రోజే అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (387 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 269) మొక్కవోని పట్టుదలతో డబుల్ సెంచరీ సాధించాడు. జడేజా (89), వాషింగ్టన్ సుందర్ (42) సహకారం అందించడంతో గురువారం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 151 ఓవర్లలో 587 పరుగుల భారీ స్కోరు సాధించింది. స్పిన్నర్ బషీర్‌కు మూడు.. వోక్స్, టంగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 77 పరుగులు చేసింది. క్రీజులో బ్రూక్ (30), రూట్ (18) ఉన్నారు. ఆకాశ్‌కు 2, సిరాజ్‌కు ఓ వికెట్ దక్కింది. ప్రస్తుతం ఇంగ్లండ్ 510 పరుగులు వెనుకబడిన దశలో మూడో రోజు ఆట కీలకంగా మారనుంది.

నిలకడగా..: రెండో రోజు 310/5 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా, కెప్టెన్ గిల్, జడేజా నిలకడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను విసిగించారు. పిచ్ నుంచి వారికెలాంటి సహకారం లభించకపోవడంతో భారత జోడీ ఆధిపత్యం చూపింది. అటు షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించినా ఇంగ్లండ్ బౌలర్లు సఫలం కాలేకపోయారు. స్పిన్నర్ బషీర్ ఓవర్లలో గిల్, జడేజా సిక్సర్లతో ఆకట్టుకున్నారు. అయితే లంచ్ బ్రేక్‌కు కాస్త ముందు శతకానికి చేరువగా ఉన్న జడేజాను టంగ్ షార్ట్ బాల్‌తో దెబ్బతీశాడు. దీంతో ఆరో వికెట్‌కు 203 పరుగుల భారీ భాగస్వామ్యానికి చెక్ పడింది. ఆ తర్వాత బరిలోకి దిగిన సుందర్‌ను ఇబ్బందిపెట్టేందుకు కెప్టెన్ స్టోక్స్ స్లిప్‌తో పాటు లెగ్ సైడ్‌లో మరో ఇద్దరిని మోహరించాడు. అలాగే పేసర్ టంగ్ సైతం అతడిని ఎక్స్‌ట్రా బౌన్స్‌తో దెబ్బతీయాలని చూశాడు. కానీ సుందర్ ఓపికను ప్రదర్శించాడు. ఈ సెషన్‌లో జట్టు 25 ఓవర్లలో 109 పరుగులు సాధించింది.

గిల్ ద్విశతకం: రెండో సెషన్‌లోనూ భారత్‌దే హవా సాగింది. గిల్ మరింత సాధికారతను చూపుతూ కెరీర్‌లోనే భారీ స్కోరుతో నిలిచాడు. అతడిని కట్టడి చేసేందుకు ఎంతమంది బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. అటు తొలి 40 బంతుల్లో ఐదు పరుగులే సాధించిన సుందర్ ఆ తర్వాత ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ సాగించాడు. పిచ్ మరింత ఫ్లాట్‌గా మారడంతో బషీర్ ఓవర్‌లో ఫోర్‌తో టచ్‌లోకి వచ్చిన అతడు తర్వాతి ఓవర్‌లోనే 4,6తో లయ అందుకున్నాడు. అయితే గిల్ 199 రన్స్ దగ్గర ఉన్నప్పుడు వరుసగా మూడు ఓవర్లను సుందరే ఎదుర్కొన్నాడు. చివరికి టంగ్ ఓవర్‌లో సింగిల్‌తో గిల్ డబుల్ సెంచరీ పూర్తయ్యింది. ఆ తర్వాత జోరు పెంచి బషీర్ ఓవర్‌లో రెండు, బ్రూక్ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో గిల్ చెలరేగాడు. ఈ ఊపులో 37 బంతుల్లోనే మరో 50 రన్స్ జత చేసి తన స్కోరును 250కి చేర్చాడు. అటు క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని విడదీసేందుకు రూట్ చేతికి బంతినివ్వడంతో ఫలితాన్నిచ్చింది. సుందర్‌ను బౌల్డ్ చేయడంతో ఏడో వికెట్‌కు 144 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక చివరి సెషన్ ఆరంభమయ్యాక మరో తొమ్మిది ఓవర్లలోనే భారత్ మిగిలిన మూడు వికెట్లను కోల్పోయింది. గిల్ సూపర్ ఇన్నింగ్స్‌కు టంగ్ తెరదించగా ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య తను పెవిలియన్‌కు చేరాడు.

ఆదిలోనే వికెట్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభానికి ముందు పిచ్ ఇంకా బ్యాటింగ్‌కు అనుకూలంగానే కనిపించింది. దీనికి తోడు బుమ్రా లేని భారత బౌలింగ్ దళం ఆతిథ్య జట్టు బ్యాటర్లను ఎలా అడ్డుకుంటుందోననే సందేహాలు నెలకొన్నాయి. కానీ ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే పేసర్ ఆకాశ్ వరుస బంతుల్లో ఫామ్‌లో ఉన్న ఓపెనర్ డకెట్, పోప్‌లను డకౌట్లుగా పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే క్రాలే (19)ను సిరాజ్ అవుట్ చేయడంతో 25/3 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో భారత బౌలర్ల జోరును బ్రూక్, రూట్ నిలువరించారు. రిస్కీ షాట్ల జోలికి పోకుండా జాగ్రత్తను కనబర్చి రెండో రోజును ముగించారు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 87; రాహుల్ (బి) వోక్స్ 2; కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31; గిల్ (సి) పోప్ (బి) టంగ్ 269, పంత్ (సి) క్రాలే (బి) బషీర్ 25; నితీశ్ (బి) వోక్స్ 1; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 89; సుందర్ (బి) రూట్ 42; ఆకాశ్ (సి) డకెట్ (బి) బషీర్ 6; సిరాజ్ (స్టంప్డ్) స్మిత్ (బి) బషీర్ 8; ప్రసిద్ధ్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 151 ఓవర్లలో 587 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-15, 2-95, 3-161, 4-208, 5-211, 6-414, 7-558, 8-574, 9-574, 10-587.**బౌలింగ్:** వోక్స్ 25-6-81-2; కార్స్ 24-3-83-1; టంగ్ 28-2-119-2; స్టోక్స్ 19-0-74-1; బషీర్ 45-2-167-3; రూట్ 5-0-20-1; బ్రూక్ 5-0-31-0.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) కరుణ్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్ 0; రూట్ (బ్యాటింగ్) 18; బ్రూక్ (బ్యాటింగ్) 30; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 77/3. వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-25. **బౌలింగ్:** ఆకాశ్ 7-1-36-2; సిరాజ్ 7-2-21-1; ప్రసిద్ధ్ 3-0-11-0; నితీశ్ 1-0-1-0; జడేజా 2-1-4-0.

కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్

జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ చాంపియన్ గుకేష్.ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు గట్టి షాకిచ్చాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జగ్రెబ్ అంచె సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో గురువారం జరిగిన ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌ను గుకేష్ చిత్తు చేశాడు. దాంతో టోర్నీలో ఆరు రౌండ్లు ముగిసేసరికి గుకేష్ మొత్తం పది పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చాడు.

పాక్ హాకీ జట్లకు గ్రీన్‌సిగ్నల్!

న్యూఢిల్లీ: భారత్ ఆతిథ్యం ఇచ్చే ఆసియా కప్, జూనియర్ వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ హాకీ జట్లు పాల్గొనేందుకు ఎటువంటి ఆటంకాలు ఉండబోవని ప్రభుత్వం స్పష్టం చేసింది. మల్టీనేషన్ టోర్నీలు కావడంతో ఒలింపిక్ చార్టర్‌ను ఉల్లంఘించదల్చుకోలేదని క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆసియా కప్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిరిలో.. చెన్నై, మదురైలో నవంబరు 28 నుంచి డిసెంబరు 10 వరకు వరల్డ్‌కప్ జరుగుతాయి.

బిజినెస్

మూడంచెల జీఎస్‌టీ రేట్లు వాంఛనీయం

- ఈ ఏడాది వృద్ధి 6.4-6.7%
- సీఐఐ కొత్త అధ్యక్షుడు రాజీవ్ మెమానీ



న్యూఢిల్లీ: దేశంలో సరళమైన మూడంచెల జీఎస్‌టీ విధానం అమలు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నూతన అధ్యక్షుడు రాజీవ్ మెమానీ సూచించారు. నిత్యావసర వస్తువులకు 5%, విలాసవంతమైన వస్తువులకు 28% కనిష్ఠ, గరిష్ఠ రేటు, మిగతా వస్తువులన్నింటికీ మధ్యేమార్గంగా 12-18% రేటు ఉండాలన్న అభిప్రాయం ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో నాలుగంచెల జీఎస్‌టీ విధానం (5, 12, 18, 28 శాతం) అమలులో ఉంది. సీఐఐ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వస్తు సేవల పన్నును (జీఎస్‌టీ) హేతుబద్ధం చేయాల్సిన అవసం ఉన్నదని నొక్కి చెప్పారు. ప్రధానంగా అల్పాదాయ వర్గాల ప్రజలు అధికంగా ఉపయోగించే వస్తువులపై పన్ను రేటు తగ్గించాలని ఆయన సూచించారు. అలాగే సిమెంట్ సహా అధిక శాతం ఉత్పత్తులపై ప్రస్తుతం 28% జీఎస్‌టీ అమలులో ఉన్నదని, ఆ రేటును కూడా హేతుబద్ధీకరించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుంటాయని అన్నారు. పెట్రోలియం, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆల్కహాల్ ఉత్పత్తులను కూడా జీఎస్‌టీ పరిధిలోకి తెచ్చే విషయంలో జాతీయ స్థాయి ఏకాభిప్రాయ సాధన అవసరమని రాజీవ్ సూచించారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.4 శాతం నుంచి 6.7 శాతం మధ్యలో ఉండవచ్చని భారత రాజీవ్ అంచనా వేశారు. మన దేశ వృద్ధి రేటుకు రిస్కులు, బలాలు కూడా సమతూకంగా ఉన్నాయన్నారు. భౌగోళిక, రాజకీయ అస్థిరతలు వృద్ధిని క్షీణింప చేసే ప్రమాదం ఉన్నప్పటికీ వస్తు, సేవలకు దేశీయ డిమాండు బలంగా ఉండడం వృద్ధిని ఉద్దీపింప చేసే అంశమని ఆయన వివరించారు.

హెచ్‌ఎంఏ ప్రెసిడెంట్‌గా దేవేందర్ రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) 2025-26 ఆర్థిక సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఇటీవల జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్త, ఈరైడ్ ఈ-మొబిలిటీ సంస్థ వ్యవస్థాపకులు అల్వాల దేవేందర్ రెడ్డి హెచ్ఎంఏ కొత్త ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదే సమావేశంలో శరత్ చంద్ర మారోజు వైస్ ప్రెసిడెంట్‌గా, వాసుదేవన్ సెక్రటరీగా ఎన్నికైనట్టు హెచ్ఎంఏ తెలిపింది.

13 వరకు జోయాలుక్కాస్ అతిపెద్ద జువెలరీ సేల్



హైదరాబాద్: జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. ది బిగ్గెస్ట్ జువెలరీ సేల్ ఆఫ్ ది ఇయర్ పేరుతో వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 13 వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ఆభరణాల మజూరీ చార్జీల (వీఏ)పై 50 శాతం తగ్గింపును ఆఫర్ చేస్తున్నట్లు జోయాలుక్కాస్ ప్రకటించింది. ఈ మెగా సేల్‌లో బంగారం, వజ్రాలు (కట్, అన్ కట్), ప్లాటినం, వెండి, ప్రీషియస్ స్టోన్స్‌లోని విస్తృత శ్రేణి డిజైన్లు కస్టమర్ల కోసం అందుబాటులో ఉండనున్నాయి. అలాగే పరిమిత సమయం డిస్కౌంట్‌తో పాటు కస్టమర్లు చేసే ప్రతి కొనుగోలుపై ఉచిత జీవితకాలం నిర్వహణ, ఏడాది బీమా, 100 శాతం బైబ్యాక్ హామీ ప్రయోజనాలను కల్పిస్తున్నట్లు పేర్కొంది.

ఇళ్ల అమ్మకాలు కిందికి..

- ధరలు మాత్రం పైపైకి..
- హైదరాబాద్ రియల్టీ అదుర్స్
- నైట్ ఫ్రాంక్ ఇండియా



న్యూఢిల్లీ: దేశంలో ఇళ్ల అమ్మకాలు నేల చూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,70,201 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాలు 2 శాతం తగ్గాయని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. అమ్మకాలు తగ్గినా ఇళ్ల ధరలు మాత్రం సగటున 2 నుంచి 14 శాతం వరకు పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఎనిమిది నగరాల్లో కంపెనీలు లీజుకు తీసుకున్న ఆఫీస్ స్పేస్ విస్తీర్ణం 41% పెరిగి 489 లక్షల ఎస్ఎఫ్‌టీ చేరింది.

హైదరాబాద్ రియల్టీలో జోరు: గత ఆరు నెలల్లో హైదరాబాద్ రియల్టీలో మాత్రం మంచి వృద్ధి రేటు కనిపించింది. గత ఆరు నెలల్లో నగరం, దాని చుట్టుపక్కల 19,048 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడు పోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ధరలు 11 శాతం వరకు పెరిగాయి. కార్యాలయ భవనాల లీజుల విషయంలోనూ ఇదే పరిస్థితి. గత ఆరు నెలల్లో హైదరాబాద్‌లో 59 లక్షల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్ లీజుకు సంబంధించి ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. ఇదే సమయంలో నెలవారీ ఎస్ఎఫ్‌టీ లీజు రెంటల్స్ సగటున 10 శాతం పెరిగి రూ.75కు చేరాయి.

- జూన్ ముగిసే నాటికి హైదరాబాద్‌లో అమ్ముడుపోని ఇళ్లు, ఫ్లాట్ల సంఖ్య 54,458గా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.
- రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల మధ్య ధర ఉన్న ఇళ్లకు యమ గిరాకీ
- రూ.కోటి నుంచి రూ.5 కోట్ల మధ్య ధర ఉన్న లగ్జరీ ఇళ్లకూ గిరాకీ

హెల్త్‌కేర్ రంగం కోసం నియంత్రణ మండలి!



ఏర్పాటుకు ప్రభుత్వ ప్రయత్నాలు.. హాస్పిటల్స్ దందాలకు చెక్ పెట్టేందుకే..

న్యూఢిల్లీ: ప్రైవేట్ ఆస్పత్రుల దందాలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ, బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ, టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ తరహాలోనే హెల్త్‌కేర్ రంగం కోసం స్వతంత్రంగా పనిచేసే ఒక రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేసేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ), ఐఆర్‌డీఏఐ.. ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ రామస్వామి నారాయణన్ వెల్లడించారు. ఈ రెగ్యులేటరీ సంస్థ అమల్లోకి వస్తే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య బీమా ఉన్న పేషెంట్ల నుంచి వసూలు చేసే విచక్షణాపూరిత భారీ బిల్లులకు చెక్ పడుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎందుకంటే?

ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా ఏదైనా అనారోగ్య సమస్యతో హాస్పిటల్‌కు వెళితే, ఆస్పత్రి ఉద్యోగులు అడిగే మొదటి ప్రశ్న 'మీకు ఆరోగ్య బీమా పాలసీ ఉందా? అని.. ఉంది అంటే ఇక వారి పంట పండినట్టే. సమస్య చిన్నదైనా వారి నుంచి నగదు చెల్లింపు రోగి కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ బిల్లు చేసి పంపిస్తున్నారని రామస్వామి అన్నారు. అన్ని ఆస్పత్రులు కాకపోయినా, ఎక్కువ ఆస్పత్రుల్లో జరుగుతున్న దందా ఇదే. ఈ క్లెయిమ్‌లు చెల్లించలేక బీమా కంపెనీలు కిందా మీద పడుతున్నాయి. దీంతో ఆ భారాన్ని తట్టుకునేందుకు ప్రీమియం రేట్లు పెంచేసి, ఆ మొత్తాన్ని పాలసీదారుడి నుంచే బీమా కంపెనీలు వసూలు చేస్తున్నాయి. ఇది అటు బీమా కంపెనీలకు, ఇటు పాలసీదారులకు ఇద్దరికీ భారంగానే మారుతోంది. స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే హెల్త్‌కేర్ రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఈ దందాను అడ్డుకోవాలని బీమా సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఎంఎస్ఈలకు ఆర్‌బీఐ ఊరట

ప్రీపేమెంట్ పెనాల్టీల రద్దు

ముంబై: దేశంలోని సూక్ష్మ, చిన్న వ్యాపార సంస్థల (ఎంఎస్ఈ)కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) పెద్ద ఊరట ఇచ్చింది. ఈ సంస్థలు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి చలన (ఫ్లోటింగ్) వడ్డీకి తీసుకునే రుణాల ముందస్తు చెల్లింపులపై పెనాల్టీలను రద్దు చేసింది. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయి. జనవరి 1 నుంచి ఎంఎస్ఈలు తీసుకునే కొత్త రుణాలు, పాత రుణాల రెన్యూవల్‌కు కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి ఉన్న రుణాలను ముందుగా చెల్లించాలన్నా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తమ ముక్కు పిండి మరీ ఈ పెనాల్టీలు వసూలు చేస్తున్నాయని ఎంఎస్ఈల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆర్‌బీఐ ఈ చర్య తీసుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	590
వరంగల్	577	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	95
వరంగల్	93	గుంటూరు	100
కరీంనగర్	93	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	81	అనంతపురం	100
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,330 ▲	91,050 ▲	1,21,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,11,000 ▲
విశాఖపట్నం	99,970 ▼	91,050 ▲	1,21,000 ▲
రాజమండ్రి	99,330 ▲	91,050 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	97,750 ▲	89,930 ▲	1,08,000 ▲
ముంబై	97,337	89,151	1,07,620

రిలయన్స్ రిటైల్ గూటికి యూకే కంపెనీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) రిటైల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) మరో కొనుగోలు జరిపింది. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు చెందిన ఫేషియల్ ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ బ్రాండ్ ఫేస్‌జిమ్‌లో మైనారిటీ వాటాను చేజిక్కించుకుంది. అయితే, ఈ ఒప్పందం విలువ మాత్రం వెల్లడించలేదు. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఫేస్‌జిమ్ ఉత్పత్తులను భారత మార్కెట్లో ఆర్ఆర్‌వీఎల్ ప్రవేశపెట్టనుంది.

ఎఫ్ఎంసీజీ వ్యాపారం కోసం కొత్త కంపెనీ ఏర్పాటు: ఆర్ఆర్‌వీఎల్ వ్యాపారాన్ని పునర్‌వ్యవస్థీకరిస్తోంది. ఎఫ్ఎంసీజీ బ్రాండ్ల వ్యాపారాన్ని విభజించి 'న్యూ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్' (న్యూ ఆర్‌సీపీఎల్) పేరిట కొత్త కంపెనీని ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి కోరింది.

2027 ఫిబ్రవరిలో భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో

న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో (బీఎంజీఈ).. తదుపరి ఎడిషన్‌ను 2027, ఫిబ్రవరి 4 నుంచి 9 వరకు ఢిల్లీలో నిర్వహించనున్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఇప్పటికే 2024, 2025 (జనవరి)లో జరిగిన రెండు ఎడిషన్స్‌కు విశేష స్పందన లభించగా.. ఈ మూడో ఎడిషన్‌లో ఎక్స్‌పో పరిధిని మరింత విస్తరించేందుకు కొత్త విభాగాలను చేర్చనున్నట్లు వెల్లడించింది. వీటిలో మల్టీ మోడల్ మొబిలిటీ, లాజిస్టిక్స్‌తో పాటు వ్యవసాయ ఆధారిత మొబిలిటీ పరిష్కారాలపై ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ఆఖరి గంటలో అమ్మకాలు

- సెన్సెక్స్ 170 పాయింట్లు పతనం
- ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే 610 పాయింట్లు కోల్పోయిన సూచీ

ముంబై: స్టాక్ మార్కెట్ మదుపరులు ఆఖరి గంట ట్రేడింగ్‌లో ఆర్థిక సేవలు, లోహ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఆరంభంలో లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. ఒకదశలో 440 పాయింట్ల వరకు ఎగబాకి 83,850 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. కానీ, మదుపరులు చివర్లో లాభాల స్వీకరణకు మొగ్గు చూపటంతో సూచీ తిరోగమన బాటలో పయనించింది. 170.22 పాయింట్ల నష్టంతో 83,239.47 వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సెన్సెక్స్ 610 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ విషయానికొస్తే, 48.10 పాయింట్ల నష్టంతో 25,405.30 వద్ద స్థిరపడింది.

వాతావరణ డెరివేటివ్‌లు..

ప్రారంభించేందుకు ఐఎండీతో ఎన్‌సీడీఈఎక్స్ ఒప్పందం

దేశంలో తొలిసారిగా వాతావరణ (వెదర్) డెరివేటివ్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టేందుకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ)తో నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (ఎన్‌సీడీఈఎక్స్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రైతులు, వ్యవసాయ రంగ సంబంధిత వర్గాలు లోటు వర్షపాతం, వడగాల్పులు, అకాల వాతావరణ పరిస్థితులతో ఎదురయ్యే నష్టాల నుంచి రక్షణ పొందేందుకు ఈ డెరివేటివ్ కాంట్రాక్టులు తోడ్పడగలవని ఎన్‌సీడీఈఎక్స్ పేర్కొంది. ఐఎండీతో భాగస్వామ్యంలో వర్షపాత ఆధారిత డెరివేటివ్‌లతోపాటు ఇతర కాంట్రాక్టులను అభివృద్ధి చేయనున్నట్లు, ఇందుకోసం ఐఎండీ గత, రియల్‌టైం డేటాను వినియోగించుకోనున్నట్లు తెలిపింది.



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రాణాలు కోల్పోతే బీమా

సొమ్ము ఇవ్వనక్కర్లేదు

కంపెనీ చెల్లించాల్సిన పని లేదు: సుప్రీంకోర్టు

2

శుక్రవారం | 4-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 96 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: నవమి సా.4.32 తదుపరి దశమి; నక్షత్రం: చిత్ర సా.4.50 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.11.08-12.56; దుర్ముహూర్తం: ఉ.8.25-9.17, మ.12.45-1.37; అమృతఘడియలు: ఉ.9.38-11.26; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తనిఖీలకు వచ్చిన వారికి

లంచం

ఎన్‌ఎంసీ అధికారులకు భారీగా ముట్టజెప్పిన తెలుగు రాష్ట్రాల్లోని పలు మెడికల్ కాలేజీలు

తమకు అనుకూల నివేదిక కోసం చెల్లింపులు

మధ్యవర్తులతో ఎన్‌ఎంసీ అధికార్ల వసూళ్లు

దేశవ్యాప్తంగా పలు కళాశాలలపై సీబీఐ కేసు

ఇప్పటివరకు ఆరుగురి అరెస్టు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తనిఖీలకు వచ్చిన జాతీయ వైద్య కమిషన్(ఎన్‌ఎంసీ) అధికారులకు లంచాలు ఇచ్చిన విషయంలో దేశవ్యాప్తంగా పలు వైద్య కళాశాలలపై కేసు నమోదైంది. తమ కాలేజీలకు అనుకూలంగా నివేదికలు ఇవ్వాలని యాజమాన్యాలు మధ్యవర్తుల ద్వారా ఎన్‌ఎంసీ అధికారులకు పెద్ద మొత్తంలో సొమ్మును ముట్టజెప్పారు. దీనిపై జూన్ 30న సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో ఏపీ, తెలంగాణకు చెందిన పలు మెడికల్ కాలేజీలు, మధ్యవర్తుల పేర్లు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు దేశవ్యాప్తంగా

మిగతా 12వ పేజీలో...

వరద జలాల లెక్కఎలా?

పోలవరం-బనకచర్లపై ఏపీకి కేంద్ర జలసంఘం ప్రశ్న

సాధ్యాసాధ్యాల రిపోర్ట్‌పై అధ్యయనం

పరిశీలనలు, అభిప్రాయాలతో ఏపీ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక

12

నేడు సామాజిక న్యాయ

సమరభేరి సభ

'జై బాపూ-జై భీమ్-జై సంవిధాన్'లో భాగంగా ఎల్బీ స్టేడియంలో..

నేతలు, కార్యకర్తలతో సమావేశం కానున్న కాంగ్రెస్ అధ్యక్షుడు

పార్టీ గ్రామ శాఖల అధ్యక్షుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేల వరకు హాజరు

40 వేల మందిపైగా వచ్చే అవకాశం

ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న ఖర్గే

స్వాగతం పలికిన ముఖ్యమంత్రి, మంత్రులు, టీపీసీసీ నేతలు

నేడు పీఏసీ, టీపీసీసీ విస్తృత కార్యవర్గ భేటీలు.. పాల్గొననున్న ఖర్గే



శంషాబాద్ విమానాశ్రయంలో ఖర్గేకు స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్, భట్టి, మహేశ్‌గౌడ్, మీనాక్షి

హైదరాబాద్/శంషాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయ సమర భేరి పేరిట టీపీసీసీ తలపెట్టిన సభకు సర్వం సిద్ధమైంది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న సభకు టీపీసీసీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మందికి పైగా ఉన్న పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, అన్ని జిల్లాలు, మండల కమిటీల కార్యవర్గ సభ్యులు, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు.. వెరసి మొత్తం 40 వేలమంది పైగా నేతలు, కార్యకర్తలు సభకు హాజరు కానున్నారు. జై బాపూ-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సభకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీల అధ్యక్షులకు భవిష్యత్తు కార్యాచరణపై నేరుగా దిశానిర్దేశం చేస్తారు. ఖర్గేతో పాటు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా మాట్లాడనున్నారు. వీరితో పాటు పలువురు గ్రామ, మండల కమిటీల అధ్యక్షులూ

మిగతా 11వ పేజీలో...

ప్రపంచ వ్యాపార కేంద్రంగా

హైదరాబాద్!

11

అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ'

పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తాం

మలబార్ ఆభరణాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సుద్దాల చలపతిరావు



గౌస్ మొహియుద్దీన్

హైకోర్టుకు కొత్తగా

నలుగురు జడ్జిలు!

- సుద్దాల చలపతిరావు, గౌస్ మీరా మొహియుద్దీన్, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్
- ఇప్పటివరకు న్యాయవాదులుగా హైకోర్టులో సేవలు
- కేంద్రానికి పేర్లు సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- ఏపీ సహా మరో 4 రాష్ట్రాలకూ కొత్త న్యాయమూర్తులు

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు నియామకం కానున్నారు. హైకోర్టు న్యాయవాదులు గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లను హైకోర్టు జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే ఏపీ సహా మరో నాలుగు రాష్ట్రాల హైకోర్టులకూ న్యాయమూర్తుల నియామకానికి సిఫారసు చేసింది. రాష్ట్రపతి ఆమోదం లభించిన తర్వాత వీరు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్ర హైకోర్టులో 42 మంది జడ్జిలు ఉండాలి. ప్రస్తుతం 26 మంది

మిగతా 10వ పేజీలో...



గాడి ప్రవీణ్‌కుమార్



వాకిటి రామకృష్ణారెడ్డి

వేతనాల్లో హైదరాబాద్ టాప్

అనుభవం ఉన్న సాంకేతిక నిపుణులకు రాష్ట్ర రాజధానిలో అత్యధిక వేతనాలు

కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి చెన్నైలో..

ఐటీ, తయారీ, టెలికాంలలో ఆకర్షణీయ జీతాలు

'ఇండీడ్ పే మ్యాప్ సర్వే'లో వెల్లడి

2

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి

రూ.8 వేల కోట్లు

భూసేకరణకు అదనపు నిధులు అవసరం.. కేంద్రం చెంతకు చేరిన డీపీఆర్

ప్రాజెక్టు సాంకేతిక కమిటీ వద్ద నివేదిక.. ఆ తర్వాత మరో కమిటీ ముందుకు

ఆ రెండింటి ఆమోదం పొందితే కేంద్ర క్యాబినెట్ వద్దకు ఫైలు



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టు అంశంలో కీలక ముందడుగు పడింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఎట్టకేలకు కేంద్రానికి చేరింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) డీపీఆర్‌ను

మిగతా 9వ పేజీలో...

సెల్‌ఫోన్‌తో పైరసీ!

ఫోన్‌తో థియేటర్‌లో సినిమాల రికార్డింగ్

టెలిగ్రాం లింకుల ద్వారా విక్రయం

ఒక్కో చిత్రానికి రూ.30-40 వేలు

ఏడాదిన్నర వ్యవధిలో 60 సినిమాల పైరసీకి పాల్పడిన నిందితుడి పట్టివేత

చదివింది ఐటీఐ.. ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తూ డబ్బుల కోసం అడ్డదారులు

ఒక్క 2024లోనే పైరసీ కారణంగా సినీ పరిశ్రమకు రూ.3700 కోట్ల నష్టం



కిరణ్ కుమార్

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అతడు చదివింది ఐటీఐ.. పని చేస్తున్నది ఏసీ టెక్నీషియన్‌గా! కానీ అది పైకి ముసుగు మాత్రమే. అతడి ప్రధాన వ్యాపకం.. సినిమాల పైరసీ! ఏడాదిన్నరగా అలా కొత్త సినిమాలను సెల్‌ఫోన్‌తో వీడియో తీసి, ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఆ నేరగాణ్ని హైదరాబాద్

మిగతా 10వ పేజీలో...



రాజాసింగ్‌పై

బీజేపీ సీరియస్!

11

ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు కోసం స్పీకర్‌కు లేఖ రాసేందుకు సిద్ధం

నేను ఎవరికీ

భయపడను!

పోటా, టాడా కేసులకే బెదరలేదు

కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి

9

మా కూతురు పోటీపై అధిష్ఠానం ఎలా చెబితే అలా: కొండా సురేఖ

మీనాక్షికి నివేదిక ఇచ్చిన దంపతులు

అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యల్ని

తీవ్రంగా పరిగణిస్తున్నాం

క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుంది

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

పదేళ్లలో బీసీలకు ఏం చేశారు?

జవాబు చెప్పాకే కవిత రైల్ రోకో చేయాలని సూచన

2

పెళ్లయిన 45 రోజులకే

భర్తను చంపించింది!

ఇద్దరు కిరాయి హంతకులతో హత్య చేయించిన భార్య

2

పెళ్లికి ముందు నుంచే మేనమామతో ఆమెకు సంబంధం

అతనితో కలిసి హత్యకు కుట్ర

బిహార్‌లో ఘటన.. అరెస్టు



కేసీఆర్‌కు అస్వస్థత

వారం నుంచి తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పితో ఇబ్బంది

యశోద ఆస్పత్రిలో చికిత్స

11

కేసీఆర్ త్వరగా కోలుకోవాలని సీఎం రేవంత్, బండి సంజయ్ ఆకాంక్ష

గ్రూప్-1లో తెలుగు అభ్యర్థులపై

వివక్ష అపోహే

9

హైకోర్టులో టీజీపీఎస్సీ వెల్లడి

కేటీఆర్ ఆదేశాలతోనే నిధులు

విడుదల చేశాం!

ఎఫ్ఈవోకు నిధులు మంజూరు చేయమని ఆయన మెసేజ్ చేశారు

ఆర్థిక శాఖ అనుమతి కావాలని చెబితే.. తానే చూసుకుంటానన్నారు

ఏసీబీ ఎదుట ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వాంగ్మూలం!

హైదరాబాద్, జూలై3 (ఆంధ్రజ్యోతి) ఫార్ములా ఈ కారు రేసులో విదేశీ కంపెనీ ఫార్ములా ఈ ఆపరేషన్స్‌కు నిధుల చెల్లింపు విషయంలో ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం ఆరు గంటల పాటు విచారించారు. ఈ కేసుకు సంబంధించి గతనెల 16న మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఎనిమిది గంటల

మిగతా 12వ పేజీలో...



నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రాణాలు కోల్పోతే బీమా సొమ్ము రాదు

» కంపెనీ చెల్లించాల్సిన పనిలేదు: సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 3: అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ప్రాణాలు కోల్పోతే బాధితుడి కుటుంబానికి బీమా పరిహారం రాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పరిహారం చెల్లించాల్సిన అవసరం బీమా కంపెనీకి లేదని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. 2014 జూన్ 18న ఎన్.ఎస్. రవీషా అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రంలోని మల్లసంద్ర గ్రామం నుంచి అరిసికెరె పట్టణానికి కారు నడుపుతూ ప్రమాదంలో మరణించారు. ప్రమాదంలో మరణించినందున బీమా కంపెనీ నుంచి రూ.80 లక్షల పరిహారం ఇప్పించాలని కోరుతూ ఆ వ్యక్తి తల్లిదండ్రులు, భార్య, కుమారుడు తొలుత కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. కారును సొంతంగా, అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి గురయినందున పరిహారం ఇవ్వాల్సిన పనిలేదని హైకోర్టు తీర్పు చెప్పింది. ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా అతివేగంగా నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని పేర్కొంది. ఈ తీర్పుపై ఆ కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు తీర్పుతో ఏకీభవించింది.

ఎగరని రాయల్ ఎఫ్-35 !

» ఊడదీసి కార్గోలో బ్రిటన్‌కు తరలించాల్సిందే

న్యూఢిల్లీ, జూలై 3: ది బ్రిటీష్ రాయల్ నేవీకి చెందిన ఎఫ్-35 యుద్ధ విమానంలో సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో జూన్ 14న కేరళలోని తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా దిగింది. అప్పటి నుంచి దానికి మరమ్మతులు చేసేందుకు ఇంజనీరింగ్ సిబ్బంది ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. దీంతో దాన్ని ఊడదీసి విడిభాగాలను మిలిటరీ కార్గో విమానంలో బ్రిటన్‌కు తరలించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఇది ఐదో జనరేషన్‌కు చెందిన స్టీల్త్ జెట్. గతనెలలో కేరళ తీరానికి 100 నాటికల్ మైళ్ల దూరంలో హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్ నిర్వహించిన ఆపరేషన్లలో ఈ యుద్ధ విమానం పాల్గొంది. ప్రతికూల వాతావరణం, ఇంధనం తక్కువగా ఉండటంతో ఈ యుద్ధ విమానాన్ని అత్యవసరంగా తిరువనంతపురం వైపు మళ్లించారు. అది సురక్షితంగా తిరువనంతపురంలో దిగేలా భారత వైమానిక దళం తోడ్పాటు అందించింది.

లక్ష కోట్ల విలువైన రక్షణ పరికరాల కొనుగోళ్లు

» ఆమోదం తెలిపిన డీఏసీ

న్యూఢిల్లీ, జూలై 3: దేశ భద్రతను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.1.05 లక్షల కోట్ల విలువైన రక్షణ పరికరాలను కొనుగోలు చేయనుంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్(డీఏసీ) 10 రకాల రక్షణ సామగ్రి కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ పరికరాలన్నీ మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌లో తయారై ఉండాలని స్పష్టం చేసింది. తాజాగా డీఏసీ ఆమోదించిన పరికరాల్లో ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలు, త్రివిధ దళాలకు ఉమ్మడి ఇంటిగ్రేటెడ్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఐఐఎంఎస్), భూతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణులు, నౌకాదళానికి మైన్స్, మైన్స్ కౌంటర్ మేజర్ వెసల్స్, సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్‌లు, జలాంతర్గాములు ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు గాను యాక్సెప్టెన్స్ ఆఫ్ నెసెసిటీ(ఏవోఎన్)ను తాజా సమావేశంలో డీఏసీ జారీ చేసింది.

భారత్-అమెరికా మధ్య పదేళ్ల రక్షణ ఒప్పందం

» త్వరలోనే అమెరికా, భారత రక్షణ మంత్రులు పీట్ హెగ్సెత్, రాజ్‌నాథ్ సింగ్ సంతకాలు

న్యూఢిల్లీ, జూలై 3: భారత్, అమెరికా దేశాలు తమ మధ్య వ్యూహాత్మక, రక్షణ సంబంధాల బలోపేతం దిశగా పదేళ్లకాలానికి రక్షణ ఒప్పందం చేసుకోనున్నాయి. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య జరిగిన సుదీర్ఘంగా ఫోన్ చర్చల్లో ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా తేజస్ మార్క్ 1ఏ యుద్ధ విమానాల్లో వినియోగించే అమెరికన్ జీఈ సంస్థ నుంచి ఎఫ్404 ఇంజన్ల సరఫరాను వేగవంతం చేయాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. రక్షణ మంత్రుల చర్చల వివరాలతో అమెరికా రక్షణ కార్యాలయం పెంటగాన్ తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. "పదేళ్ల కాలానికి సంబంధించిన రక్షణ ఒప్పందంపై త్వరలో జరిగే సమావేశంలో సంతకాలు చేయాలని ఇరు దేశాల ఆర్థిక మంత్రులు నిర్ణయానికి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లు, రక్షణ పరిశ్రమలకు సహకారం తదితర అంశాలపైనా వారు చర్చించారు. 2025 ఫిబ్రవరిలో ట్రంప్, మోదీ ప్రకటించిన ఉమ్మడి రక్షణ లక్ష్యాల సాధన దిశగా ఇరు దేశాలు గణనీయమైన పురోగతి సాధించాయని ఇరువురు నేతలు పేర్కొన్నారు" అని ఆ ప్రకటనలో పేర్కొంది.

రష్యాకు 30 వేల మంది ఉత్తర కొరియా సైనికులు

కీవ్, జూలై 3: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు మరింత సహకారం అందించేందుకు ఉత్తర కొరియా సిద్ధమవుతోంది. ఉక్రెయిన్ మిలటరీ నిఘా వర్గాల సమాచారం మేరకు.. దాదాపు 30,000 మంది ఉత్తర కొరియా సైనికులు త్వరలో రష్యా సైన్యంలో చేరబోతున్నారు. వీరంతా రష్యా సైన్యంతో కలిసి ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొననున్నారు. ఈ మేరకు సీఎన్‌ఎన్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలోని కుర్స్క్ ప్రాంతంలో రష్యన్ నేవీ డిప్యూటీ చీఫ్ మేజర్ జనరల్ మిఖాయిల్ గుడ్కోవ్ హత్యకు గురైనట్టు అధికారులు తెలిపారు. జనరల్ గుడ్కోవ్ తన బలగాలను సందర్శించిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ ఘటన ఎప్పుడు జరిగిందనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు.

పాక్ చానెళ్లపై భారత్ మళ్లీ నిషేధం

» ఆంక్షల తొలగింపుపై నెటిజన్ల కన్నెర్రతో దిద్దుబాటు

న్యూఢిల్లీ, జూలై 3: పాకిస్థాన్ న్యూస్ చానెళ్లు, యూ ట్యూబ్ చానెళ్లు, సెలబ్రిటీల సోషల్ మీడియా అకౌంట్లపై భారత్ మరోమారు నిషేధం విధించింది. బుధవారం ఆంక్షలు తొలగించడంపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పాక్ సెలబ్రిటీల సోషల్ మీడియా అకౌంట్లపై ఆంక్షలు ఎందుకు తొలగించాల్సి వచ్చిందని నెటిజన్లు ప్రశ్నించారు. దీంతో కేంద్రం మళ్లీ నిషేధం విధించింది. సాంకేతిక సమస్య వల్లే బుధవారం పాక్ సెలబ్రిటీల అకౌంట్లు తిరిగి ప్రత్యక్షమయ్యాయని అధికార వర్గాల ద్వారా తెలిసింది. అయితే దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన వెలువడలేదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తప్పుడు సమాచారం ప్రసారం చేయడంతో పాటు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ డాన్ న్యూస్, జియో న్యూస్, ఏఆర్‌వై న్యూస్, సమా టీవీ వంటి పాకిస్థాన్ న్యూస్ చానెళ్లను కేంద్రం నిషేధించింది.

జస్టిస్ వర్మ అభిశంసనపై ఏకాభిప్రాయానికి కృషి

» అన్ని పార్టీలతో చర్చిస్తున్న కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 3: అలహాబాద్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే విషయమై ఏకాభిప్రాయం సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతోంది. తీర్మానానికి మద్దతుగా ఎంపీల సంతకాలు తీసుకోవాలని భావిస్తోంది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసినప్పుడు ఆయన అధికారిక నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదంలో లక్షలాది రూపాయల నగదు కాలిపోయింది. లెక్కలో చూపని ఈ నగదుపై ఇంతవరకు పోలీసు కేసు నమోదు కాలేదు. సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత కమిటీ మాత్రం జస్టిస్ వర్మను తప్పుపట్టింది. భారీగా నగదు లభించినా జస్టిస్ వర్మపై చర్యలు తీసుకోవడం లేదంటూ విమర్శలు రావడంతో ఆయనను పదవి నుంచి తొలగించేందుకు అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అభిశంసన తీర్మానానికి ప్రధాన ప్రతిపక్షాలు సూత్రప్రాయంగా మద్దతు తెలిపాయని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజుజు గురువారం చెప్పారు. న్యాయ వ్యవస్థలోని అవినీతికి సంబంధించిన విషయం కావడంతో అన్ని పార్టీల మద్దతు తీసుకుంటున్నట్టు తెలిపారు.

సింహళీయులు మనోళ్లే!

» దక్షిణాది నుంచి వేల ఏళ్ల క్రితం శ్రీలంకకు వలస



చెన్నై, జూలై 3: శ్రీలంకలో నివసించే సింహళీయుల జన్యు మూలాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీరి పూర్వీకులకు దక్షిణ భారతదేశంలో నివసించే ద్రవిడులతో సంబంధం ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. పరిశోధన వివరాలు 'కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ఇటీవల ప్రచురితమయ్యాయి. స్థానికంగా నివసించే రెండు ఆదివాసీ తెగలకు చెందినవారి జన్యువులు, సింహళీయుల జన్యువులు ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నట్లు వెల్లడైంది. ఈ అధ్యయనం కోసం 35 మంది పట్టణ ప్రాంత సింహళీయులతో పాటు రెండు విభిన్నమైన భౌగోళిక ప్రాంతాలకు చెందిన 19 మంది ఆదివాసీల జన్యు నమూనాలను పరీక్షించారు. దాదాపు 3,000 సంవత్సరాల క్రితం సింహళీయుల పూర్వీకులు ఉత్తర, వాయవ్య భారతదేశం నుంచి శ్రీలంకకు వలస వెళ్లారని మునుపటి అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే ప్రస్తుత పరిశోధన ఫలితాలు మాత్రం దీనికి భిన్నంగా ఉన్నాయి. సింహళీయులు, ఆదివాసీల పూర్వీకుల జన్యు నిష్పత్తులు ప్రస్తుతం దక్షిణాదిన నివసిస్తున్న ద్రవిడ భాష మాట్లాడే ప్రజలతో చాలావరకూ పోలి ఉన్నట్లు గుర్తించామని పరిశోధకుల్లో ఒకరైన లఖ్‌నవూలోని బీర్బల్ సాహ్నీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్(బీఎస్ఐపీ)కి చెందిన డాక్టర్ నీరజ్‌రాయ్ వివరించారు. 'ప్రస్తుతం లంకలోని ఆదివాసీలు జన్యుపరంగా సింహళీయులను, శ్రీలంక తమిళులను పోలిఉన్నారు. దక్షిణ భారతం నుంచి వలస వెళ్లిన సింహళీయులు, శ్రీలంక తమిళులు, ఇతర సమూహాలు ఇక్కడున్న ఆదివాసీలతో సంబంధాలు ఏర్పరుచుకొని ఉంటాయని అధ్యయనంలో పాల్గొన్న చికాగో వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మానసా రాఘవన్ వెల్లడించారు.

లోకం తీరు



వేతనాల్లో హైదరాబాద్ టాప్

అనుభవం ఉన్న సాంకేతిక నిపుణులకు రాష్ట్ర రాజధానిలో అత్యధిక వేతనాలు

» నెలకు సగటున రూ.47,200 నుంచి రూ.69,700

» ఢిల్లీ, ముంబైలలో జీవనవ్యయం భారం

» 'ఇండీడ్ పే మ్యాప్ సర్వే'లో వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 3: అభివృద్ధి, నూతన టెక్నాలజీ, కొత్త ఉద్యోగాలు.. భారతదేశం రూపురేఖల్ని మార్చేస్తున్నాయి. పలు నగరాలు దేశ రాజకీయ, ఆర్థిక రాజధానులైన ఢిల్లీ, ముంబైలను దాటి కొత్త రికార్డులను నెలకొల్పుతున్నాయి. వేతనాల పెరుగుదల, ఉద్యోగావకాశాలకు సంబంధించి హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్ నగరాలు అగ్రస్థానంలో ఉన్నాయని.. ఢిల్లీ, ముంబైలను అధిగమించి ముందుకు వెళ్లాయని 'ఇండీడ్' అనే సంస్థ 'పే మ్యాప్ సర్వే' పేరుతో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 1300మంది కంపెనీల యజమానులు, 2500 మంది ఉద్యోగుల అభిప్రాయాలు సేకరించారు. వేతనాలు, వివిధ పరిశ్రమ రంగాలు, జీవనవ్యయం తదితర అంశాలపై వారిని ప్రశ్నించారు.

అనుభవానికి పెద్ద పీట

సర్వే ప్రకారం.. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారికి చెన్నైలో అత్యధిక వేతనం లభిస్తోంది. ఆ నగరంలో ఫ్రెషర్లకు నెలకు సగటున రూ.30,100 జీతం ఇస్తున్నారు. ద్వితీయస్థానంలో ఉన్న హైదరాబాద్‌లో ఇది రూ.28,500గా ఉంటోంది. ఒక మోస్తరు అనుభవం ఉన్న వారికి ఇచ్చే వేతనానికి సంబంధించి మాత్రం హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. 2-5 ఏళ్ల అనుభవం ఉన్న వారికి హైదరాబాద్‌లో నెలకు సగటున రూ.47,200, 5 నుంచి 8 ఏళ్ల అనుభవం ఉన్న వారికి రూ.69,700 జీతం లభిస్తోంది. హైదరాబాద్ తర్వాత స్థానాల్లో చెన్నై, అహ్మదాబాద్ ఉన్నాయి. టెక్నాలజీ, డిజిటల్ రంగాల్లో కెరీర్ ప్రగతి కోరుకుంటున్న వాళ్లు ప్రస్తుతం ఈ నగరాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సర్వే వెల్లడించింది.

జీవన వ్యయం భారం

పెరుగుతున్న జీవన వ్యయానికి జీతం సరిపోతుందా అని సర్వేలో ప్రశ్నించగా.. 69 శాతం మంది లేదనే చెప్పటం గమనార్హం. వేతనం పెరుగుతున్నా కూడా రోజురోజుకీ అధికమవుతోన్న ఖర్చులకు అది సరిపోవటం లేదని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చెప్పిన వారు ఢిల్లీలో 96% మంది ఉండగా, ముంబైలో 95%, పుణెలో 94%, బెంగళూరులో 93% మంది ఉన్నారు. పెద్ద నగరాల్లో జీవనవ్యయం భరించలేని స్థాయికి చేరుకోవటం వల్లనే గ్రామాలు, పట్టణాల నుంచి ఎక్కువ మంది నగరాలకు రావటం లేదని పలువురు అభిప్రాయపడ్డారు.

ఐటీ, తయారీ.. ఆకర్షణీయ రంగాలు

ఐటీ, తయారీ, టెలికాం రంగాల్లో అధిక వేతనాలు లభిస్తున్నాయని సర్వేలో వెల్లడైంది. కొత్తగా చేరుతున్న వారికి ఈ రంగాల్లో నెలకు సగటున రూ.28,100 నుంచి రూ.28,300 వరకూ జీతం లభిస్తోంది. అనుభవం ఉన్న వారికి రూ.68,200 వరకూ సగటు వేతనం ఉంటోంది. ప్రొడక్ట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో గరిష్ఠ వేతనాలు (సగటున నెలకు రూ.85,500) దొరుకుతున్నాయి. వెబ్‌సైట్‌లు, యాప్‌లకు రూపకల్పన చేసే ఉద్యోగాల్లో ఉన్న నిపుణులకు (యూఐ, యూఎక్స్ డిజైనర్లకు) సాఫ్ట్‌వేర్ డెవలపర్లతో సమానంగా వేతనాలు లభిస్తున్నాయి. సీనియర్ స్థాయిల్లో సగటున నెలకు రూ.65,000 వేతనం ఉంటోంది. పెద్ద నగరాలు, పేరు మోసిన నగరాలకే ఉద్యోగాలు పరిమితం కావటం లేదని, దేశంలోని ఇతర నగరాలు కూడా ఉద్యోగ, ఉపాధి కేంద్రాలుగా మారుతున్నాయని, ఈ నగరాల్లో జీవన వ్యయం కూడా తక్కువగా ఉంటోందని సర్వే వెల్లడించింది.

నగరం - వేతనం (రూపాయల్లో)

	వృత్తిపరమైన అనుభవం		
	5-8 ఏళ్లు	2-5 ఏళ్లు	0-2 ఏళ్లు
హైదరాబాద్	69,700	47,200	28,500
అహ్మదాబాద్	69,000	46,200	27,300
చండీగఢ్	68,400	45,500	26,300
బెంగళూరు	67,100	46,000	28,400
చెన్నై	66,400	46,600	30,100
ముంబై	66,400	45,700	28,500
ఢిల్లీ	64,400	43,600	26,300

భారత్‌లో 2500కు పైగా పార్టీలు

» ఘనా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ

» ఆశ్చర్యం వ్యక్తం చేసిన అక్కడి ఎంపీలు

» మోదీకి 'ది స్టార్ ఆఫ్ ఘనా'తో సత్కారం

అక్రా, జూలై 3: పశ్చిమ ఆఫ్రికా దేశం ఘనాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ.. ఆ దేశ పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యం గురించి గురువారం ప్రసంగించారు. ఘనాలో పర్యటించడం తనకు దక్కిన గౌరవమన్నారు. భారత్‌లో 2500కు పైగా రాజకీయ పార్టీలున్నాయని ఆయన చెప్పగా.. ఘనా ఎంపీలు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ఇది చూసి ప్రధాని మళ్లీ అదే విషయాన్ని గట్టిగా ప్రస్తావించగా.. అంతా చిరునవ్వులు చిందించారు. భారత్‌లో ప్రజాస్వామ్యం అనేది ఓ వ్యవస్థ మాత్రమే కాదని.. ప్రాథమిక విలువల్లో భాగమన్నారు. భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లిగా ఆయన అభివర్ణించారు. 'మా దేశంలో 22 పార్టీలు వివిధ రాష్ట్రాలను పాలిస్తున్నాయి. 22 అధికారిక భాషలున్నాయి. వేల కొద్ది మాండలికాలున్నాయి' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు మోదీని 'ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఘనా' అవార్డుతో సత్కరించారు. ఇక పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య పరిశోధన, అభివృద్ధి, ఔషధ తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి.



ఘనా పార్లమెంట్‌లో మాట్లాడుతున్న మోదీ



అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం

» ఈ అంశాన్ని క్రమశిక్షణా కమిటీ పరిశీలిస్తుంది

» మాట్లాడేటప్పుడు ఆధారాలు చూపాలి కదా?

» జూలైలో నామినేటెడ్ పోస్టుల భర్తీ: మహేశ్ కుమార్ గౌడ్

» పదేళ్లు అధికారంలో ఉండి బీసీల కోసం ఏం చేశారు?

» దీనిపై స్పష్టత ఇచ్చాక రైల్ రోకో చేయాలని కవితకు సూచన

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. ఈ అంశాన్ని క్రమశిక్షణా కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. ప్రతి పార్టీలోనూ కోవర్టులు ఉంటే ఉండొచ్చునని, కానీ మాట్లాడేటప్పుడు ఆధారాలు చూపాలి కదా? అని పేర్కొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆదేశాల మేరకు జూలైలో అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నామని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారని తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం మీడియా సమావేశంలో మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడారు. బీసీల గురించి ఖర్గేకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడం విచిత్రంగా ఉందన్నారు. ఆమె ఆ లేఖను బీఆర్ఎస్ పార్టీ తరఫున రాశారా? జాగృతి తరఫున రాశారా? అన్నది స్పష్టత లేదన్నారు. కవిత రైల్ రోకో, షిప్ రోకో, విమానం రోకో చేస్తారో కవిత ఇష్టం అని.. పదేళ్లపాటు అధికారంలోకి ఉండి బీసీలకు ఏం చేశారో అనేది ఆమె చెప్పి.. ఆ తర్వాతే రోకో చేయాలని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌ను తగ్గించింది కేసీఆర్ కాదా? అని నిలదీశారు. రాజకీయంగా తన ఉనికిని కాపాడుకోవడం కోసమే కవిత, బీసీల జపం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పుడు లిక్కర్ కేసులో కవిత జైలులో ఉన్నారని చెప్పారు. బీసీ నిరుద్యోగుల ఉసురు తగిలే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందన్నారు. బీజేపీకి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఒక్క బీసీ నేత కూడా దొరకలేదా? అని ప్రశ్నించారు. బనకచర్లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన సవాల్‌కు హరీశ్ రావు సిద్ధమా? అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, కేసీఆర్ గత పదేళ్ల నుంచి కలిసి రాజకీయాలు నడిపిస్తున్నారని, వారి మధ్య ఉన్నది ఫెవికాల్ బంధమని అన్నారు.

జపాన్‌లో రేపు ఏం జరగనుంది?

జూలై 5న భయంకరమైన సునామీ వస్తుందంటూ.. 1999లో చెప్పిన జపనీస్ మాంగా ఆర్టిస్ట్ టట్సుకీ

» కొవిడ్ గురించి, 2011లో జపాన్‌ను వణికించిన భూకంపం, సునామీలపై నిజమైన ఆమె జోస్యాలు

» రెండు వారాలుగా జపాన్‌లోని టొకారో దీవుల్లో 900కు పైగా భూప్రకంపనలతో ప్రజల్లో ఆందోళన



టోక్యో, జూలై 3: "జపాన్‌లో 2025 జూలై 5న ఒక పెనువిపత్తు సంభవిస్తుంది. జపాన్‌కి, ఫిలిప్పీన్స్‌కి నడుమ సముద్ర గర్భంలో చీలిక ఏర్పడుతుంది. దాని ప్రభావంతో 2011లో పెను విధ్వంసం సృష్టించిన సునామీకన్నా ఎత్తైన అలలు సముద్రంలో ఏర్పడతాయి"

..జపాన్‌కు చెందిన మాంగా ఆర్టిస్ట్, 'న్యూ బాబా వంగా'గా పేరొందిన ర్యోటుట్సుకీ రాసిన 'ద ఫ్యూచర్ ఐ సా' పుస్తకంలో చెప్పిన జోస్యం ఇది! 1999లో మొదటిసారి ప్రచురితమైన ఈ పుస్తకం.. 2021 అక్టోబరులో పునఃప్రచురితమైంది. 2019లో ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ సహా ఆ పుస్తకంలో ఆమె చెప్పిన పలు జోస్యాలు నిజంకావడంతో ఇది కూడా నిజమవుతుందేమోనని జపనీయులు భయపడుతున్నారు. గత రెండువారాలుగా దక్షిణ జపాన్‌లోని టొకారా దీవుల్లో 900కుపైగా భూప్రకంపనలు నమోదవడం వారి భయాన్ని మరింత పెంచుతోంది. "ఎప్పుడూ కదులుతున్నట్టే ఉంది. నిద్రపోవాలంటే భయమేస్తోంది" అని ఆ దీవుల ప్రజలు వాపోతున్నారు. సునామీ భయంతో సురక్షిత ప్రాంతానికి తరలిపోవాలని భావిస్తున్నారు. జూన్ 21 నుంచి మొదలైన ఈ భూప్రకంపనల తీవ్రత క్రమంగా పెరుగుతూ తాజాగా 5.5 తీవ్రతతో ఒక భూకంపం నమోదుకావడంతో జపాన్ వాతావరణ సంస్థ అప్రమత్తమైంది. అయితే.. టట్సుకీ జోస్యాన్ని నమ్మలేమని, అలాంటి సునామీ వస్తుందనడానికి ఎలాంటి సహేతుకమైన, శాస్త్రీయ ఆధారాలూలేవని జపాన్ వాతావరణ సంస్థ అధికారులు కొట్టిపారేస్తున్నారు. 12 దీవుల సమాహారమైన టొకారాలో.. 7 దీవుల్లో 700 మంది నివసిస్తున్నారు. 4 ప్రధాన టెక్టానిక్ ప్లేట్ల నడుమ 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'గా పేర్కొనే ప్రాంతంలో ఉండే జపాన్‌కు భూప్రకంపనలు కొత్తకాదు. ముఖ్యంగా టొకారో దీవుల్లో ఉండే వారికి భూప్రకంపనలు సాధారణమే. 2023 సెప్టెంబరులో అక్కడ 346 ప్రకంపనలు నమోదయ్యాయి. కానీ టట్సుకీ చెప్పిన తేదీ దగ్గర పడుతున్న సమయంలో ఇన్ని ప్రకంపనలు వారిని భయపెడుతోంది.

టూరిస్టులూ రావట్లే..

టట్సుకీ జోస్యం గురించి విస్తృతంగా ప్రచారంకావడంతో చైనా, దక్షిణ కొరియా, తైవాన్ దేశాల నుంచి జపాన్‌కు ఎక్కువగా వచ్చే పర్యాటకుల సంఖ్య మూడు నెలలుగా బాగా తగ్గిపోయింది. కిందటి ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో పర్యాటకుల సంఖ్య 50శాతం తగ్గింది. సాధారణంగా హాంకాంగ్ నుంచి జపాన్‌కు వెళ్లే పర్యాటకులు సంఖ్య ఎక్కువుంటుంది. జూన్-జూలై నెలల్లో హాంకాంగ్ నుంచి జపాన్‌కు విమాన టికెట్ల బుకింగ్‌లు 83శాతం పడిపోయాయి. బుకింగ్‌లు లేకపోవడంతో దక్షిణ జపాన్‌లోని పలు నగరాలకు ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో నడపాల్సిన విమానాలను హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ రద్దు చేసింది. తస్మాత్ జాగ్రత్త: "2020 ఏప్రిల్‌లో ప్రపంచమంతా ఒక వైరస్ వ్యాపిస్తుంది.."అంటూ కొవిడ్ గురించి టట్సుకీ 1999లోనే జోస్యం చెప్పారు. అది నిజమైంది. ఆమె జోస్యం అక్కడితో ఆగలేదు. "ఆ వైరస్ కొంతకాలం పాటు మాయమై 2030లో మరింత ప్రాణాంతకంగా మారి మళ్లీ వస్తుంది"అని చెప్పారు. ఆమె చెప్పినట్టే జపాన్‌లో ఇప్పుడు సునామీవస్తే 2030ని తల్చుకుని ప్రపంచం వణికిపోవడం ఖాయం!!

పెళ్లయిన 45 రోజులకే భర్తను చంపించింది!

» ఇద్దరు కిరాయి హంతకులతో హత్య చేయించిన వధువు

» పెళ్లికి నెలన్నర ముందు నుంచి మేనమామతో వివాహేతర సంబంధం.. బిహార్‌లో ఘటన

పట్నా, జూలై 3: మేఘాలయలో హనీమూన్ హత్య ఘటన తరహాలోనే బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. పెళ్లయిన 45 రోజులకే ఓ యువతి, తన ప్రియుడి సహకారంతో భర్తను కిరాయి హంతకులతో చంపించింది. నిందితురాలు 23ఏళ్ల గుంజాదేవి. ఆమెకు నబీన్‌నగర్ సమీపంలోని బర్వాన్ గ్రామానికి చెందిన ప్రియాంశు (25)తో పెళ్లయింది. ఈ వివాహం ఆమెకు ఇష్టంలేదు. పెళ్లికి నెలన్నర ముందు నుంచి గుంజాదేవికి తన మేనమామ జీవన్‌సింగ్ (55)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. గుంజాదేవి-జీవన్ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. దీనికి ఇరువైపుల పెద్దలు అంగీకరించలేదు. ఆ తర్వాత ప్రియాంశుతో గుంజాదేవికి బలవంతంగా పెళ్లి జరిపించారు. ఆ తర్వాత కూడా.. జీవన్‌ను ఆమె మరిచిపోలేకపోయింది. భర్త ప్రియాంశును హత్య చేయించేందుకు జీవన్ సహకారంతో ఇద్దరు కిరాయి హంతకులను మాట్లాడుకుంది. జూన్ 25న తన సోదరిని కలిసేందుకు వెళ్లిన ప్రియాంశు నబీనగర్ రైల్వే స్టేషన్‌లో దిగాడు. తనను తీసుకెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు ఎవరినైనా పంపాలని గుంజాదేవికి ఫోన్ చేశాడు. దీన్నే అవకాశంగా తీసుకున్న ఆమె కిరాయి హంతకులను రైల్వే స్టేషన్‌కు పంపింది. వారు ప్రియాంశును బైక్‌పై ఎక్కించుకొని మార్గమధ్యలో తుపాకీతో కాల్చిచంపారు. ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఎస్పీ ఏర్పాటు చేశారు. కుటుంబసభ్యులను పోలీసులు ప్రశ్నిస్తుండటంతో భయపడి అత్తగారి ఇంట్లోంచి పారిపోయేందుకు ప్రయత్నించిన గుంజాదేవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి ఫోన్‌లో కాల్‌లిస్ట్‌ను పరిశీలించిన పోలీసులు.. భర్త హత్యకు గురైన రోజు జీవన్ నంబర్‌కు ఆమె పదేపదే ఫోన్ చేసినట్లు గుర్తించారు. గుంజాదేవి నుంచి హత్యకు సుపారీ తీసుకున్న ఇద్దరిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న జీవన్‌ను పట్టుకునే పనిలో ఉన్నారు. కాగా ఔరంగాబాద్ జిల్లా నబీనగర్ సమీపంలో రెండు వారాల క్రితం ఇలాంటి ఘటనే జరిగింది. పెళ్లయిన కొన్నిరోజులకే పూజ అనే యువతి, తన ప్రియుడు కమలేశ్ యాదవ్‌తో కలిసి భర్త బిక్కూను హత్యచేసేందుకు యత్నించింది.

యువతిని రేప్ చేసి.. ఆమె ఫోన్‌తో సెల్ఫీ దిగి!

» కొరియర్ బాయ్‌నని చెప్పుకొని ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు..

» పుణెలోని రెసిడెన్షియల్ సొసైటీలో ఘోరం

పుణె, జూలై 3: డెలివరీ బాయ్‌నని చెప్పుకొని ఇంట్లోకి చొరబడ్డ దుండగుడు ఒంటరిగా ఉన్న యువతి (22)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫోన్‌తోనే అతడు సెల్ఫీ దిగి.. 'నేను మళ్లీ వస్తా'అంటూ బెదిరింపు సందేశాన్నుంచడం గమనార్హం! పుణెలోని అత్యంత కట్టుదిట్టమైన భద్రత గల కోండ్వాలోని రెసిడెన్షియల్ సొసైటీలో ఈ ఘటన జరిగింది. కొరియర్ డెలివరీ బాయ్‌గా చెప్పుకొని దుండగుడు యువతి ఉంటున్న ఫ్లాట్‌కు వెళ్లాడు. బ్యాంకు నుంచి లెటర్ వచ్చిందని సంతకం చేసి తీసుకోవాలంటూ యువతితో దుండగుడు చెప్పాడు. పెన్నుందా? అని అడిగిన యువతి, అతడు తన వద్ద లేదని చెప్పడంతో తెచ్చేందుకు ఆమె పడకగదిలోకి వెళ్లింది. వెంటనే ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు పడకగదిలోకి వెళ్లి ఆమె ముఖంపై మత్తు మందు స్ప్రే కొట్టాడు. స్పృహ కోల్పోయిన ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలికి మెలకువ వచ్చేసరికి ఫోన్లో.. 'నేను మళ్లీ వస్తాను'అనే మెసేజ్ ఉంది. దుండగుడు ఆమె ఫోన్‌తోనే సెల్ఫీ దిగాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

చివరి ఆశలూ ఆవిరే!

సిగాచి పరిశ్రమలో కూలిన భవనం శిథిలాలన్నీ తొలగించినా దొరకని మృతదేహాలు

- 4 రోజులైనా ఆచూకీ లేని పది మంది
- 'కనీసం మా వాళ్ల ఎముకలైనా ఇవ్వండి' అంటూ కన్నీళ్లు పెడుతున్న కుటుంబాలు
- ప్రమాద సమయంలో ప్లాంటులో సమావేశం.. అందుకే భారీగా మరణాలు
- ఇప్పటివరకు 31 మృతదేహాల గుర్తింపు


పేలుడుకు కూలిన భవనం శిథిలాలను తొలగిస్తున్న సహాయక సిబ్బంది

సంగారెడ్డి ప్రతినిధి/పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్/రామచంద్రాపురం టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమ ప్రమాదంలో గల్లంతైన వారి ఆచూకీ విషయంలో బాధితుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రమాదం జరిగి నాలుగు రోజులైనా కూడా పది మంది ఆచూకీ లభించలేదు. దుర్ఘటన జరిగిన స్థలంలో గురువారం సాయంత్రానికి శిథిలాలన్నీ తొలగించినా మృతదేహాలేవీ లభించలేదు. శిథిలాలను కాస్త దూరంగా ఖాళీ స్థలంలో పోసి, అణువణువు జల్లెడపడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని కాలిపోయిన చిన్న చిన్న మాంసపు ముద్దలు, ఎముకల ముక్కలు మాత్రమే లభించినట్టు తెలిసింది. అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు ఆ భాగాలను పరిశీలన కోసం పంపించారు. మరోవైపు బాధిత కుటుంబాల ఆందోళనకు అంతులేకుండా పోయింది. వారంతా పరిశ్రమ, మార్చురీ, క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రుల వద్ద ప్రతి ఒక్కరికీ సెల్‌ఫోన్లలో తమవారి ఫొటోలను చూపిస్తూ.. జాడ కోసం తిరుగుతున్నారు. నాలుగు రోజులుగా పడిగాపులు కాస్తున్నామని, ఎక్కడా తమవారి ఆనవాళ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమవారి శరీర భాగాలైనా, ఎముకలైనా అప్పగిస్తే.. అంతిమ సంస్కారాలు నిర్వహించుకుంటామంటూ అధికారులను ప్రాధేయపడుతున్నారు. మరోవైపు.. సిగాచి పరిశ్రమలో కూలిన ప్లాంటుతో పాటు మూడంతస్తుల భవన శిథిలాల తొలగింపు పూర్తయింది. శిథిలాల్లో శరీర భాగాలు, ఎముకలు, ఇతర ఆధారల కోసం ఫోరెన్సిక్ నిపుణులు గాలిస్తున్నారు. గురువారం పలువురు మృతులు, క్షతగాత్రుల గుర్తింపుకార్డులు, సెల్‌ఫోన్లు, పర్సులు, ఇతర వస్తువుల తోపాటు కాలిపోయిన కొన్ని మాంసం ముద్దలు, ఎముకల ముక్కలు మాత్రమే లభ్యమైనట్టు సమాచారం.

ఆ పది మంది పరిస్థితి ఏమిటి?

ప్రమాద సమయంలో పరిశ్రమలో మొత్తం 143 మంది కార్మికులు, సిబ్బంది ఉండగా.. 60 మంది సురక్షితంగా బయటపడ్డారు. 35 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, మరో 38 మంది మృతి చెందినట్టు చెబుతున్నారు. మిగతా 10మంది ఆచూకీ లభించలేదు. వారు ప్రమాదం జరిగిన సోమవారం ఉదయం విధుల్లోకి వెళ్లినట్లుగా కుటుంబసభ్యులు చెబుతున్నారు. కంపెనీ రికార్డుల్లోనూ వారు హాజరైనట్టు ఉంది. మార్చురీలో గుర్తించని మృతదేహాల సంఖ్య కంటే ఆచూకీ తెలియనివారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారు ఏమయ్యారన్నదానిపై అధికారుల వద్ద సమాధానం కరువైంది. తమ వారి ఆచూకీ చెప్పాలంటూ మార్చురీకి వస్తున్న ప్రతి ఒక్కరి నుంచి రక్త నమూనాలను వైద్య సిబ్బంది సేకరించి, డీఎన్‌ఏ పరీక్షలకు పంపిస్తున్నారు. అయి తే పలు సాంకేతిక కారణాలతో ఫలితాలు రావడంలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు.

31 మృతదేహాల గుర్తింపు

అధికారులు గురువారం మరో 13 మృతదేహాలను గుర్తించారు. దీంతో గుర్తించిన మృతదేహాల సంఖ్య 31కి చేరింది. మరో 7 మృతదేహాలు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉన్నాయి. గుర్తించిన మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించి, రూ.లక్ష తక్షణ సహాయంగా అందించి, స్వస్థలాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మరోవైపు గాయాలతో మియాపూర్ ప్రణమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18 మందిలో 11 మందిని గురువారం డిశ్చార్జి చేశారు. మిగతా ఏడుగురిలో ఐదుగురు ఐసీయూలో, ఇద్దరు జనరల్ వార్డులో చికిత్స పొందుతున్నారు.

మీటింగ్ వల్లే మృతుల సంఖ్య పెరిగిందా?

ప్రమాద సమయంలో ప్లాంటు పైన ఉన్న క్వాలిటీ కంట్రోల్ విభాగంలో 25 మంది సిబ్బందితో నెలాఖరు సమీక్ష జరుగుతుండగా పేలుడు జరిగి భవనం కుప్పకూలడంతో వారంతా మంటల్లో చిక్కుకున్నట్టు తెలిసింది. ఇప్పటివరకు గుర్తించిన మృతదేహాల్లో క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందినవారే ఎక్కువగా ఉండటం దీనికి సాక్ష్యమని అంటున్నారు. కాగా, ప్రమాదంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. సుమారు మూడు గంటల పాటు పరిశ్రమలోని అన్ని విభాగాలను సందర్శించి, పలు నమూనాలను సేకరించింది. పరిశ్రమ అధికారులు, సిబ్బందిని ప్రశ్నించింది.

అస్థికలు ఇచ్చినా వెళ్లిపోతాం..

సిగాచీ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా జీ.సింగడం మండలం పాలకన్యం గ్రామానికి చెందిన కెమిస్ట్ వెంకటేశ్ (27) ఆచూకీ గల్లంతైంది. వెంకటేశ్ అస్థికలు ఇచ్చినా, తీసుకెళ్లి అంతిమ సంస్కారాలు చేసుకుంటామని కుటుంబ సభ్యులు అధికారులను వేడుకుంటున్నారు.


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న నిపుణులు


శిథిలాల్లో బయటపడిన శరీర భాగాలు

9 మంది ఆచూకీ తెలియడం లేదు

- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది మంది ఆచూకీ తెలియడం లేదని, వారి కోసం అన్వేషణ కొనసాగుతోందని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. పరిశ్రమ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు మొత్తంగా 31 మంది కార్మికులను గుర్తించామని, మరో 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు.

అల్లుడికి తీవ్ర గాయాలు.. సొమ్మసిల్లిన మామకు రూ. లక్ష బిల్లు

తీవ్రంగా గాయపడి పటాన్‌చెరులోని ధ్రువఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూన్‌మూన్ చౌదరి అనే కార్మికుడిని చూసేందుకు ఆయన మామ బీరేంద్రచౌదరి బుధవారం బిహార్ నుంచి వచ్చారు. ఆస్పత్రిలో అల్లుడిని చూసి షాక్‌లో కుప్పకూలిపోయాడు. అదే ఆస్పత్రిలో బీరేందర్‌ను చేర్పి చికిత్సఅందించారు. ఒక్కరోజుకే రూ.లక్ష బిల్లువేసి, అందులో రూ.75వేలు వసూలు చేశారని, ఆపత్కాలంలో దోపిడీకి తెగబడ్డారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో.. తర్వాత మాయం!

ప్రమాదం జరిగిన రోజు తీవ్రంగా గాయపడిన కార్మికుడు చోటేలాల్ (27)ను ఇస్నాపూర్ కాకతీయ ఆస్పత్రికి తరలించారు. ఆయన బెడ్‌పై చికిత్స తీసుకుంటున్న దృశ్యాలను కొందరు సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు కూడా. తర్వాత ఆయన పరిస్థితి విషమించడంతో అదే రోజున పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. కానీ ఆ తర్వాతి నుంచి చోటేలాల్ ఎక్కడున్నాడో తెలియదని ఆయన భార్య సంజూదేవి కన్నీళ్లు పెడుతున్నారు. మార్చురీలో తన భర్త మృతదేహం లేదని, ఒకవేళ చికిత్స పొందుతూ మృతి చెందితే సమాచారం ఉంటుందని కదా అని ఆమె ప్రశ్నిస్తున్నారు. పోలీసులు చోటేలాల్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాకు చెందిన చోటేలాల్ భార్య, ఇద్దరు పిల్లలతో కలసి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నారు.


ఫోన్‌లో ఫొటో చూపిస్తూ.. గాయపడిన తన భర్త ఏమయ్యాడని ప్రశ్నిస్తున్న సంజూదేవి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సుర్వీ యాదయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, నాగయ్య, మల్లయ్య తదితరులు

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

- మంత్రి సీతక్కకు సర్పంచుల జేఏసీ విజ్ఞప్తి
- లేదంటే 18న ఇందిరా పార్కు వద్ద ధర్నా

గన్‌పార్క్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల (2019-24) పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు సత్వరం మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ధనసరి సీతక్కకు తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆమెకు గురువారం జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తే, సర్కారు బిల్లులు విడుదల చేయక తమపై వడ్డీల భారం పెరిగిందని, ఫలితంగా సర్పంచ్‌లు మరింత అప్పుల ఊబిలో చిక్కుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టగానే పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల పాటు జాప్యం చేయడం తగదన్నారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, సహాయ కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, నేతలు ఎల్లారెడ్డి, అర్వింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ఖర్గే స్పష్టత నివ్వాలి: జాజుల

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పెంపునకు జాతీయ స్థాయిలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగే సామాజిక న్యాయభేరి సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్యాచరణ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ పైనే ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి సీఎం రేవంత్ రెడ్డి ఒత్తిడి తేవాలన్నారు.

స్థానికంలో 80% స్థానాలు బీఆర్ఎస్‌కే: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పనితీరుపై ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఇది బీఆర్ఎస్‌కు ఉపయోగపడనుందని, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే.. 80శాతం స్థానాల్లో గులాబీ పార్టీ గెలిచే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్లకుంట్ల కవిత పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడం కోసం తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న రైల్‌రోకో చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆమె తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో జాగృతి నాయకులు ఎవరైనా.. పోటీచేయాలని భావిస్తే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తిచేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే కేటీఆర్‌కు లేఖ రాయాలని తాను జాగృతి కార్యకర్తలకు విజ్ఞప్తి చేశానని చెప్పారు. జాగృతి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు బీఆర్ఎస్ నాయకులు కూడా వస్తున్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే స్పష్టతనివ్వాలని కోరారు.

ఇకపై జిల్లా యూనిట్‌గా కోడిగుడ్ల టెండర్లు

- జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా 15 మందితో కొనుగోలు కమిటీలు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్ల కొనుగోళ్లలో ఇకపై ఒక జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్‌వాడీలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, వసతి గృహాలన్నిటికీ జిల్లాస్థాయిలో ఒకే టెండర్‌ను పిలవనుంది. దీనికి సంబంధించి కొనుగోళ్ల బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా ఉండే 15 మంది సభ్యులతో కూడిన కోడిగుడ్ల కొనుగోళ్ల కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కమిటీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా ఉంటారు. జిల్లా విద్యాశాఖాధికారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జిల్లా అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఇకపై జిల్లా కొనుగోళ్ల కమిటీల సమక్షంలోనే టెండర్ల ప్రక్రియ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 35,781 అంగన్‌వాడీలకు ప్రతి ఏటా 19.60 కోట్ల కోడిగుడ్లను సరఫరా చేయాల్సి ఉంది. మొత్తం గురుకులాలు, వసతి గృహాలను కలిపితే ప్రతి ఏటా దాదాపు 80 కోట్ల కోడిగుడ్లను సరఫరా చేయాల్సి ఉంది.

కాటేదాన్ రబ్బర్ కంపెనీలో అగ్నిప్రమాదం

రాజేంద్రనగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లోని నేతాజీ నగర్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారుజామున తిరుపతి రబ్బర్ కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిశ్రమలో రబ్బరు సామగ్రి ఎక్కువగా నిలువ ఉండటంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో స్థానికులు భయాందోళనలతో ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. నాలుగు ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో కార్మికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. పరిశ్రమలో కార్లలో ఉపయోగించే రబ్బర్ మ్యాట్లు తయారవుతాయని, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నేడు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారి జాబితా విడుదల

బాసర, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 2025-26 విద్యా సంవత్సర ప్రవేశాల కోసం ఎంపికైన విద్యార్థుల జాబితా శుక్రవారం విడుదల కానుం ది. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. గోవర్ధన్ ఈ జాబితాను విడుదల చేయనున్నారు. ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల కోసం ఈసారి 20,258 దరఖాస్తులు వచ్చాయి. బాసర క్యాంపస్‌లో 1500 సీట్లతో పాటు ఈ ఏడాది కొత్తగా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన క్యాంపస్‌లో 180 సీట్లు కలిపి.. మొత్తం 1680 మంది విద్యార్థులకు అధికారులు ప్రవేశం కల్పించనున్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. పూర్తి వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.ac.in లో చూడొచ్చని అధికారులు తెలిపారు.

అన్నం తింటే షుగర్ అపోహే.. చద్దన్నం ఎంతో మేలు

- చక్కెర శాతం తక్కువ ఉండే బియ్యం రూపకల్పనకు కృషి
- ఎన్‌జీ రంగా వర్సిటీ పరిశోధనా సంచాలకుడు పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అన్నం తింటే షుగర్ స్థాయి పెరుగుతుందనేది కేవలం అపోహ మాత్రమేనని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. అన్నంతోపాటు పప్పు, కూరగాయలు, నెయ్యి, మాంసాహారం కలిపి తింటాం కాబట్టి షుగర్ గురించి ఆందోళన అవసరం లేదన్నారు. గురువారం ఆయన యూనివర్సిటీలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. "బియ్యం రకం, మిల్లు ఆడించే పద్ధతిని బట్టి అన్నంలో గ్లైసెమిక్ ఇండెక్స్ (రక్తంలో చక్కెరస్థాయిని కొలిచే సూచిక) విలువలు మారిపోతాయి. ఉదాహరణకు ముడి బియ్యంలో కంటే ఎక్కువగా చక్కెర స్థాయిలు తెల్ల బియ్యంలో ఉంటాయి. బియ్యం పాలిష్ పట్టే సమయంలో బయటి ఊక పొర తొలగించడం వల్ల చక్కెర శాతం పెరుగుతుంది. దేశవాళీ బియ్యం, ఎర్ర బియ్యంలో అధిక పీచు, పోషకాలు ఉంటాయి. ఈ కారణంగా తక్కువ చక్కెర స్థాయిలు ఉంటాయి. ఏపీలో ఎక్కువగా వినియోగించే సాంబ మసూరిలో కూడా ఇవి తక్కువగానే ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది." అని ఆయన వివరించారు. చద్దన్నం తినడం ద్వారా ఆయుష్షును మరింత పెంచుకోవచ్చునని ఆయన తెలిపారు. చక్కెర శాతం తక్కువగా ఉంటే బియ్యం రకాల రూపకల్పనకు మరిన్ని ప్రయత్నాలు జరగాల్సిన ఆవశ్యకత ఉందని డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. ఎన్‌జీ రంగా యూనివర్సిటీ నుంచి విడుదలైన బీపీటీ 5204, బీపీటీ 2270, ఎంటీయూ 1224, బీపీటీ 2841 రకాలు తక్కువ చక్కెర స్థాయిలను కలిగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దేశావళి బియ్యం రకాలైన ఇంద్రాణి, రక్తశాలి కూడా మధ్యస్థంగా చక్కెర స్థాయిలు కలిగిఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు.

అర్థ గణాంక శాఖలో 166 పోస్టుల మంజూరు

- అక్కర్లేని 38 పోస్టుల రద్దు.. కొత్తపోస్టుల భర్తీకి ప్రభుత్వం ఓకే

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): కాలానుగుణ మార్పులు, జిల్లాల పునర్‌వ్యవస్థీకరణ నేపథ్యంలో అర్థగణాంక శాఖలో అక్కర్లేని 38 పోస్టులను రద్దుచేసి వాటి స్థానంలో 166 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 12 ప్రధాన ప్రణాళికాధికారి, 12 సహాయ సంచాలకులు, 46 గణాంకాధికారులు, 64ఉప గణాంకాధికారులు, 5 సూపరింటె ండెంట్, 23 జూనియర్ అసిస్టెంట్ పోస్టులున్నాయి. ఈమేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా గురువారం జీవో జారీ చేశారు. 8 సహాయ గణాంకాధికారులు, 15 టైపిస్ట్, 8 ఎల్‌డీ స్టెనో, 7 డ్రైవర్ పోస్టులు రద్దు చేసిన వాటిలో ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసిన పోస్టులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సాంత్వననివ్వని క్వాడ్

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పాతికమంది పర్యాటకులను ఉగ్రవాదులు చంపివేసిన ఘటనను క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం ఖండించినందుకు సంతోషించాల్సిందే. 'ఉగ్రవాద, తీవ్రవాద చర్యలను క్వాడ్ ఖండిస్తుంది,ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు మా సహకారం ఉంటుంది, ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడిపై త్వరగా దర్యాప్తు పూర్తిచేసి, నేరస్థులనూ వారిని ప్రోత్సహించేవారినీ శిక్షించాలి' అని ఆ ప్రకటన పేర్కొంది. అమెరికాలో జరిగిన ఈ సమావేశంలో భారతవిదేశాంగ మంత్రి జయశంకర్ ప్రసంగిస్తూ, పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి లోతుగా వివరించారు. ఉగ్రవాదులనుంచి తన ప్రజలను రక్షించుకొనే హక్కు భారత్‌కు ఉన్నదన్న భారత్ వాదనను క్వాడ్ భాగస్వాములు అర్థంచేసుకున్నారంటూ ఆయన కృతజ్ఞతలు కూడా తెలియచేశారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది నేనేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అదేపనిగా అంటున్నప్పటికీ, భారత్ ప్రతీకారదాడిని క్వాడ్ దేశాలు మౌనంగా ఆమోదించాయనే అనుకుందాం. అయితే, పహల్గాం దాడికి కారకులైనవారినీ, ఆ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నవారినీ శిక్షించాలన్న ఓ సాధారణ వ్యాఖ్యతో ఖండనను సరిపెట్టడం మాత్రం చాలామంది రాజకీయ విశ్లేషకులకు నచ్చడం లేదు. ఉగ్రదాడి కారకులూ, ప్రోత్సాహకులు ఎవరో తెలిసికూడా, శిక్షపడాల్సినవారూ శిక్షించాల్సినవారూ కలసి చేసిన కుట్ర ఇది అన్న గుర్తింపు ఉండి కూడా పాకిస్థాన్ పేరు క్వాడ్ ప్రస్తావించకపోవడం సరికాదని వారి అభిప్రాయం. బాధితులనూ, నేరస్థులనూ సమానంగా చూడకండని అంతగట్టిగా బల్లగుద్దిన విదేశాంగమంత్రి, పహల్గాం ఉగ్రఘాతుకాన్ని ప్రస్తావించి, ఖండించినందుకే సంతోషపడటం రాజకీయ విశ్లేషకులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. చైనామీద ఎన్నడూ లేనంతగా విరుచుకుపడిన ఆ సంయుక్త ప్రకటనలో, పహల్గాంతో ముడిపడిన పాక్ ప్రస్తావన కూడా కాస్తంత స్పష్టంగా ఉండివుంటే మరింత బాగుండేది.

ఇది సీమాంతర ఉగ్రవాదం, పాకిస్థాన్ నుంచి చొరబడిన టెర్రరిస్టులు పర్యాటకులమీద ఈ దారుణానికి ఒడిగట్టారని భారత్ ప్రపంచానికి స్పష్టంగా చెబుతోంది. ఈ మధ్యనే జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సివో) సదస్సులో పహల్గాం ప్రస్తావన చేయనందుకు భారత్‌కు ఆగ్రహం కలిగింది. బలూచిస్థాన్ రైలుదాడి ఘటనను ప్రస్తావించి, పహల్గాం ఊసెత్తనందుకు అవమానం కూడా మిగిలింది. పైగా, బలూచ్ ఉగ్రవాదులకు భారత్ సహకరిస్తోందని పాకిస్థాన్ ఈ సదస్సులో విరుచుకుపడింది కూడా. అయినా, పాకిస్థాన్‌ను పల్లెత్తుమాట అననీయకుండా చైనా ఈ సదస్సులో అడ్డుపడిందన్నది సుస్పష్టం. రష్యా కూడా సభ్యదేశంగా ఉన్నా ఆ సదస్సులో మనకు అన్యాయమే జరిగింది. ఈ నేపథ్యంలో, సంయుక్త ప్రకటనపై సంతకం చేసేందుకు నిరాకరించి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చాలా మంచిపనిచేశారు.

మరి, కరడుగట్టిన చైనా వ్యతిరేక క్వాడ్ కూటమి సమావేశంలో పాకిస్థాన్‌ను ఓ మాట అనకుండా ఆపిందెవరు? పాకిస్థాన్ ఊసెత్తకుండా పహల్గాం ప్రస్తావన చేయడానికి మనం అంగీకరించడంతో నాలుగుదేశాలూ కలిసి ఒక్కమాటగా ఈ నాలుగుమాటలైనా అనగలిగాయట. అమెరికా అధ్యక్షుడికి మనమీద ప్రేమనశించి, పాకిస్థాన్ మీద మనసు పడుతున్న ఈ కాలంలో ఈ మాత్రం సాధించడమే గగనమనుకోవచ్చు. పహల్గాం పాపానికి మేమేకారకులమని ప్రకటించిన రెసిస్టెన్స్‌ఫ్రంట్ పేరును కూడా ఆఖరునిముషంలో ఐక్యరాజ్య సమితి తీర్మానంనుంచి తీసివేయించిన గతాన్ని గుర్తుచేసుకుంటే క్వాడ్ తీర్మానం బాగున్నట్టే. ఎస్‌సివో, క్వాడ్ రెండూ భిన్న ధ్రువాలు. వాటి నిర్మాణం, నేపథ్యం, భౌగోళిక దృక్కోణం పూర్తిగా వేరు. ఆసియాలో పాశ్చాత్యదేశాల ప్రాభవ ప్రభావాలను అడ్డుకోవడానికి ఎస్‌సీవో ఏర్పడితే, చైనా వీరంగానికి ముకుతాడు వేయడానికి క్వాడ్ పుట్టుకొచ్చింది. భారత్ సహకారంలేకుండా ఈ సంస్థ ఆవిర్భావ లక్ష్యం నెరవేరదన్నది నిజం. చైనాను నియంత్రించాలంటే బలమైన భారత్‌ను మరింత బలోపేతం చేయాల్సిందే. ఇటీవలి ఎస్‌సివో సంయుక్త ప్రకటనను పాక్ అనుకూల తీర్మానంగా మన విశ్లేషకులు అభివర్ణించారు. మరి, క్వాడ్ తీర్మానం బాధలో ఉన్న భారత్‌ను సముచితంగా ఓదార్చిందా? అన్నది ప్రశ్న.

'న్యూ ఇండియా'లో నిరర్థక భాషా సమరాలు

'ఈ దేశంలో ఇంగ్లీషు మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు రానున్నాయి. అటువంటి భారత దేశ ఆవిర్భావం మరెంతో దూరంలో లేదు' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిభాషించారు 'మరాఠీ భాషీయులపై హిందీని రుద్దేందుకు జరిగే ఎటువంటి ప్రయత్నాన్ని సహించబోమని' మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన నాయకుడు రాజ్ ఠాక్రే గర్జించారు. 'మరాఠీ మాతృభాషగా ఉన్న ప్రజల్లో హిందీ ద్వారా విభజనలు సృష్టించేందుకు ఎట్టి పరిస్థితులలోను పూనుకోవద్దు' అని శివసేన (యూబీటీ) నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే హెచ్చరించారు. 'తమిళనాడులో తమిళ భాషకు యుక్తమైన స్థానముండాలని గట్టిగా కోరడం నేరమా? అలా కోరినందుకే, తమ భాషే అన్నిటికీ అర్హమైనదని సంకుచితంగా ఆలోచించే కొంతమంది మనలను తమిళ భాషా దురభిమానులు అని నిందిస్తున్నారు; తమిళ భాషావాదులు జాతివ్యతిరేకులు అని ఆక్షేపిస్తున్నారు. నిజానికి భాషా దురభిమానులు ఎవరు? హిందీ భాషా దురహంకారులే. జాతీయ భాషా ప్రతిపత్తి హిందీ హక్కు అని ఆ భాషా దురహంకారులు విశ్వసిస్తున్నారు. ఆ అభిజాత్యాన్ని, ఆధిపత్యాన్ని మనం ప్రతిఘటించడాన్ని దేశద్రోహంగా వారు పరిగణిస్తున్నారు' అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్ నిరసించారు.

మన రాజకీయ పార్టీల అజెండాలలో భాషా 'యుద్ధాలు' మళ్లీ ప్రాధాన్యం పొందుతున్నాయి. భాషా దురభిమానం స్వతంత్ర భారత రాజకీయాలలో మొదటి నుంచీ ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగపడుతూ వస్తోంది. సుదీర్ఘ విరామమనంతరం రాజకీయులు మళ్లీ ఆ అస్త్రాన్ని ఝుళిపిస్తున్నారు. అది తుప్పుపట్టి పోయిందని ప్రజలు భావిస్తున్నారు. దాన్ని ప్రయోగిస్తున్నవారు తమ కపట ఉద్దేశాలను కప్పిపుచ్చగలరా? కాలం కుమ్మరించిన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నాయకులు సంకుచిత రాజకీయ అజెండాలను తలకెత్తుకుంటున్నారు.

అమిత్ షా మనోవేదన ఏమిటి? ఆంగ్ల భాషా ప్రాభవంపై ఆయన అయిష్టత, ఆగ్రహం సంఘ్ పరివార్ హిందీ–హిందూ–హిందుస్తాన్ భావజాల జనితాలే, సందేహం లేదు. ఇంగ్లీషు వలస పాలన అవశేషమని, 'భారతీయ సంస్కృతి'కి అది విరుద్ధమైనదని ఆ భావజాలం విశ్వసిస్తుంది. అమిత్ షా ఆ భావజాల అనుయాయుడు. అయితే మన హోం మంత్రి తన విద్యార్థి జీవితంలో అహ్మదాబాద్‌లోని సెయింట్. జేవియర్ కళాశాలలో ఒక బయోకెమిస్ట్రీ కోర్సులో చేరారు. ఆ కళాశాల ఆంగ్ల విద్యాధికులు అయిన ఉన్నతవర్గాల వారి విద్యాలయంగా సుప్రసిద్ధమైనది. ఆ తరువాత ఆయన అదే నగరంలోని సీయూ షా కళాశాలకు మారారు. అమిత్ షా తనయుడు జే షా (క్రికెట్ క్రీడా సామ్రాజ్య సర్వోన్నత సంస్థ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు) అహ్మదాబాద్‌లోని లయోలా హాల్‌లో చదివారు. ఉన్నత వర్గాలవారు తమ పిల్లల విద్యాభ్యాసానికి అగ్రప్రాధాన్యమిచ్చే ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో అదొకటి.

అయినా అమిత్ షా ఆంగ్ల భాష పట్ల తన అసహ్యాన్ని ఎన్నడూ దాచుకోలేదు. అహ్మదాబాద్‌లోని సీనియర్ జర్నలిస్ట్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఆయన 'టైమ్స్ ఆఫ్ ఇండియా' విలేఖరి. భారతదేశ అగ్రగామి వార్తాపత్రిక అయిన ఆ దినపత్రికను తాను చదవనే చదవనని రాజీవ్‌కు ఒకసారి అమిత్ షా (గుజరాత్ మంత్రిగా ఉన్న కాలంలో) చెప్పారట. అది ఇంగ్లీష్ డైలీ కావడమే అందుకు కారణమని కూడా ఆయన సెలవిచ్చారు. నెలల అనంతరం ఒక ఎన్నికల ప్రచార సభలో రాజీవ్‌ను చూసిన అమిత్ షా టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన ఒక వార్త విషయమై ఆక్షేపణ తెలిపారట. మీరు ఇంగ్లీష్ పత్రికలు చదవరు కదా ఆ వార్త విషయం ఎలా తెలిసింది అని రాజీవ్ ప్రశ్నించగా మీ పత్రికను నేను చదవకపోయినా అందులో వచ్చిన వార్త గురించి చాలా మంది నాకు చెప్పారని అమిత్ షా వెన్వెంటనే తీక్షణంగా సమాధానమిచ్చారట.



భాషాయుద్ధాలు చేస్తున్నవారు తాము విఫలం కానున్న పోరాటాలు చేస్తున్నామనే సత్యాన్ని గ్రహించాల్సిన అవసరమున్నది. అవి తాత్కాలిక రాజకీయ లబ్ధినివ్వవచ్చునేమో కాని నిరవధిక ప్రయోజనాలను సమకూర్చలేవు. భాషా వైవిధ్యమే భారతదేశ మహా బలం. బహు–భాషా నైపుణ్యాలు స్పర్థాత్మక సానుకూలతలను కల్పిస్తాయి. కొత్త ఆలోచనలు చేయలేని రాజకీయవేత్తలే భాషా దురహంకారాన్ని పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే యువ భారతీయులలో అత్యధికులు ఉద్యోగార్థులే గానీ భాషా దురభిమానులు కానే కారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అమిత్ షా వలే ఠాక్రేలు కూడా తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకే పంపారు. హిందీలో సంభాషించడం, ఇంటర్వ్యూలు ఇవ్వడాన్ని కూడా వారు మానుకోలేదు. అయినప్పటికీ ఠాక్రేల రాజకీయాలు నిరంతరం 'మరాఠీ–ఫస్ట్' అజెండా ప్రాతిపదికనే ఉంటాయి. అమిత్ షా దృష్టిలో 'హిందీ–కేంద్రిత ప్రపంచ దృక్పథం' నెహ్రూవియన్ కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కోగల 'జాతీయవాద శక్తి'గా భారతీయ జనతా పార్టీని నిలిపేందుకు దోహదం చేసేది కాగా, ఠాక్రేలకు భాషా వివాదాన్ని మళ్లీ రగిలించడమనేది శివసేన సంస్థాపకుడు బాల్ ఠాక్రే ఆద్య అజెండా 'భూమి పుత్రుల ఉద్యమం'ను పునరుద్ధరించే ప్రయత్నమే. బొంబాయిలోని మరాఠీయేతర భాషీయులను నిరంతరం తెగనాడినప్పటికీ కార్టూనిస్ట్‌గా ఆయన మొదట పనిచేసింది ఒక ఇంగ్లీష్ డైలీ (ఫ్రీ ప్రెస్ జర్నల్)లో మరి. ఇప్పుడు శివసేన ఒకటికి మూడు 'సేన'లుగా చీలిపోయి అస్తిత్వ సంక్షోభంలో ఉన్నది. అందుకే కాబోలు యువ ఠాక్రేలు తమ ప్రాభవాన్ని పునరుద్ధరించుకునేందుకు మరాఠీ భాషా దురభిమానాన్ని రెచ్చగొట్టేందుకు ఉద్యుక్తులయ్యారు.

సరే ఎమ్‌కే స్టాలిన్‌కు, ఆయన పార్టీ డీఎంకేకు హిందీ బూచీని ముంచుకొస్తున్న మహా ముప్పుగా తమ ప్రజలకు చూపడం కొత్త పరిణామమేమీ కాదు. తమిళనాడులో ఎన్నికలు జరిగే ప్రతిసారీ ప్రజల మాటా మంతీ, పిచ్చా పాటీ అంతా ఈ హిందీ బూచీ గురించే సాగుతూ ఉంటుంది. హిందీని రుద్దడానికి కేంద్రం పూనుకుంటుందని స్టాలిన్, ఆయన సహచరులు గగ్గోలు పెడుతుంటారు. 1960లలో ద్రవిడ పార్టీ ఉత్థానం హిందీ వ్యతిరేక అందోళనాగ్నుల నుంచే జరిగింది. ద్రవిడ సంస్కృతీ పునరుద్ధరణ, వికాసాన్ని అడ్డుకునేందుకే హిందీని తమకు వ్యతిరేకంగా ప్రయోగిస్తున్నారని డీఎమ్‌కే నేతలు ఆరోపించడం పరిపాటి. ఆరు దశాబ్దాల అనంతరం మోదీ ప్రభుత్వ కొత్త విద్యా విధానం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు స్టాలిన్ ప్రభుత్వం ససేమిరా అంటోంది. తమిళ ప్రజలపై హిందీని రుద్దేందుకే ఆ విధానాన్ని ప్రవేశపెట్టారని ఆయన ఆరోపిస్తున్నారు. తమిళనాడులో తమిళ భాషకే తొలి, మలి, తుది ప్రాధాన్యమని స్టాలిన్ స్పష్టం చేస్తున్నారు. అయితే డీఎమ్‌కే ప్రథమ కుటుంబంలోని యువతరం వారు తమ పిల్లలను ప్రతిష్ఠాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలకే పంపిస్తున్నారు చెన్నైలోని ప్రైవేట్ పాఠశాలలు త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు మొగ్గు చూపుతున్నాయి. హిందీకి సముచిత ప్రాధాన్యమిచ్చేందుకు అవి వెనుకాడడం లేదు.

బోధనా మాధ్యమంగా ఆంగ్ల భాషను వ్యతిరేకిస్తున్న పాతకాలం నాటి సోషలిస్ట్ లోహియా వాదుల నుంచి హిందుత్వ వాదులు, ప్రాంతీయ యోధుల వరకు అందరూ తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకే పంపిస్తున్నారు! ఇంగ్లీష్‌కు వ్యతిరేకంగా గొంతు చించుకుంటున్న అమిత్ షా, కేంద్ర కేబినెట్‌లోని తన సహచరులలో ఎంత మంది తమ పిల్లలను హిందీ లేదా ప్రాంతీయ భాషా మాధ్యమ పాఠశాలలకు పంపుతున్నారో తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. కనీసం అరడజను మంది కేంద్ర కేబినెట్ మంత్రుల పిల్లలు ప్రతిష్ఠాత్మక విదేశీ విశ్వవిద్యాలయాలలో చదువుతున్నారు. ఇంగ్లీష్‌ను ఇంకెంత మాత్రం వలస పాలన అవశేషంగా కాకుండా ఆశయ సాధనకు, స్వీయ అభివృద్ధికి మార్గంగా భావిస్తున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఏ ప్రాంతానికి అయినా వెళ్లి చూడండి. సర్వత్రా ఇంగ్లీష్ లాంగ్వేజ్ కోచింగ్ సెంటర్‌లు కనిపిస్తాయి. 'న్యూ' ఇండియా యువత సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలను అవి సమకూరుస్తున్నాయి. ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నందుకు సిగ్గుపడకపోగా ఆ భాషా పటిమలో మేటి అయ్యేందుకు యువ భారతీయులు ఆరాటపడుతున్నారు. విచారకరమైన విషయమేమిటంటే విద్యాలయాలలో ఆంగ్ల భాషా బోధన ప్రమాణాలు ప్రశస్తంగా లేవు. గుజరాతీ యువతకు ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు కొరవడినందునే ఆ నైపుణ్యాల ఆధారిత సేవల రంగంలో గుజరాత్ వెనుకబడి పోయింది.

ముంబై మహా నగర జీవనంలో కూడా ఇప్పుడు (గతంలో ఎన్నడూ లేని రీతిలో) మహారాష్ట్రియన్ స్వరూప స్వభావాలు తక్కువగా ఉన్నాయి. హిందీ, కేవలం ఈ నగర విశ్వవిఖ్యాత బాలీవుడ్ సినిమా పరిశ్రమ భాష మాత్రమే కాదు, జీవనోపాధికి ఉత్తర భారతావని నుంచి వలసవచ్చిన వివిధ వృత్తులవారు అద్వితీయంగా పెంపొందిస్తోన్న స్థానిక భాష. సౌందర్యమూ, సౌలభ్యమూ ఉన్న ముంబై యాస అది. ఈ విశ్వనగర పలుకులమ్మ ఝుంకారంలో బాంబే వెర్సెస్ ముంబై వెర్సెస్ బంబాయి చర్చకు ప్రాధాన్యమేముంటుంది? అది ప్రయోజనశూన్యమైనది. ఈ మహానగర జీవన సందడి భాషాపరమైన విభజనలు, వ్యత్యాసాలపై అస్తిత్వ ఆందోళనలు, జీవిత అనిశ్చితులకు సంబంధించిన భయాలకు తావు లేకుండా చేస్తోంది. నిజమే, మరాఠీ భాషా అభిజాత్యం ఇంకా ప్రభావశీలంగా ఉన్నది. అయితే ఒక భాషకు మరో భాషకు వ్యతిరేకంగా ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఇంకెంత మాత్రం లేదు.

ఈ వాస్తవాలు స్పష్టం చేస్తున్నదేమిటి? భాషా యుద్ధాలు చేస్తున్నవారు తాము విఫలం కానున్న పోరాటాలు చేస్తున్నామనే సత్యాన్ని గ్రహించాల్సిన అవసరమున్నది. అవి తాత్కాలిక రాజకీయ లబ్ధి నివ్వవచ్చునేమో కాని నిరవధిక ప్రయోజనాలను సమకూర్చలేవు. భాషా వైవిధ్యమే భారతదేశ మహా బలం. బహు–భాషా నైపుణ్యాలు స్పర్థాత్మక సానుకూలతలను కల్పిస్తాయి. కొత్త ఆలోచనలు చేయలేని రాజకీయవేత్తలే భాషా దురహంకారాన్ని పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే యువ భారతీయులలో అత్యధికులు ఉద్యోగార్థులే గానీ భాషా దురభిమానులు కానే కారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కలహాశీల కల్లోల ప్రపంచం

మనం ఇప్పుడు ఒక కొత్త ప్రపంచంలో ఉన్నాం. తార్కిక క్రమం లోపించిన సంఘటనలు సంభవిస్తున్నాయి. ఏదీ అర్థవంతమైనదిగా కనిపించడం లేదు. వలసపాలన ముగిసిపోయిన కాలంలో పుట్టి పెరిగిన నాలాంటి వారు అర్ధ శతాబ్ది కాలంగా ఒక నియమబద్ధమైన ప్రపంచ వ్యవస్థను చూస్తూ వచ్చారు. సందేహం లేదు, అది అసమానతల లోకమే. అయితే సంస్కరణలకు మార్పులకు ఆస్కారమున్న ప్రపంచమది. బహుశా, అది ఒక అమాయక కాలం కావచ్చు. దృశ్యమానమవుతున్న యథార్థాల మాటున కఠోర వాస్తవాలు ఉండి ఉండవచ్చు. అయితే ప్రపంచ వ్యవస్థకు ఆర్థికంగా, సైనికంగా శక్తిమంతమైన రాజ్యాలే సారథ్యం వహిస్తున్నప్పటికీ అది సకల దేశాలకు న్యాయం చేయగలదనే నమ్మకం మాకు ఉండేది. వివేకవంతమైన వాదాలు, దార్శనిక దృక్పథాలకు ఆమోదం లభించి సహేతుకమైన నిర్ణయాలకు దోహదం జరగగలదనే నిండు నమ్మకం మాకు ఉండేది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఇప్పుడు నేను ఇది రాస్తున్న సమయంలో కాళ్లకింద భూమి కుంగిపోతున్న భావన కలుగుతోంది. మనం దారి తప్పిపోయామా? కచ్చితంగా. ప్రస్తుత ప్రపంచ వ్యవస్థను నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. కొన్ని దేశాలు ఇరుగు పొరుగు, సుదూర దేశాలపై మారణాయుధాలతో దాడులు జరుపుతున్నాయి. ఈ దాడుల్లో కొన్ని ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే భావించడం దారుణం. ఏకపక్ష నిర్ణయాలతో బాంబు దాడులు చేస్తున్నాయి. జనసంహారానికి పాల్పడుతున్నాయి. ప్రపంచం నిస్సహాయంగా, మౌనంగా చూస్తూ మిన్నకుండిపోతోంది! పరాయి దేశంలో పాలన మార్పు గురించిన ప్రకటనలు వింటున్నాం. ఇదొక సాధారణ విషయమని సరిపెట్టుకుంటున్నాం; పొరుగు దేశంపై దాడి చేయడమే కాకుండా అక్కడి ప్రజలను ఆకలి దప్పులతో మరణించేలా చేస్తున్నాం. జాతి సంహారం సైతం యథేచ్ఛగా కొనసాగుతోంది ఈ దారుణాలను ఉపేక్షిస్తున్నాం. వాటిని భరించలేము. ఏమి చేయగలం? మనం పరిపూర్ణ నిస్సహాయులం.

ఇరాన్‌పై దాడి ఇజ్రాయెల్, అమెరికా చర్యల నైతికతకు మాత్రమే పరిమితమైన అంశం కాదు. సార్వభౌమిక దేశాలు ఉమ్మడిగా చర్చించి నిర్ణయించిన న్యాయసూత్రాల ప్రాతిపదికన నిర్మించిన ప్రపంచ వ్యవస్థ భవిష్యత్తు ఏమిటనే ప్రశ్నను ఆ సందర్భం తీక్షణంగా లేవనెత్తుతోంది. అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ)లో ఇరాన్ భాగస్వామిగా ఉన్నది. అణ్వాయుధాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన అంతర్జాతీయ ఒడంబడిక అది. 1970లో అమలులోకి వచ్చిన ఆ ఒప్పందాన్ని 191 దేశాలు అంగీకరించి ధ్రువీకరించాయి. ఇరాన్‌తో సహా భాగస్వామ్య దేశాలు అన్నీ ఆ ఒప్పందానికి కట్టుబడి ఉండేలా చేసేందుకు వియన్నాలోని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అధికారాలు కల్పించారు. అణ్వస్త్ర రాజ్యాలుగా గుర్తింపు పొందిన దేశాలు ఐదు ఉన్నాయి: అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా. ఈ ఐదు దేశాలూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో వీటో అధికారమున్న శాశ్వత సభ్య దేశాలు. తమకు అణ్వస్త్ర సామర్థ్యమున్నదని భారత్, పాకిస్థాన్‌లు ప్రకటించాయి. ఎన్‌పీటీపై సంతకం చేయలేదు. ఎన్‌పీటీపై సంతకం చేసిన ఇరాన్ అణ్వస్త్రాలు సమకూర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిందని, అణ్వాయుధ ఇరాన్ తన మనుగడకే ప్రమాదకరమని ఇజ్రాయెల్ అభ్యంతరం తెలిపింది. ఈ దేశం ఎన్‌పీటీపై సంతకం చేయలేదు. అంతేకాదు, ఇజ్రాయెల్ రహస్యంగా అణ్వస్త్రాలను అభివృద్ధిపరుచుకోవడానికి పూనుకున్నదని చాలా దేశాలు అంగీకరిస్తున్నాయి. అంతర్జాతీయ నియమాలకు కట్టుబడి ఉన్న ఒక దేశంపై ఆ నియమాలకు లోబడి వ్యవహరించని మరొక దేశం దాడి చేసింది. ఈ పరిస్థితి ప్రపంచ వ్యవస్థ సవ్యంగా పని చేసేందుకు దోహదం చేస్తుందా?



సార్వభౌమిక దేశాలు ఉమ్మడిగా నిర్దేశించుకున్న నియమ నిబంధనలు ఆధారంగా పనిచేసే ప్రపంచ వ్యవస్థ అస్తవ్యస్తమవుతున్న పరిస్థితుల్లో వాతావరణ మార్పు లాంటి మహా సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనడం ఎలా సాధ్యం? పురుషహంకార, యుద్ధ నిమగ్న కల్లోల ప్రపంచం మనిషికి శాంతినిస్తుందా? ధరిత్రిని ధ్వంస రచన నుంచి కాపాడుతుందా?

ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పెంచుకుంటుందని మే 2025లో ఐఏఈఏ నివేదిక ఒకటి వెల్లడించింది. అయితే ఇరాన్ ఆయుధాగారంలో అణ్వాయుధాలు ఉన్నాయనేందుకు ఎటువంటి సాక్ష్యాధారాలు లభించలేదని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ భద్రతా మండలి దృష్టికి తీసుకువెళ్లి ఉండవల్సింది. అయితే అలా చేయకుండా ఇరాన్‌పై బాంబుదాడులకు పాల్పడింది. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడులు జరిపింది. దీనివల్ల ఆ కేంద్రాల నుంచి అణు ధార్మికత వెలువడి మహావిపత్తు సంభవించేందుకు ఆస్కారం కలిగించేలా ఇజ్రాయెల్ వ్యవహరించింది. ఇదెలా న్యాయబద్ధం? ఇజ్రాయెల్ చర్య వల్ల ఐఏఈఏ విశ్వసనీయత దెబ్బతినలేదా? ఎన్‌పీటీపై సంతకాలు చేసిన దేశాలన్నీ ఆ నియమాలకు కట్టుబడి ఉండేలా చేసే బాధ్యతలను ఆ సంస్థ ఎలా నిర్వర్తించగలుగుతుంది? మరో దేశంపై బాంబుదాడులు జరిపేందుకు ఒక దేశం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని నిరాటంకంగా అమలుపరిస్తే మిగతా దేశాలు అంతర్జాతీయ ఒప్పందాల మర్యాదలను ఎందుకు పాటించాలి? ఈ మొత్తం వ్యవహారంలో ఐక్యరాజ్యసమితి, దాని ప్రధాన కార్యదర్శి పాత్ర ప్రకటనలు జారీ చేసేందుకే పరిమితమైపోయింది. సంయమనంతో వ్యవహరించాలన్న సలహాను ఎవరూ వినలేదు. ఐఏఈఏ, ఇతర అంతర్జాతీయ సంస్థలు తమ కర్తవ్యాలను ఎందుకు నిర్వర్తించలేదు? శక్తిమంతమైన దేశాల దౌర్జన్యశీల తీరుతెన్నులను ఎందుకు నియంత్రించలేదు? పరస్పరాధారిత ప్రపంచ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ఇదెలా తోడ్పడుతుంది?

అంతేకాదు, ఈ విపత్కర పరిస్థితిలో మరింత ఎక్కువ ప్రమాదమున్నది. వాతావరణ మార్పు ఒక యథార్థమని మనకు తెలుసు. ఆ వైపరీత్యంతో వాటిల్లుతున్న ముప్పు చాలా తీవ్రమైనది. దానిని ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరమున్నది. అయితే అది సులభంగా పరిష్కారం కాని సమస్య. వాతావరణ మార్పుతో ధ్వంసమవుతోన్న పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు సకల సమాజాలూ ఏకాభిప్రాయంతో పరస్పర విశ్వాసంతో సమష్టిచర్యలు చేపట్టాలి. ఏ ఒక్క దేశమూ కలిసిరాకపోయినా సమస్య సశేషంగానే ఉండిపోతుంది. మరి ఉమ్మడిగా నిర్దేశించుకున్న నియమ నిబంధనలు ఆధారంగా పని చేసే ప్రపంచ వ్యవస్థ అస్తవ్యస్తమవుతూ అంతర్జాతీయ సంస్థల ప్రతిష్ఠ దిగజారిపోతున్న పరిస్థితుల్లో వాతావరణ మార్పు లాంటి మహా సంక్షోభానికి పరిష్కారాన్ని కనుగొనడం ఎలా సాధ్యం? బలవంతుడి న్యాయమే రాజ్యం చేస్తోంది కదా. పురుషహంకార, యుద్ధ నిమగ్న కల్లోల ప్రపంచం మనిషికి శాంతినిస్తుందా? ధరిత్రిని ధ్వంస రచన నుంచి కాపాడుతుందా?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

జ్వలిస్తున్న కడవెండి ఇతిహాసం



నిజాం రాజ్యంలో ఉన్న ఒక ప్రాంతం విసునూరు. దీని దేశముఖ్ రాపాక రామచంద్రారెడ్డి. 60 గ్రామాలు ఇతని అధీనంలో ఉండేవి. కడవెండి గ్రామం వాటిలో ఒకటి. ఈ గ్రామంలోనే దేశముఖ్ తల్లి జానమ్మ ఉంటూ తన అకృత్యాలను కొనసాగిస్తూ ఉండేది. నలభై ఎకరాల సాగును 400 వందల ఏకరాలకు చేర్చింది. అన్ని గ్రామాలలాగే కడవెండి కూడా రాచరిక, భూస్వామ్య పాలన దుష్ఫలితాలను అనుభవిస్తున్నది. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్ట్ పార్టీ ప్రవేశించకముందే ఈ గ్రామం దేశముఖ్ అకృత్యాలను, పెత్తందారీ సంస్కృతిని విమర్శించడం, ధిక్కరించడం మొదలు పెట్టింది. స్వీయ చైతన్యంతో అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటితమయ్యింది.

1944 భువనగిరి ఆంధ్రమహాసభలో రావి నారాయణరెడ్డి పిలుపుతో కడవెండి గ్రామం అగ్నిశిఖగా మారింది. తమ సంఘటిత శక్తికి భరోసా ఉందని, దున్నేవానికి భూమి, అక్రమ పన్నుల రద్దు వంటి కమ్యూనిస్ట్ నినాదాలతో ప్రేరితమయ్యి, సంతోషంతో, ఉత్తేజంతో, దొరల అక్రమాలను ఎదుర్కోవడం కోసం దొడ్డి కొమురయ్య, మల్లయ్య, నల్లా నరసింహులు, కొండల్ రెడ్డి, కొండయ్య, అన్నాల నర్సోజీ, మోహన్‌రెడ్డి, దావిద్‌రెడ్డి వంటి వారితో గ్రామ రక్షణ కమిటీ ఏర్పడింది. నల్లా వజ్రమ్మ, శేరమ్మతో మహిళా దళం ఏర్పడింది.

ఈ క్రమంలో కడవెండి గ్రామానికి 1946 జూలై 4న నిజాం రాజ్య రెవెన్యూ అధికారులు లెవీ ధాన్యపు సేకరణకు రావడం జరిగింది. తమ దగ్గర తిండికి ధాన్యం లేదని, లెవీ సేకరణకు ఒక్క గింజ లేదని రైతులు కూలీలు తేల్చి చెప్పారు. తమ గ్రామంలో కల జానమ్మ దొరసాని ఇంట్లో 800 బస్తాల ధాన్యం ఉందని దానిని సేకరించమని చెప్పారు. ధాన్యపు గిడ్డంగులకు కాపాలా కాస్తున్న దొర గుండాలకు వ్యతిరేకంగా కడవెండి గ్రామంలో పెద్ద ఊరేగింపును గ్రామ కమిటీ తీసింది. ఊరేగింపుపై మిస్కిన్ అలీ నేతృత్వంలో దొర గుండాలు కాల్పులు జరిపారు. నాయకత్వం వహిస్తున్న దొడ్డి కొమురయ్య గుళ్ల వానకు బెదరలేదు, చలించలేదు, వళ్లంతా తూట్లు తూట్లు అవుతున్నా ఆంధ్ర మహాసభకు జై, కమ్యూనిస్ట్ పార్టీకి జై అంటూ ప్రాణాలు వదిలాడు. ఇంకా అనేక మందికి గాయాలయ్యాయి. ఈ వీర మరణం తెలంగాణ చరిత్రను నూతన యుగంలోకి తీసుకెళ్లింది.

– అన్నాల శ్రీనివాస్

(నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి)

'రాజ్యాంగ పరిరక్షణ'కు సమరశంఖారావం..!

నేడు (జూలై 4న) హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించబోయేది కేవలం కార్యకర్తల సభ మాత్రమే కాదు. ప్రజాస్వామ్య పునర్జీవనానికి, దేశ ప్రజల్ని సంఘటితం చేయాలన్న సంకల్పానికి వేదిక. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో 'రాజ్యాంగ పరిరక్షణ'కు 'జై బాపూ.. జై భీమ్.. జై సంవిధాన్' అంటూ పూరించబోయే శంఖారావం. కాంగ్రెస్ పార్టీ బలం, బలగమైన కార్యకర్తల కష్టాన్ని గుర్తించి, గౌరవించి, వారిని 'నాయకులు'గా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి తొలి అడుగు ఈ సభ.




ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన మనదేశంలో అధికార బీజేపీ వ్యవహరిస్తున్న తీరును పరిశీలిస్తే 'రాజ్యాంగం ఉన్నతమైనదా..? లేక ఢిల్లీ గద్దెనెక్కిన పాలకులు గొప్పవారా..?' అనే ప్రశ్న తలెత్తుతోంది. రాజ్యాంగ పీఠికలో మనం రాసుకున్న సార్వభౌమత్వం, సామ్యవాదం, లౌకికత్వం, ప్రజాస్వామ్యం, గణతంత్రం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటివి వారి పాలనలో మచ్చుకైనా కనిపించడం లేదు. న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలను బీజేపీ నేతృత్వంలోని శాసన వ్యవస్థ తన చెప్పుచేతల్లోకి తెచ్చుకునేలా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. ఉన్నతమైన రాజ్యాంగాన్ని బుల్డోజ్ చేస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. వీరి అరాచకాలను వివరిస్తూ, ఈ సభ ద్వారా దేశ ప్రజలను సంఘటితం చేసే బృహత్తర బాధ్యతను కాంగ్రెస్ భుజానికెత్తుకుంది.

'జై బాపూ... జై భీమ్... జై సంవిధాన్' అనేది కాంగ్రెస్ పార్టీ నినాదం మాత్రమే కాదు. భారతదేశ ప్రజాస్వామ్య ప్రయాణాన్ని ముందుకు నడిపిస్తున్న మూడు విశ్వదీప్తి స్తంభాలు. 'బాపూ' అనే పదం– గాంధీజీ చూపిన అహింస, సత్యం, నైతిక శక్తికి ప్రతీక. 'భీమ్' అంటే– డాక్టర్ అంబేద్కర్ ఆశించిన న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం అనే మానవీయ హక్కులకు ప్రతీక. 'సంవిధాన్' అంటే– 'భారతీయులంతా సమానమే... అందరికీ సమాన హక్కులు' అంటూ చాటి చెప్పిన రాజ్యాంగం. వీటన్నింటినీ గౌరవిస్తూ, బీజేపీ నియంతృత్వాన్ని ఎండగడుతూ, ప్రజలను జాగృతం చేసేందుకే పోరాటాలకు పురిటిగడ్డ అయిన తెలంగాణలో నేటి ఈ సభ.

'జై బాపూ... జై భీమ్.. జై సంవిధాన్' నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పునరుద్ధరణకు చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. 'ప్రజాస్వామ్యం అంటే అధికారాన్ని అనుభవించడం కాదు. తమకు అధికారమిచ్చిన ప్రజల కష్ట సుఖాల్లో బాధ్యతను పంచుకోవడం' అంటూ 'తెలంగాణ పునర్నిర్మాణం' వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టి, పకడ్బందీగా అమలు చేస్తోంది. కుల గణన సర్వే, ఎస్టీలకు నాణ్యమైన విద్య, ఉపాధిలో 10 శాతం రిజర్వేషన్లు, ఎస్సీల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తోంది. ప్రగతి భవన్‌ను డా. మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌గా మార్చడం, ఏడాదిన్నరలోనే రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవడంతో పాటు ఏడాదిలోనే 60వేల ప్రభుత్వోద్యోగాల భర్తీ, ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా కొత్తగా ఉపాధి కల్పించడం... ఇలా అభివృద్ధి దిశగా వేసిన అడుగులెన్నో. మహిళల కోసం ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ లాంటి సుమారు 260 సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తోంది.

'జై బాపూ... జై భీమ్... జై సంవిధాన్' సభ మౌలికంగా చాటేది ఒక్కటే.. 'అన్నింటి కంటే ఉన్నతమైనది రాజ్యాంగం, అధికారం కంటే గొప్పది ప్రజల నమ్మకం' అని. ఈ సభ ఇచ్చే స్ఫూర్తితో– రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రతి కార్యకర్త మరింత పరిశ్రమిస్తాడని బలంగా నమ్ముతున్నా.



ఒక జాతీయ పార్టీ అధ్యకుడిని ఓ సాధారణ కార్యకర్త కలవడం అసాధ్యం. ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మార్గనిర్దేశంలో, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో... క్షేత్రస్థాయిలో క్రియాశీలపాత్ర పోషిస్తున్న 15వేల మంది బూత్, గ్రామ, మండల స్థాయి నాయకులను ఈ సభ ద్వారా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా కలవనున్నారు. 'మీ శ్రమను గుర్తించాం. మీకు అండగా ఉంటాం. మీతోనే మా ప్రయాణం' అంటూ ఈ సమ్మేళనంలో వారిని భుజం తట్టి ప్రోత్సహించనున్నారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకోనున్నారు. క్షేత్రస్థాయిలోని లోటుపాట్లు, పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో రాజకీయ పునర్నిర్మాణానికి ఇది సూచిక. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గౌరవం.

ఈ సభ మౌలికంగా చాటేది ఒక్కటే.. 'అన్నింటి కంటే ఉన్నతమైనది రాజ్యాంగం, అధికారం కంటే గొప్పది ప్రజల నమ్మకం' అని. ఈ సభ ఇచ్చే స్ఫూర్తితో– రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రతి కార్యకర్త మరింత పరిశ్రమిస్తాడని బలంగా నమ్ముతున్నా. 'జై బాపూ... జై భీమ్... జై సంవిధాన్' నినాదం ప్రతి ఒక్కరి హృదయంలో, ప్రతి ఇంట్లో, ప్రతి గల్లీలో, ప్రతి గ్రామంలో మార్మోగుతుందని విశ్వసిస్తున్నా.

■ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి



మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

గోదావరిలోకి భారీగా వరద నీరు

- ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 6
- బ్యారేజీలోని 14 గేట్లు ఎత్తి దిగువకు 102,400 క్యూసెక్కుల నీళ్లు విడుదల

దొరతనంపై రణకేతనం

నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య



- వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాటం 6
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో ఎగిసిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి

భూమి కోసం.. భుక్తి కోసం.. బానిస బతుకుల నుంచి విముక్తి కోసం.. పోరు సల్పిన వీరుడు దొడ్డి కొమురయ్య. విస్నూర్ ప్రాంతంలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమించి, వారి తుపాకి తూటాలకు నేల కొరిగాడు. దేవరుప్పుల మండలంలోని కడవెండి వాసి అయిన కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంతమంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. నైజాం నిరంకుశత్వాన్ని కూల్చే దాకా కొనసాగాయి. ఈ రోజుతో (జూలై 4) కొమురయ్య త్యాగానికి 79 ఏళ్లు పూర్తవుతున్నాయి. దొరతనంపై రణకేతనం ఎగురవేసిన ఆ వీరుడికి నివాళులర్పించే సందర్భమిది...

- ఆంధ్రజ్యోతి, దేవరుప్పుల

కొండంత ఉద్వేగం



- ఇటీవలి పరిణామాలు, నేపథ్యాలపై 16 పేజీల నివేదిక సమర్పణ
- ఎమ్మెల్యేలపై చేసిన వాఖ్యలపై వివరణ ఇచ్చినట్లుగా సమాచారం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని 'బొంగు' వ్యాఖ్యలపై ఫిర్యాదు
- 5లోగా వివరణ ఇవ్వాలని గతంలోనే క్రమశిక్షణ సంఘం నోటీసులు
- రేపటితో ముగియనున్న గడువు..
- కొండా దంపతులు మీనాక్షిని కలవటంపై రాజకీయాల్లో ఉత్కంఠ
- అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కొండా దంపతులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్‌లో విభేదాలు మరోసారి హీటెక్కాయి. తనపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీపై కొండా దంపతులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేయటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షినటరాజన్‌ను గురువారం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు కలవటం హట్‌టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లాలోని 11మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీ, మేయర్, ప్రభుత్వ సలహాదారుడు, ఇంచార్జీ మంత్రిపై పలు ఫిర్యాదులతో కూడిన 16 పేజీల నివేదికను మీనాక్షినటరాజన్‌కు అందించినట్లు తెలిసింది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని వాడిన బొంగు వాఖ్యల వీడియోతో సహా ఫిర్యాదు చేశారు. అలాగే కొండా సుస్మిత ఇన్‌స్టాలో పోస్టు చేసిన వ్యాఖ్యలపై కూడా కొండా దంపతులు వివరణ ఇచ్చినట్లుగా సమాచారం.

క్రమశిక్షణ సంఘం గడువు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వాఖ్యలపై క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి ఇచ్చిన షోకాజ్ నోటీసులకు శనివారం (5వ తేదీ) వరకు వివరణ ఇవ్వాల్సి ఉంది. జూన్ 19వ తేదీన వరంగల్ పోచమ్మమైదాన్‌లో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలపై అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై 21వ తేదీన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ తీవ్రంగా ఖండించారు. 22వ తేదీన ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు.

అయినప్పటికీ ఒకరిపై మరొకరు పరస్పర ఆరోపణలు, విమర్శల దాడిని కొనసాగించారు. అయితే సొంత జిల్లాలోని నేతలతో విభేదాలపై 28వ తేదీన కొండా మురళి క్రమశిక్షణ సంఘానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకు ఉన్న బలం, తనకు ఎవరెవరితో ఎందుకు విభేదాలు ఉన్నాయో ఆరు పేజీల నివేదికతో క్రమశిక్షణ సంఘానికి అందించారు. ఈ క్రమంలో జూలై 5వ తేదీలోగా ఎమ్మెల్యేపై చేసిన వాఖ్యలకు వివరణ ఇవ్వాలని కొండా మురళికి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు కొండా దంపతులు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. ఇదిలా వుండగా, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జికి 16పేజీల నివేదిక ఇవ్వటంతో క్రమశిక్షణ సంఘానికి కూడా ఇదే నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా క్రమశిక్షణ సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

చిట్టక్క పోస్టు రచ్చ రచ్చ

కొండా దంపతుల రాజకీయ వారసురాలు కొండా సుస్మిత (చిట్టక్క) చేసిన సోషల్‌మీడియా పోస్టు రాజకీయాల్లో రచ్చరచ్చగా మారింది. మే 31వ తేదీన పరకాల స్థానం నుంచి తానే అభ్యర్థినంటూ సుస్మిత తన ఇన్‌స్టాలో ప్రొఫైల్ ట్యాగ్ చేసుకున్నారు. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ సంఘం కొండా మురళికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో సుస్మిత చేసిన పోస్టు అగ్నికి ఆజ్యం పోసినట్లైందనే చర్చ జరుగుతోంది. దీనిపైనే కొండా దంపతులు మీనాక్షి నటరాజన్‌కు వివరణ కూడా ఇచ్చినట్లుగా సమాచారం.

ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జితో భేటీ

ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులు గురువారం భేటీ కావటం చర్చనీయాంశంగా మారింది. మీనాక్షికి 16పేజీల నివేదిక ఇవ్వటంతో ఆ నివేదికలో ఏముందో అనేది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే సభకు సంబంధించి జనసమీకరణపై మాట్లాడామని కొండా మురళి చెబుతున్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై పలు ఆరోపణలతో కూడిన నివేదిక ఇచ్చినట్లుగా సమాచారం. తన ప్రమేయం లేకుండానే తన నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి ఎమ్మెల్యేలతో కలిసి పోస్టింగులు ఇప్పించటం, అభివృద్ధి పనుల్లో పాల్గొనటం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లుగా తెలిసింది. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మీడియాలో 'బొంగు' అనే పదాన్ని వాడిన వీడియోను కూడా మీనాక్షి నటరాజన్‌కు చూపించినట్లుగా సమాచారం.

నేను బీసీ వర్గాల ప్రతినిధిని..

- పోటా, టాడా కేసులకే భయపడలేదు..
- కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు..
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

6



ఉగ్రప్రభ త్వరితమాత అలంకరణలో అమ్మవారు

8వ రోజుకు చేరిన భద్రకాళి శాకంబరీ వేడుకలు

వరంగల్ కల్చరల్ జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ వేడుకలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యపూజ అనంతరం అష్టమికి ఆది దేవత శంకరుడు దశమహా విద్యల్లో కాళీక్రమంను అనుసరించి ఉదయం ఉగ్రప్రభ.. జ్ఞానశక్తిని త్వరితమాత గాను అలంకరించి పూజారాధన చేశారు. అమ్మవారి విభూతి అయిన ఈ ఉగ్రప్రభ మాతకు ప్రత్యంగిరా అనే నామం కూడా ఉంది. ఈ అమ్మవారు భక్తులను అనుగ్రహించి అభయమిస్తుందని అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు

- క్షేత్రస్థాయిలో పరిశీలించి మాస్టర్ ప్లాన్‌పై నివేదిక సమర్పించాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్



మేడారం పరిసరాలను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్

ములుగు/తాడ్వాయి జూలై 3 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లకోసారి జరిగే మేడారం మహాజాతరకు పక్కా ప్రణాళికలతో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గద్దెల పరిసరాలను, క్యూ లైన్లు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, కన్నెపెల్లి సారలమ్మగుడి, చిలకలగుట్ట పరిసరాలు జిల్లా కలెక్టర్ దివాకర, సీఎస్ సలహాదారు గోవిందహరితో కలిసి పరిశీలించారు. అనంతరం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తదనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశ మందిరంలో మహాజాతర అభివృద్ధిపనులపై సంబంధిత అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తు శిల్పి రాజశేఖర్ మేడారం మాస్టర్ ప్లాన్‌ను స్లైడ్ షో ద్వారా పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ స్లైడ్ షోలో జంపన్నవాగు అభివృద్ధి పనులు, పలు వంతెనల ఏర్పాటు, అధునాతన కూడళ్ల ఏర్పాటు, రోడ్డు విస్తరణ పనులు, దేవస్థానం చుట్టూ అభివృద్ధి, భక్తుల కోసం విశాలమైన క్యూలైన్ల ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు, భక్తుల వసతి, పూజారుల వసతి, గిరిజన సంఘాల వసతి, స్నాన ఘట్టాలు, అన్నదాన సత్రాలు, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాటు, గద్దెలు, పరిసరాలు ముఖ ద్వారాలు రాతి కట్టడాలతో నిర్మించేలా చేసిన డిజైన్‌లను చూపించారు. అనంతరం శైలజారామయ్యర్ మాట్లాడుతూ 2026 మహా జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉన్నత సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 100 ఏళ్లకు పైగా నిలిచి ఉండేలా శాశ్వత నిర్మాణాలు చేపడతా మన్నారు. మేడారం అభివృద్ధికి పూజారులు, దేవాదాయశాఖ, గిరిజనశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి సులువైన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. తల్లుల దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఆధ్యాత్మికత పెంపొందేలా అభివృద్ధి చేపడతామని అన్నారు. గిరిజనులు, పూజారులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులకు ఆరు నెలల సమయం ఉందన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగేలా శాశ్వత పనులకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడారం అభివృద్ధి జరగాలంటే భూసేకరణ ప్రధానమన్నారు. మేడారం గిరిజనులు, పూజారులు భూసేకరణకు అడ్డు పడకుండా సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంలో ఏమైన సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దివాకర ద్వార మీ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియపరచాలన్నారు. మాస్టర్ ప్లాన్‌ను వాస్తు శిల్పి అద్భుతంగా రూపొందించారని అభినందించారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

వరంగల్ కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను చెల్లించాలని కోరుతూ కార్మికులు గురువారం వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బైరబోయిన సరోజన యాదవ్ మాట్లాడుతూ గత ఐదు నెలల బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే కోడిగుడ్లు, గ్యాస్ పొయ్యి అందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలనే పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ సత్య శారదకు అందజేశారు. ధర్నా కార్యక్రమంలో ఎస్.వనజ, ఎన్.చంద్రకళ, స్వర్ణలత, శారద, సంధ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని కోడలు.. గుండెపోటుతో మామ..

ఒకే కుటుంబంలో ఇద్దరి మృతి.. అవుతాపురంలో విషాదం



ఝాన్సీ(ఫైల్)

పెద్దవంగర, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. వేముల సంతోష్-వేముల ఝాన్సీ 2011లో వివాహం జరిగింది. వారికి కుమారుడు అఖిల్ తేజ, కుమార్తె అభిదామాని ఉన్నారు. సంతోష్ పెద్దవంగర మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో సీఆర్పీగా, ఝాన్సీ తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఝాన్సీ పని చేస్తున్న విద్యసంస్థలో ఒకరు ఆమెను మందలించారు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఝాన్సీ (35) గురువారం ఇంటివద్దనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, రెండు రోజుల కిందట విద్యా సంస్థలో ఒకరు మందలించారని తీవ్ర మనస్థాపం చెందింది. పాఠశాలకు ఇక వెళ్లనని భర్తకు చెప్పి ఇంటి వద్దనే ఉంటున్నది. గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఝాన్సీ ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుంది. కోడలి మరణవార్త తెలియడంతో గత కొద్ది రోజులుగా గుండెనొప్పితో బాధపడుతున్న వేముల లక్ష్మయ్య మామ గుండెపోటుతో మృతి చెందాడు. గంటల వ్యవధిలోనే ఒకే ఇంట్లో కోడలు, మామ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మయ్యకు భార్య సరోజన కుమారులు ప్రకాష్, సంతోష్ ఉన్నారు. ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై క్రాంతికిరణ్ వివరణ కొరగా.. ఘటన స్థలాన్ని పరిశీలించామని, ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామన్నారు.



రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న అమ్మమ్మ విశాల

ప్రాణం తీసిన పోలీసు భయం

చల్వాయిలో ఉరివేసుకొని నిరుపేద యువకుడి బలవన్మరణం

- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టింగ్‌లు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- సెల్‌ఫోన్ స్వాధీనం.. స్టేషన్‌కు రావాలని ఆదేశం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య
- రాస్తారోకో చేసిన బంధువులు, బీఆర్ఎస్ శ్రేణులు
- వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు నమోదు 6

తనకు అన్ని అర్హతలు ఉన్నా 'ఇందిరమ్మ' ఇల్లు రాలేదని ఓ యువకుడు గ్రామ వాట్సాప్ గ్రూపులో పెట్టిన పోస్టు.. అతడి ప్రాణాలనే బలిగొన్నది. అటు అధికార పార్టీ నాయకులు, ఇటు పోలీసులు బెదిరింపులకు దిగడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో చోటుచేసుకుంది. పోలీసుల భయంతో చుక్క రమేష్(29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్తులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాగా, వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మహత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు. కాగా, రమేష్ అంత్యక్రియలు గురువారం రాత్రి చల్వాయిలో ముగిశాయి.

- ఆంధ్రజ్యోతి, గోవిందరావుపేట



దొరతనంపై రణకేతనం

- నైజాం నిరంకుశత్వంపై ఎగిసిన రగల్‌జెండా దొడ్డి కొమురయ్య
- వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాటం
- ఊరేగింపులో వస్తుండగా దేశ్‌ముఖ్ గూండాల కాల్పులకు బలి
- కొమురయ్య మరణంతో రగిలిన సాయుధ పోరాటం
- నేడు కడవెండిలో ఆయన 79వ వర్ధంతి

దేవరుప్పుల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం.. భుక్తికోసం.. బానిస బంధాల విముక్తి కోసం.. వెట్టిచాకిరి నిర్మూలన కోసం నడుం బిగించి తెలంగాణ గడ్డపై నేలకొరిగిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. నైజాం సర్కార్ దేశ్‌ముఖ్‌ల కుట్రలతో చిందిన కొమురయ్య రక్తంతో తెలంగాణ రక్త సిక్తమైంది. బాంచెన్ దొర అంటూ దొర పెత్తనంలో నలిగిన వాళ్లను బందూకులు చేతబట్టి పోరాడే దిశగా నడిపించిన ధీరుడు దొడ్డి కొమురయ్య. రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల చర్యలను నిలదీస్తూ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కొమురయ్యను దేశ్‌ముఖ్‌ల గుండాలు కాల్చి చంపి నేటికి(జూలై 4)79 ఏళ్లు పూర్తవుతున్నాయి.

దొరపై తిరబడి..

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో 1928లో దొడ్డి గట్టమ్మ, కొండయ్యల దంపతులకు కొమురయ్య జన్మించాడు. కొమురయ్యకు 16వ ఏటా 1944లో కొమురమ్మతో వివాహం జరిగింది. పాలకుర్తి మండలం విస్నూర్ కేంద్రంగా 60గ్రామాలను దేశ్‌ముఖ్ రాపాక వెంకట రాంచంద్రారెడ్డి, ఆయన భార్య జానమ్మ దొరసాని, కుమారుడు బాబుదొర ప్రజలతో వెట్టిచాకిరి చేయించుకుంటూ పీడించేవారు. 1943లో ఆంధ్ర మహాసభలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కడవెండికి చెందిన నల్ల నర్సింహులు, దొడ్డి మల్లయ్య, దావిద్‌రెడ్డి, వడ్డెనర్సయ్య, నల్ల కొండయ్య, మచ్చ రామయ్య, జంపాల లింగయ్య, పంతం లచ్చయ్య, పాముకుంట్ల ముత్తిలింగం, మాశెట్టి రాంచెంద్రయ్య, ఎర్రంరెడ్డి రామకృష్ణారెడ్డి, పైండ్ల యాదగిరి తదితరులు నైజాం సర్కారుకు వ్యతిరేకంగా ఉద్యమానికి ఈ ప్రాంతం నుంచి సహకరించారు. 1946లో నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. గ్రామరక్షక దళాల పేరుతో నాడు గుత్పల సంఘాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారు.

తూటాలకు ఎదురొడ్డి..

విస్నూర్ ప్రాంత గ్రామాలతో పాటు కడవెండిలో దేశ్‌ముఖ్ అనుచరుల ఆగడాలకు వ్యతిరేకంగా 1946 జూలై 3న ఉద్యమకారులతో గ్రామస్థులు సమావేశమయ్యారు. జూలై 4న విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి చర్యలకు నిరసనగా కడవెండి ప్రజలు అస్నాల రాజన్న ఇంటి ముందు నుంచి ఊరేగింపుగా బొడ్రాయి వద్దకు వస్తున్న సమయంలో దక్షిణం వైపు ఉన్న ఇంట్లో నుంచి దేశ్‌ముఖ్ గుండాలు తూటాల వర్షం కురిపించారు. ఊరేగింపులో ముందు వరుసలో ఉన్న దొడ్డి కొమురయ్య, దొడ్డి మల్లయ్యలకు తూటాలు తగిలాయి. కొమురయ్య పొట్టలోకి ఎక్కువ తూటాలు దూసుకు పోవటంతో రాత్రి పది గంటల సమయంలో నేలకొరిగి అమరుడయ్యాడు. కొమురయ్య సోదరుడు దొడ్డి మల్లయ్య ప్రాణాపాయస్థితి నుంచి బయట పడ్డాడు.


దొడ్డి కొమురయ్య (ఊహా చిత్రం)

ఎగిసిన ఉద్యమం..

కొమురయ్య వీర మరణంతో తెలంగాణ ప్రాంత మంతా ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన తొలి అమర వీరుడిగా కొమురయ్య పేరు, ఊరు చరిత్ర పుటల్లో నిలిచి పోయింది. కొమురయ్య అమరుడైన నాటినుంచి నేటి వరకు కడవెండి గ్రామంలో ఆయన స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభలను విప్లవ, కమ్యూనిస్టు పార్టీలు నిర్వహిస్తూనే ఉన్నాయి. 50వ వర్ధంతి సభను సీపీఐ ఆధ్వర్యంలో 1996లో పెద్ద ఎత్తున నిర్వహించారు. దొడ్డి కొమురయ్య స్మారక భవనం నిర్మిస్తామని సీపీఐ హామీ ఇచ్చి నెరవేర్చింది. ఆయన పేరిట స్మారక భవనం నిర్మించుకోగా పలు కార్యక్రమాలకు ఉపయోగంలోకి వచ్చింది.

నేడు కడవెండిలో వర్ధంతి సభ

సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కడవెండిలో నిర్వహించే కొమురయ్య 79వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య కోరారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, రాష్ట్ర సమితీ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్. రాజారెడ్డిలు హాజరవుతారని వెల్లడించారు.


మీడియాతో మాట్లాడుతున్న కొండా మురళి-సురేఖ దంపతులు

నేను బీసీ వర్గాల ప్రతినిధిని..

- పోటా, టాడా కేసులకే భయపడలేదు..
- కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు..
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నేను ఎవరికీ భయపడ.. పోటా, టాడా కేసులకే భయపడలేదు.. నేనే క్రమశిక్షణ సంఘం పర్యవేక్షణలో ఉన్నా.. కావాలనే నన్ను కొందరు రెచ్చగొడుతున్నారు.. 44 ఏళ్లుగా నా ఎపిసోడ్ నడుస్తూనే ఉంది.. పని చేసేవారిపైనే విమర్శలు ఉంటాయి' అని మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులు కలిసి 16 పేజీల నివేదికను అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎవరి గురించి తాను కామెంట్ చేయనని, భయపడుతూ పోతే తనపై 23 కేసులు పెట్టకపోయేవాళ్లు అని మురళీధర్‌రావు పేర్కొన్నారు. మొదటిసారి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌ని కలిశాను.. హైదరబాద్‌లో శుక్రవారం జరిగే సభ గురించి మాట్లాడాం.. వరంగల్ నుంచి ఎంతమందిని తరలించాలో చర్చించామని తెలిపారు. కాంగ్రెస్‌ను బతికించటం.. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయటం, మరో పదేళ్లు రేవంత్‌రెడ్డిని సీఎంగా కొనసాగేలా చూడటమే తన ముందున్న లక్ష్యాలని చెప్పారు.

బీసీల ప్రతినిధిగానే కొనసాగుతానని, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు పూర్తి మద్దతుగా ఉన్నామని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించటం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను గెలిపించటం మా బాధ్యత.. నేను బీసీ కార్డుపైనే బతుకుతున్నాను.. ఎలాంటి గ్రూపు రాజకీయాలతో సంబంధం లేదు.. అని మురళి స్పష్టం చేశారు.

ఇక తమ కూతురు సుస్మితపటేల్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులతో తనకు సంబంధం లేదని, ఒక్కొక్కరి ఆలోచనలు ఒక్కోలా ఉంటాయని, ఆమె ఏం అనుకుంటుందో తమకు తెలియదని మురళి పేర్కొన్నారు. కాగా, తమ కూతురు పరకాల నుంచి పోటీ చేస్తానని చెప్పటంలో తప్పు లేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. తను పార్టీ టికెట్ ఆశిస్తుందని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా.. దానికి కట్టుబడి ఉంటాం... అని తెలిపారు.

దివ్య దక్షిణ యాత్రకు ప్రత్యేక రైలు

జనగామ రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్‌సీటీసీ టూరిజం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పీవీ వెంకటేశ్ అన్నారు. జనగామ రైల్వే స్టేషన్‌లో గురువారం ఐఆర్‌సీటీసీ టూరిజం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగం, తిరువణామలై, రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేండం, తిరుచ్చి, తంజావూరులకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును హైదరాబాద్ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. జూలై 19 నుంచి జూలై 26 వరకు ప్రయాణం ఉంటుందని ఈ యాత్ర సికింద్రాబాద్, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడురు మీదిగా రేణిగుంట వెళ్తుందన్నారు. అక్కడి నుంచి ఆలయాలకు ఉచితంగా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఒక్కొకరికి సాధారణ టికెట్ ధర రూ. 14,100, 3ఏసీ రూ.22,300, 2ఏసీ 29,200 ఉంటుందన్నారు. ప్రతీరైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు, కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అందుబాటులో ఉంటూ సౌకర్యాలను సమకురుస్తారని తెలిపారు. సీసీ కెమెరాలతో భద్రత, హోటళ్లు, భోజనం, వాటర్ బాటిల్స్ కూడా ఉచితంగా ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 9701360701, 9281030711, 9281030712 నంబర్లను సంప్రదించగలరని తెలిపారు. అనంతరం తీర్థయాత్రలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. టూరిజం మానిటర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం

నర్సంపేట టౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆర్టీసీ డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురైన ఘటన గురువారం నర్సంపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న బస్సులో జరిగింది. సెల్‌ఫోన్ చూస్తూ, మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని ట్రాఫిక్ సిబ్బంది, పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నా కొంత మంది డ్రైవర్ల తీరు మారడం లేదు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం క్షేమం అనే భరోసాతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను కాదని ఆర్టీసీని ఆశ్రయిస్తే.. కొంతమంది డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీపై నమ్మకం పోతున్నది. గురువారం ఉదయం 10 గంటల వరకు నర్సంపేట డిపోకు చెందిన టీఎస్ 03 యూబీ 8600 నెంబర్ గల బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ తన సెల్‌ఫోన్‌లో 20 నిమిషాల పాటు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.


సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బస్సు నడుపుతున్న డ్రైవర్

గోదావరిలోకి భారీగా వరద నీరు

- ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- బ్యారేజీలోని 14 గేట్లు ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీటి విడుదల

కన్నాయిగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్కసాగర్ ప్రాజెక్టు వద్ద గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి వరద నీరు భారీగా వచ్చి గోదావరిలో చేరింది. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 94,500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో తుపాకులగూడెం బ్యారేజీలోని 14 గేట్లు పైకి ఎత్తి దిగువకు 1,02,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తి స్థాయి నీటి మట్టం 6.94 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.925 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఇదిలాఉండగా, మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. ప్రాజెక్టులోని ఫేస్-2లోని రెండు మోటార్ల ద్వారా భూపాలపల్లి జిల్లా భీమునపురం రిజర్వాయర్‌కు 494 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. సమ్మక్కసాగర్ వద్ద 79.65 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా, దేవాదుల ఇంటెక్‌వెల్ వద్ద 79.95 మీటర్ల నీటి మట్టం నమోదైంది.


తుపాకులగూడెం బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు


కాళేశ్వరం వద్ద ప్రవహిస్తున్న గోదావరి

కాళేశ్వరం వద్ద..

మహదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి 6మీటర్ల 30 సెంటీమీటర్ల వరకు వరదనీరు చేరింది. ఐదు రోజుల నుంచి నదీ ప్రవాహం పెరుగుతూ, తగ్గుతూ వస్తుండగా తాజాగా గురువారం కురిసిన వర్షాలకు ఒక్కసారిగా వరద నీరు చేరి మెట్ల వద్దకు నీరు ఎగబాకింది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతుండడంతో వరద నీరు పెద్ద ఎత్తున పెరిగింది.

మేడిగడ్డ బ్యారేజీకి 77,500 క్యూసెక్కుల నీరు

మహదేవపూర్ రూరల్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరదనీరు పెరుగుతోంది. బ్యారేజీలోకి 77,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

ప్రాణం తీసిన పోలీసు భయం

- చల్వాయిలో ఉరివేసుకొని యువకుడి బలవన్మరణం
- 'ఇందిరమ్మ' ఇల్లు రాకపోవడంతో వాట్సాప్‌లో పోస్టులు
- ప్రభుత్వానికి వ్యతిరేక పోస్టులు పెడుతున్నాడని పోలీసుల జోక్యం
- కేసు పెడతారేమోననే భయంతో ఆత్మహత్య

గోవిందరావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేరు.. అమ్మమ్మే సర్వస్వం.. ఆపై పేదరికం.. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డాడు.. కానీ ఆయన ఆశలు నెరవేరలేదు.. లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోవడంతో ఆవేదనకు లోనయ్యాడు.. ఊళ్లోని వాట్సాప్ గ్రూపులో తన బాధను పంచుకున్నాడు.. అయితే ఈ చాటింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకమని భావించిన పోలీసులు ఆ యువకుని మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు.. విచారణ నిమిత్తం స్టేషన్‌కు రావాలని ఆదేశించారు.. భయంతో వణికిపోయిన అతడు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయిలో గురువారం ఉదయం ఈ సంఘటన జరిగింది. పోలీసుల భయంతో చుక్క రమేష్ (29) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. చుక్క స్వరూప-గట్టయ్య దంపతులకు రమేష్, మౌనిక సంతానం. అనారోగ్యంతో స్వరూప, గట్టయ్యలు కొన్నేళ్లక్రితం మృతి చెందారు. మౌనికకు వివాహమై అత్త వారింటికి వెళ్లగా రమేష్ చల్వాయిలోని తన అమ్మమ్మ శెట్టి విశాల వద్ద ఉంటున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసిన ఆయన కొద్దిరోజుల క్రితం చల్వాయికి వచ్చాడు. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా జాబితాలో పేరు రాలేదు. తనకు అన్ని అర్హతలున్నా ఇల్లును మంజూరు చేయలేదని, అనర్హులకు ఇచ్చారంటూ 'చల్వాయి సమాచారం' అనే వాట్సాప్ గ్రూపులో పోస్టులు పెట్టాడు.


చల్వాయిలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, బీఆర్‌ఎస్ నాయకులు

ఇదే గ్రూపులో సభ్యులుగా పస్రా ఎస్సైతోపాటు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభిమానులు ఉన్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీల అభిమానులు ఒకరినొకరు విమర్శించుకుంటూ పోస్టులు పెట్టుకున్నారు. మంత్రి సీతక్క, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్త నాగన్న పేరిట సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన లేఖను రమేష్ ఈ గ్రూపులో పోస్టు చేశాడు.

వాట్సాప్ గ్రూపులో పోస్టుల యుద్ధాన్ని పస్రా ఎస్సై కమలాకర్ గమనించారు. ఆయన ఆదేశాలతో బుధవారం సాయంత్రం చల్వాయికి వచ్చిన ఓ పోలీసు కానిస్టేబుల్... రమేష్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాడు. గురువారం స్టేషన్‌కు రావాలని సూచించాడు. తనపై కేసులు పెడతారేమోనని రమేష్ భయాందోళనకు గురయ్యాడు. అమ్మమ్మ బంధువుల ఇంటికి వెళ్లడంతో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో రమేష్ దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింట్లో ఉండే అలుగం రమేష్ అనే వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారికి తెలిపాడు. విషయం తెలుసుకున్న పస్రా ఎస్సై కమలాకర్ చల్వాయికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇంట్లో వెతకగా రమేష్ రాసిన సూసైడ్ నోట్ లభ్యమైనట్లు తెలిసింది. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న మనవడు ఆత్మహత్య చేసుకోవడంతో అమ్మమ్మ విశాల గుండెలవిసేలా రోదించింది.

రమేష్‌ది ప్రభుత్వ హత్య

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, జర్నలిస్టులు, సామాన్యులపై రాష్ట్రమంత్రి సీతక్క అనుచరులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు రాకపోవడంపై నిలదీసిన రమేష్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే పొట్టనపెట్టుకుందని ధ్వజమెత్తారు. ములుగు ఏరియా ఆస్పత్రి మార్చురీ వద్ద రమేష్ మృతదేహానికి నివాళులర్పించిన ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. అమాయక యువకుడి మృతికి మంత్రి సీతక్క బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మృతదేహంతో ఆందోళన

కాంగ్రెస్ నాయకులు, పోలీసుల కారణంగానే చుక్క రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. మృతదేహంతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు రమేష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించిన వారిపై భౌతికదాడులకు పాల్పడటమేకాక ఆత్మహత్యకు ప్రేరేపించేలా భయభ్రాంతులకు పాల్పడటం ములుగు జిల్లాలో కాంగ్రెస్ నాయకులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ములుగు సర్కిల్ పోలీసులు కూడా చల్వాయిలో మోహరించారు. రాస్తారోకో ప్రభావంతో రహదారికి ఇరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనను విరమింపజేసిన పోలీసులు రమేష్ మృతదేహాన్ని ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం జరిపించారు. మృతుడి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ మృతుడి అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.50వేలు అందజేశారు.

వాట్సాప్‌లో వేధించిన నలుగురిపై కేసు

చుక్క రమేష్ అమ్మమ్మ శెట్టి విశాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలతో మానసికంగా వేధించి రమేష్ ఆత్మ హత్యకు కారణమైన చల్వాయికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ న్యూసెన్స్ అంశంపై బుధవారం సాయంత్రం డయల్ 100కు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా పస్రా పోలీసులు చల్వాయికి వెళ్లారని, మద్యం సేవించిన స్థితిలో రమేష్ ఉన్నట్లు గుర్తించి తిరిగి వెళ్లిపోయారని తెలి పారు. మృతుడు రమేష్‌పై ఎటువంటి కేసు నమోదు చేయలేదని స్పష్టం చేశారు.

రవీందర్, ములుగు డీఎస్పీ


shanthi TALKIES
MYTHRI
RELEASING TODAY
SIDDHARTH
SARATH KUMAR
3BHK
'Every Ordinary Family has an Extraordinary Story'
WRITER - DIRECTOR SRI GANESH
PRODUCED BY ARUN VISWA


ప్రపంచవ్యాప్తంగా
నేడే
విడుదల
జురాసిక్ వరల్డ్
IN CINEMAS JULY 4
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU
IN 3D
UNIVERSAL


ANIL SUNKARA PROUDLY PRESENTS
SKYLINE MOVIES
SHOW TIME
నేడే
విడుదల
WRITTEN & DIRECTED BY
MADHAN DAKSHINAMOORTHY
PRODUCER
KISHORE GARIKIPATI (G K)


ప్రపంచవ్యాప్తంగా
జూలై
11
విడుదల
IT BEGINS
A JAMES GUNN FILM
DC STUDIOS
సూపర్‌మ్యాన్
SUPERMAN
ONLY IN CINEMAS JULY 11
IN ENGLISH, HINDI & TELUGU
IN 3D & IMAX 3D
REAL D 3D Dolby Cinema IMAX
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
T-SERIES MUSIC
నేడే
విడుదల
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR

బీరన్న బోనాలకు మేయర్‌కు ఆహ్వానం


మేయర్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న నిర్వాహకులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): యేటా తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ నెల 6న వరంగల్ కరీమాబాద్‌లో కురుమ కులస్థులు నిర్వహించే ఉర్సు శ్రీ బీరన్న బోనాల పండుగకు ఆహ్వానిస్తూ మేయర్ గుండు సుధారాణికి ఆహ్వానం పలికారు. గురువారం బీరన్నస్వామి దేవాలయ కమిటీ సభ్యులు మేయర్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందించి ఘనంగా సన్మానించారు. మేయర్‌ను కలిసిన వారిలో దేవాలయ కమిటీ చైర్మన్ మరుమల్లి రవితో పాటు ధర్మకర్తలు మిరియాల కుమారస్వామి, మండల ప్రమీల, కోటేశ్వర్, మరుపల్ల గౌతం ఉన్నారు.

నేడు వేయిస్తంభాలగుడిలో శతఘటాభిషేకం

హనుమకొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన వేయిస్తంభాల గుడిలో ఈనెల 4న శుక్రవారం రుద్రేశ్వర స్వామి వారికి 60 వారుణానువాకాలతో రుష్యశృంగ పూజ, శతఘటాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, కార్యనిర్వహణ అధికారి ధరణికోట అనిల్‌కుమార్ తెలిపారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు విస్తృతంగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పెరగాలని కోరుతూ ఈ శతఘటాభిషేకం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే అమర్‌నాథ్ యాత్రకు వెళుతున్న యాత్రికులకు ఉగ్రమూకల నుంచి ఎలాంటి ఆపదలు రాకుండా ఉండాలని కోరుతూ ఆలయంలో అన్నప్రసాద వితరణ కూడా జరుపనున్నట్టు తెలిపారు. కనుక భక్తులు విశేష సంఖ్యలో హాజరై ఈ మహత్కార్యంలో భాగస్వాములు కావాలని కోరారు.

జర్నలిస్టు సుభాష్ జ్ఞాపకార్థం కమ్యూనిటీ హాల్

శంకుస్థాపన చేసిన ఎంపీ కడియం కావ్య


బీసీ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కడియం కావ్య

హసన్‌పర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎంపీ కడియం కావ్య అన్నారు. గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు నాయకపు సుభాష్ జ్ఞాపకార్థం భీమారంలో రూ.20లక్షల నిధులతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు ఆమె శంకుస్థాపన చేశారు. సుభాష్ రిపోర్టర్‌గానే కాకుండా, బాధ్యత కలిగిన పౌరుడిగా తన శక్తిమేరకు సేవలందించిన గొప్ప వ్యక్తి అని ఎంపీ కొనియాడారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరి చేసేందుకు సహకరించిన ఎమ్మెల్యేలు నాగరాజు, కడియం శ్రీహరితో పాటు ఎంపీ కావ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఈవో డెక్రే వాసంతి అన్నారు. గురువారం ఆమె సిబ్బందితో కలిసి కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తీసివేసి అనంతరం ఆవరణలో ఉన్న నీటి గుంతలను మట్టితో నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యంగా పాఠశాలల ఆవరణల్లో ఎలాంటి అపరిశుభ్ర వాతావరణం లేకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో వైరల్ జ్వరాలు ప్రజ్వరిల్లే ప్రమాదమున్నందున్న పాఠశాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మార్తినేని ధర్మారావుకు అభినందన


ధర్మారావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

రాంనగర్, జూలై 3(ఆంధ్ర జ్యోతి): బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావును బీజేపీ ఐనవోలు మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు, నాయకులు ఆడె భాస్కర్, తాళ్లపెల్లి వెంకట్‌నారాయణ, వేముల ప్రభాకర్, ఆడెపు విక్రమ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పరిశీలన పకడ్బందీగా నిర్వహించండి

గ్రేటర్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్


రేషన్‌కార్డులు వెరిఫికేషన్ అధికారులతో మాట్లాడున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ కోరారు. గురువారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో రేషన్‌కార్డుల వెరిఫికేషన్ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వెరిఫికేషన్ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. వరంగల్ జిల్లాకు సంబంధించి కొత్త రేషన్ కార్డుల కోసం 12,200 దరఖాస్తులు, హనుమకొండ జిల్లా పరిధిలో 16,700 కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, ఇప్పటి వరకు 50 శాతం వెరిఫికేషన్ పూర్తయిందని వెల్లడించారు. ఈనెల 10 లోగా టార్గెట్ పూర్తి చేయాలని అన్నారు. ఆర్‌వోలు, ఆర్‌ఐలు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే డీఎస్‌డీవో సాంకేతిక సిబ్బంది సహాయం తీసుకుని పని పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి కృష్ణయ్య, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ప్రసన్నరాణి, ఆర్‌వోలు యూసుఫ్, షహజాది గేడం, టీఎంసీ రమేష్, సీవోలు పాల్గొన్నారు.

బూత్‌లెవల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

బూత్‌లేవల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్, రిటర్నింగ్ అధికారి చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం 106 - వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని బూత్‌స్థాయి అధికారులకు ఐఎంఏ హాల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ హాజరై మాటాడారు. ప్రతీరోజు 50 మందికి ఓరియంటేషన్ తరగతులు నిర్వహించాలని, ఓటరు లిస్ట్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని అన్నారు. ప్రతీ ఇంట్లో 18 ఏళ్ల నిండిన యువతీ యువకులతో పాటు మృతి చెందిన వారి వివరాలను సేకించాలని అన్నారు. బీఎల్‌వోలు ఎలాంటి తప్పులులేకుండా దరఖాస్తులు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎన్నికల డీటీ సుభాన్, మాస్టర్ ట్రైనీ సందీప్‌తో పాటు కనుకయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నర్చరింగ్ నైబర్‌హుడ్స్ చాలెంజ్ 2.0 వీడియో కాన్ఫరెన్స్

నర్చరింగ్ నైబర్‌హుడ్స్ చాలెంజ్ 2.0 వీడియో కాన్ఫరెన్స్ గురువారం ఢిల్లీ నుంచి జరిగింది. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ (డబ్ల్యుఆర్‌ఐ) ప్రతినిధి అరుణిమ సేథ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలోని ఎంపిక చేసిన నగరాల కమిషనర్లు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ ఎఫైర్స్‌లో భాగంగా నగరంలోని చిన్న పిల్లల ఆహ్లాదం కోసం నగరంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో 5 పార్కులు ఏర్పాటు చేయాలని అరుణిమ సేథ్ కమిషనర్‌ను ఆదేశించారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. నర్చరింగ్ నైబర్ హుడ్స్ చాలెంజ్ 2.0 నిర్వహణకు సంబంధించిన అంశాలపై కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, మాధవీలత, డీఈ కార్తీక్ రెడ్డి, రోజారాణి, స్మార్ట్‌సిటీ అధికారులు ఆనంద్ పాల్గొన్నారు.

కేయూ భూములపై విద్యార్థుల రగడ

ఇంటిగ్రేటెడ్ స్కూల్ వద్దంటూ బైఠాయింపు

విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు.. వర్సిటీలో ఉద్రిక్తం


రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి నిరసన చేస్తున్న విద్యార్థి నేతలు

కేయూ క్యాంపస్ జూలై 3, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు ప్రతిపాదనలపై వర్సిటీలో విద్యార్థి సంఘాల నేతలు నిరసన, ఆందోళనకు దిగాయి. గురువారం వర్సిటీ పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. స్కూల్ వద్దంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వర్సిటీ భూముల జోలికి వస్తే ఖబర్దార్.. అంటూ హెచ్చరించారు. గత నెల 17న కేయూ పాలకమండలి ఏకపక్షంగా 15 ఎకరాల భూమిని స్కూల్‌కు కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించారు. తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జాలకు గురైన వర్సిటీ భూములను స్వాధీనం చేసుకోవాలని, అక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వర్సిటీ భూముల్లో స్కూల్ ఏర్పాటు చేసే విషయాన్ని విరమించుకోవాలన్నారు. వర్సిటీ అధికారులు భూములపై వర్సిటీ అధికారుల వైఖరిని నిరసిస్తూ వర్సిటీలో జరిగే 23వ కాన్వకేషన్‌ను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. కొందరు విద్యార్థులు ప్రజాప్రతినిధులకు అనుకూలంగా స్కూల్ ఏర్పాటును సమర్థిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ భూముల అక్రమణల కుట్రలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

కాగా, విద్యార్థుల నిరసన ఆందోళన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన విద్యార్థులను సముదాయించారు. విద్యార్థులు వినిపించుకోకపోవడంతో బలవంతంగా పోలీస్ వాహనాల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించి వదిలివేశారు. విద్యార్థుల నిరసన ఆందోళన నేపథ్యంలో క్యాంపస్‌లో ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, కో కన్వీనర్ మున్నా గణేశ్, బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, వీరాస్వామి, పస్తం అనిల్, కొత్తూరి రోహిత్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేశ్, ఎఐడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, సురేశ్, ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ అధ్యక్షుడు సాయి, వర్సిటీ కన్వీనర్ అన్నమయ్య, ధర్మ, విష్ణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకట్రామ్



వరంగల్ లీగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది బి.వెంకట్రాంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. బి.వెంకట్రామ్ 40 ఏళ్లుగా ఉమ్మడి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆయన నియామకం పట్ల సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.

పోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకటరమణ



వరంగల్ లీగల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది గంప వెంకటరమణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వరంగల్ పట్టణానికి చెందిన వెంకటరమణ 2007 నుంచి న్యాయవాదిగా ఉభయ జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

చైల్డ్ ట్రాఫికింగ్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ


చైల్డ్ ట్రాఫికింగ్ అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, జూలై 3(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన చైల్డ్ ట్రాఫికింగ్ వాల్ పోస్టర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చైల్డ్ ట్రాఫికింగ్ సమాజాన్ని తీవ్రంగా గాయపరిచే నేరమని, దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల జీవితాలనే నాశనం చేస్తుందని, పేద పిల్లలే లక్ష్యంగా చేసుకుని చైల్డ్ ట్రాఫికింగ్ జరుగుతోందని తెలిపారు. ఉద్యోగాలు, చదువుల పేరుతో మభ్య పెట్టి లైంగిక దోపిడీకి గురి చేస్తుంటారని, ఈ విషయాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ డీసీపీ రవికుమార్, హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, వరంగల్ జిల్లా చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫోరం కన్వీనర్ మండల పరశురాములు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ సభ్యురాలు కొండా మంజుల, ఎఫ్‌ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్ బతుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన వాహనాల అప్పగింత


వాహనాన్ని బాధితుడికి అప్పగిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్

వరంగల్ క్రైం, జూలై 3(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో చోరీలకు గురైన వాహనాలను హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు గురువారం బాధితులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. కమిషనరేట్‌తో పాటు వివిధ జిల్లాల్లో ద్విచక్రవాహనాలను చోరీ చేసిన వ్యక్తులు దర్జాగా వాటిపై తిరుగుతుండగా తనిఖీలు నిర్వహిస్తున్న హనుమకొండ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. కాగా, హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా 2024 నుంచి ఇప్పటి వరకు చోరీ అయిన 10 వాహనాలు పట్టుబడ్డాయి. పట్టుబడిన నిందితులను ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పగించి, వాహనాలను బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ సీఐ జి.సీతారెడ్డి, ఎస్సై నారాయణ పాల్గొన్నారు.

సంవిధాన్ పరిరక్షణ సభ పోస్టర్ ఆవిష్కరణ


డీసీసీ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిట్ల సత్యనారాయణ

హనుమకొండ సిటీ, జూలై 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ తలపెట్టిన సంవిధాన్ పరిరక్షణ శంఖారావం సభ పోస్టర్‌ను వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి చిట్ల సత్యనారాయణ ఆవిష్కరించారు. గురువారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరణతో పాటు సభకు శ్రేణుల తరలింపు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీనుబాబు, పల్లె శ్రీనివాస్‌గౌడ్ మోత్కూరి ధర్మారావు, ఈవీ శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్, ఓబీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ శ్రీమాన్, విద్యాసాగర్, డాక్టర్ శ్రవణ్, బంక సంపత్, నాగరాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి కాంగ్రెస్ బహిరంగ సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు జై బాబు, జై భీమ్, జై సంవి ధాన్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర, గ్రామ అధ్యక్షులు ప్రతీ గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మదన్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గొర్రె కిరణ్, నాయకులు సురేష్, భగత్, రాజు, వీసం సురేందర్‌రెడ్డి, చరణ్‌తేజ పాల్గొన్నారు.

కార్మికులను సన్మానించిన కార్పొరేటర్


కార్మికులను సన్మానిస్తున్న కార్పొరేటర్ వసంత మహేందర్‌రెడ్డి

జూలైవాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి అన్నారు. జీడబ్ల్యూఎంసీకి మంజూరైన కొత్త ట్రాక్టర్లలో ఒక ట్రాక్టర్‌ను చెత్త తరలించేందుకు డివిజన్‌కు కేటాయించారు. నూతన ట్రాక్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్ భూక్యా చందర్‌రావు, క్లీనర్ ఐలయ్యను గురువా రం కార్పొరేటర్ శాలువాతో సన్మానించారు. ఎక్సైజ్‌కాలనీ, స్నేహనగర్ కాలనీ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, నరసింహారావు, నారాయణరెడ్డి, గుడి లక్ష్మారెడ్డి, దేశిని రాజమౌళి, రామ్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, డివిజన్ జవాన్లు సతీష్, మహేశ్, విక్కి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్

హసన్‌పర్తి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు సమాజంలో మంచి భవిష్యత్ ఉంటుందని దాత ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు శోభారాణి అన్నారు. మండలంలోని ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం దాత నిరూప్‌నగర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు ఎ.శోభారాణి విద్యార్థులకు ప్రైవేటు పబ్లికేషన్ వర్క్ బుక్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.ఈశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత శోభారాణిని సన్మానించి అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి.సంపత్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, ప్రభావతి, నాగరాజు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం


పబ్లిక్ గార్డెన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్లు

హనుమకొండ, జూలై 3 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా గురువారం విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్, 303 వాకర్స్ ఇంటర్నే షనల్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ప్లాస్టి క్ సంచుల వాడకం వల్ల కలిగే అనర్థాలపై వాకర్స్‌కు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో వాక ర్స్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ మూర రామ చందర్, విద్యా వికాస ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి 303 వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కూరాకుల భారతి, యోగా గురువు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ సంచులు, బాటిళ్ల వాడమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. బట్ట సంచులను పంపిణీ చేశారు.

రిసార్ట్‌లో యువకుడి మృతి

చిలుపూర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో రిసార్ట్‌లో యువకుడు మృతిచెందిన ఘటన రాజవరం సమీపంలోని తన్మయ రిసార్ట్‌లో గురువారం జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికలపేటకు చెందిన చెవుల కిరణ్(27) స్నేహితులతో కలిసి బుధవారం సా యంత్రం రిసార్ట్‌కు చేరుకున్నారు. భోజనం అనంతరం గుండెపోటు రావడంతో కిందపడిపోయాడు. స్నేహితులు ఎంజీఎంకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి మల్లయ్య యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కిరణ్‌కు మూడేళ్ల కిందట వివాహం కాగా, హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రూప్-1లో తెలుగు అభ్యర్థులపై వివక్ష అపోహే

ఆంగ్లం ఉన్నత వర్గాల వారిది అనుకోవడం పొరపాటు: టీజీపీఎస్సీ

▸ కీ విషయంలో ఇచ్చిన మార్గదర్శకాలు ఏమిటి?: హైకోర్టు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను తెలుగు మాధ్యమంలో రాసిన విద్యార్థుల పట్ల వివక్ష చూపారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని.. అది వట్టి అపోహ మాత్రమే అని టీజీపీఎస్సీ హైకోర్టుకు తెలిపింది. వెనుకబడిన వర్గాలవారు మాత్రమే తెలుగు మాధ్యమంలో పరీక్ష రాస్తారనుకోవడం వాస్తవం కాదని.. ఆంగ్ల మాధ్యమంలో అర్హత సాధించిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలే అని తెలిపింది. ఆంగ్లం ఉన్నతవర్గాల వారికి సంబంధించిన భాష అనుకోవడం పొరపాటు అని తేల్చిచెప్పింది. గ్రూప్-1 మూల్యాంకనం, సెంటర్ల కేటాయింపు, సమాధాన పత్రాలు సరిగా దిద్దలేదనే ఆరోపణలపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. "గ్రామాల్లో సైతం పేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలోనే చదివించడానికి ఇష్టపడుతున్నారు. ఆంగ్ల మాధ్యమంలో మెయిన్స్ రాసి అర్హత సాధించిన వారిలో ఎక్కువ మంది వెనుకబడిన వర్గాలవారే ఉన్నారు. అంతేతప్ప తెలుగు పట్ల ఎలాంటి వివక్ష లేదు. ప్రస్తుతం అర్హత సాధించిన వారిలో ఆంగ్లంలో రాసిన వారు 89 శాతం ఉండగా తెలుగులో రాసిన వారు దాదాపు 9.9 శాతం ఉన్నారు. ఉర్దూలో కేవలం ఒక్కరే అర్హత సాధించారు. అలాగే కొంతమందిని కావాలనే సెలెక్టివ్‌గా కొన్ని సెంటర్లకు కేటాయించారన్న ఆరోపణల్లో ఎంత మాత్రం నిజం లేదు. ఎవరు ఏ సెంటర్‌కు వెళ్లాలనేది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ నిర్ణయిస్తుంది. 18, 19 సెంటర్లలో 12 శాతం మంది అర్హత సాధించారనడం తప్పుడు ఆరోపణ. ఆయా సెంటర్లలో 5 శాతానికి మించి అర్హత సాధించలేదు. అది కూడా అక్కడ ఎక్కువ మంది రాయడం వల్ల ఆ సంఖ్య వచ్చింది. ప్రొవిజనల్ లిస్ట్ పెట్టలేదు అనే ఆరోపణ కూడా సరి కాదు. ఏ అభ్యర్థికి ఆ అభ్యర్థి ప్రొవిజనల్ మార్కులు కనిపిస్తాయి. ప్రొవిజనల్ జాబితా కేవలం రీకౌంటింగ్ కోసం మాత్రమే. తుది ఫలితాలు మార్చి 30న ప్రకటించేశాం. ఈ దశలో కోర్టు జోక్యం చేసుకుంటే ఎంపికైన అభ్యర్థులకు పూరించలేని విధంగా నష్టం జరుగుతుంది" అని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. అప్పుడు ధర్మాసనం.. "మూల్యాంకనం చేసే పద్ధతి, అనుసరించాల్సిన 'కీ' కి సంబంధించి ఎవాల్యుయేటర్లకు ఎలాంటి మార్గదర్శకాలు ఇచ్చారు? ఉదాహరణకు తెలంగాణ చరిత్ర తీసుకుంటే ఏయే అంశాలు ప్రస్తావిస్తే ఎంత వెయిటేజీ ఇవ్వాలి అనే నమూనాలో కీ ఉంటుంది కదా?" అని ప్రశ్నించింది. ఆ వివరాలన్నీ సీల్డ్ కవర్‌లో ఇస్తామని.. నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. విచారణ శుక్రవారానికి వాయిదాపడింది.

బనకచర్లపై రాహుల్ మౌనం కుట్రపూరితమే!

▸ బీజేపీతో కలిసి పని చేస్తున్నారని కేటీఆర్ ఆరోపణ

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టు అంశంపై రాహుల్ గాంధీ మౌనంగా ఉండటం కుట్రపూరితమేనని, తెలంగాణకు ద్రోహం చేసేందుకు ఆయన బీజేపీతో కలిసి పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎంతపెరిగినా గొర్రెకు బెత్తెడేతోక అన్నట్లు ప్రతిపక్షనేతగా రాహుల్ ఏడాదికాలంగా సాధించింది ఏమీలేదని ఎక్స్‌వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. గోదావరిలో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా రాహుల్‌తోపాటు కాంగ్రెస్ అగ్రనాయకులు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టం హామీల అమలుపై ప్రతిపక్షనేత హోదాలో రాహుల్ కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటివరకు ప్రశ్నించలేదని కేటీఆర్ గుర్తుచేశారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

No.G2/837/2025 తేది:21.06.2025
Gaz. No.93/ 2025.

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014రూల్ 19 (1) ప్రకారము

ఫారం.6

ప్రాథమిక ప్రకటన

నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని పోలెపల్లి గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 మార్కండేయ లిఫ్ట్ యొక్క పోలెపల్లి కెనాల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన ఎ. 9.28 గుంటలు/ సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మార్కండేయ లిఫ్ట్ యొక్క పోలెపల్లి కెనాల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్ కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ॥లు 9.28 గు॥ భూమి మార్కండేయ లిఫ్ట్ యొక్క పోలెపల్లి కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: పోలెపల్లి మండలం: బిజినపల్లి జిల్లా: నాగర్ కర్నూల్

క్రమ సం.	సర్వే నం./ సబ్ డివిజన్	3	4	5	పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏదైన హక్కులు గల యితర వ్యక్తులు	పరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు		నిర్మాణాలు	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	285	లావని పట్టా	మెట్ట	2.17	ఈర్ల నర్సింహ్మ తండ్రి తిరుపతయ్య (0.04) గూళ్ళ కృష్ణయ్య తండ్రి చంద్రయ్య (0.08) ఉప్పరి లక్ష్మి భర్త రామస్వామి (0.06 ½) ఉప్పరి బాలమ్మ భర్త చెన్నయ్య (0.06 ½) గూళ్ళ సైదులు తండ్రి ఎర్ర సాయిలు (0.04) గూళ్ళ నిరంజన్ తండ్రి ఎర్ర సాయిలు(0.04) గూళ్ళ నాగరాజు తండ్రి హన్మంతు (0.04) శాయిపల్లి బొండమ్మ కూతురు బాలయ్య (0.04) యండి.జహంగీర్ పాష తండ్రి మహ్మద్ (0.01) యండి. బాంబ్ పాష తండ్రి మహ్మద్(0.18) బోగరి శ్రీనివాసులు తండ్రి బాబు (0.02) ముదావత్ లోక్య తండ్రి నక్రు (0.03) ఇస్లావత్ పూల్య తండ్రి తావుర్య(0.05) ఇస్లావత్ సోమ్ల తండ్రి తావుర్య (0.05) కేతావత్ బుద్యా తండ్రి రాములు (0.10) జర్పులావత్ రవి తండ్రి దేవ్ల (0.00¼) జర్పులావత్ చందు తండ్రి దేవ్ల (0.05) జర్పులావత్ లక్ష్మణ్ తండ్రి దేవ్ల(0.05) కేతావత్ బాలమ్మ భర్త గోపాల్ (0.05) ఏ. నాగేష తండ్రి గాలిం కె. బుర్ర తండ్రి రాములు యం. మురళీ తండ్రి బాల చంద్రయ్య ఈర్ల కృష్ణయ్య తండ్రి తిరుపతయ్య యం. నిరంజన్‌తండ్రి శంకరయ్య ఈర్ల ఆంజనేయులు తండ్రి తిరుపతయ్య జె. శంకర్ తండ్రి రెడ్య జె. పీరు తండ్రి రెడ్య జె. బుజ్జి భర్త చందులాల్ జె. హరిలాల్ తండ్రి రెడ్య జె. కాడియా తండ్రి ఆదయ్య ఈర్ల లక్ష్మయ్య తండ్రి తిరుపతయ్య జె. లక్ష్మి భర్త జస్నా జి. బుచ్చయ్య తండ్రి చంద్రయ్య ఈర్ల రాములు తండ్రి తిరుపతయ్య ఆర్.సాయమ్మ భర్త బుచ్చయ్య ఎస్.సువారమ్మ భర్త బాలయ్య జి.తిరుపతయ్య తండ్రి సాయిలు జి.కృష్ణయ్య తండ్రి చంద్రయ్య జి.సైదులు తండ్రి సాయిలు జి.సాంబ తండ్రి ఎర్రసాయిలు ఏ.శ్రీనివాసులు తండ్రి రాములు జి.నాగరాజు తండ్రి హన్మంతు జి.భరత్ తండ్రి బాలయ్య జి.బాలకృష్ణ తండ్రి వీరస్వామి జి.లక్ష్మి భర్త సోంలా జి.నాగమ్మ భర్త చిన్న వెంకటయ్య జె.శ్రీను తండ్రి రాములు జె.కాడియా తండ్రి ఆదయా పి.బొందమ్మ భర్త బుర్రయ్య జె.రవి తండ్రి రాములు షేక్ దాంద్ పాష తండ్రి మహమ్మద్ జె.లక్ష్మి భర్త జస్నా షేక్ మక్బూల్ తండ్రి మహమ్మద్ షేక్ జహంగీర్ తండ్రి మహమ్మద్ ఏ.నాగమణి భర్త బాలయ్య	285/70	VB	285/47	285/55	లేవు	లేవు	లేవు	లేవు
2	289	పట్టా	మెట్ట	0.07	జర్పులావత్ బాలమ్మ భర్త కృష్ణ (0.07) జె.బుజ్జి భర్త చందులాల్ జె.హరిలాల్ తండ్రి రెడ్య జె.పీరు తండ్రి రెడ్య జె.శంకర్ తండ్రి రెడ్య జె.దేవులా తండ్రి బీక్యా జె.నారమ్మ భర్త నక్రు బి.మమత భర్త లాలవర్ధన్ రెడ్డి ఆర్.జ్యోతి భర్త తార్య జె.సంతోష్ తండ్రి కృష్ణ జె.సాంబ తండ్రి బీమ్లా జె.కాడియా తండ్రి ఆదయ్య జె.వెంకటేష్ తండ్రి కన్న జె.నక్రు తండ్రి కన్న జె.వశ్య తండ్రి కన్న జె.హన్మంతు తండ్రి కన్న	298	285/17	303	293	లేవు	లేవు	లేవు	లేవు
3	290	పట్టా	మెట్ట	0.01	ముదావత్ లచ్చ తండ్రి తావుర్య (0.01) యం.నారాయణ తండ్రి కిష్టయ్య యం.రాములు తండ్రి కిష్టయ్య బి.నిరంజన్ తండ్రి కృష్ణయ్య చిన్న వెంకటయ్య తండ్రి భీమన్న బి.జారెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి ఎ.సాయిరెడ్డి తండ్రి చిట్టిరెడ్డి యం.శ్రీనివాసులు తండ్రి నారాయణ యం.బాలు తండ్రి నారాయణ యం.లక్ష్మమ్మ భర్త కాశన్న వి.శేఖరయ్య తండ్రి నారాయణ బి.యాదగిరి తండ్రి నారాయణ ఏ.యాదగిరి తండ్రి శేఖరయ్య బి.బుచ్చయ్య తండ్రి నారాయణ	294	285/13	299	292	లేవు	లేవు	లేవు	లేవు
4	298	పట్టా	మెట్ట	0.24	వద్యవత్ రాజు తండ్రి లక్ష్మణ్ (0.02) వద్యవత్ రాము తండ్రి లక్ష్మణ్ (0.02) వద్యవత్ రమేష్ తండ్రి లక్ష్మణ్ (0.01) వద్యవత్ సురేష్ తండ్రి హన్మ్య (0.01) కెతావత్ హన్మ్య తండ్రి సోంలా (0.02) కెతావత్ లచ్చ తండ్రి తావుర్య (0.02) కెతావత్ దేవోజి తండ్రి ధన్ సింగ్ (0.04) ముడావత్ నీలమ్మ భర్త కృష్ణ (0.03) కెతావత్ రాములు తండ్రి దేవ్ల (0.03) వద్యవత్ రాజు తండ్రి లక్ష్మణ్ (0.02) యం.పత్రీ పూరప్ నిర్మలమ్మ భర్త కృష్ణ కె.దేవోజి తండ్రి ధన్‌సింగ్ కె.హన్మ్య తండ్రి సోంలా యం.రమేష్ తండ్రి లచ్య వి.మన్యా తండ్రి లక్ష్మణ్ ఎ.సురేష్ తండ్రి హన్మంతు ఉ.రమేష్ తండ్రి లక్ష్మణ్ ఉ.రాజు తండ్రి లక్ష్మణ్ కె.రాములు తండ్రి దేవ్ల	297	299	300	294	లేవు	లేవు	లేవు	లేవు
5	294	పట్టా	మెట్ట	0.02	వద్యవత్ సురేష్ తండ్రి హన్మ్య (0.02) ఎ.సురేష్ తండ్రి హన్మంతు ఎ.సీత భర్త రాజు ఎ.రమేష్ తండ్రి లక్ష్మణ్ ఉ.రాజు తండ్రి లక్ష్మణ్ టి.మాసయ్య తండ్రి కాశన్న ఈ.నాగరాజు తండ్రి వెంకటయ్య ఈ.మల్లేష్ తండ్రి కృష్ణయ్య ఈ.శ్రీశైలం తండ్రి మాసయ్య ఉ.సీత భర్త రాజు తోక కొండయ్య తండ్రి కాశన్న	296	293	298	295	లేవు	లేవు	లేవు	లేవు
6	297	పట్టా	మెట్ట	0.20	ఏదుల తిరుపతయ్య తండ్రి ఊషయ్య(0.04) ఏదుల బుర్రయ్య తండ్రి ఊషయ్య (0.04) ఏదుల శ్రీశైలం తండ్రి ఊషయ్య (0.04) జర్పులావత్ కృష్ణ తండ్రి దేవ్ల (0.08) టి.స్వప్న భర్త రాములు ఎ.మంజుల భర్త తిరుపతయ్య టి.మొగులాలు తండ్రి కొండయ్య కె.శరవంద తండ్రి మాసయ్య ఎ.బుర్రయ్య తండ్రి ఊశన్న టి.రాములు తండ్రి మాసయ్య	22	299	301	294	లేవు	లేవు	లేవు	లేవు
7	22	పట్టా	మెట్ట	0.11	తోక కొండయ్య తండ్రి కాశన్న (0.11) టి.మాసయ్య తండ్రి కాశన్న టి.కొండయ్య తండ్రి కాశన్న	24	297	21	296	లేవు	లేవు	లేవు	లేవు
8	23	పట్టా	మెట్ట	0.15	కమ్మరి రామకృష్ణ తండ్రి చిన్న బాలయ్య (0.07) కమ్మరి రాఘవేందర్ తండ్రి చిన్న బాలయ్య (0.08) కె.రామకృష్ణ తండ్రి చిన్న బాలయ్య కె.రాఘవేందర్ తండ్రి చిన్న బాలయ్య ఎస్.నిరంజన్ తండ్రి పెద్ద ఎల్లయ్య కె.బాలస్వామి తండ్రి కిష్టయ్య	27	22	20	24	లేవు	లేవు	లేవు	లేవు
9	27	పట్టా	మెట్ట	0.18	మగ్గ సుందరమ్మ భర్త నారాయణ (0.18) యం.సుందరమ్మ భర్త నారాయణ యం.నారాయణ గౌడు తండ్రి నాగన్న ఆర్.మధు తండ్రి బాలు	26	23	29	25	లేవు	లేవు	లేవు	లేవు
10	25	పట్టా	మెట్ట	0.08	ముదావత్ సూర్య తండ్రి హామ్లు (0.06) తోక అలివేలు భర్త మాసయ్య (0.02) యం.చందు తండ్రి లాలు కె.శేఖర్ తండ్రి నారాయణ బీర్ల అనిత భర్త సంతోష్ కుమార్ యం.మేగ్య తండ్రి పూల్య యం.హన్మియా తండ్రి లాలు యం.లక్ష్మి తండ్రి హీర్య యం.నాజ్య తండ్రి లాలు యం.పీరు తండ్రి హాము యం.భీంలా తండ్రి లచ్చిరాం యం.సూర్య తండ్రి హాము టి.అలివేలమ్మ భర్త మాసయ్య యం. ఇందిరమ్మ భర్త వెంకటయ్య	26	24	27	VB	లేవు	లేవు	లేవు	లేవు
11	26	పట్టా	మెట్ట	0.26	ముదావత్ సూర్య తండ్రి హామ్లు (0.08) ముదావత్ రాములు తండ్రి హామ్లు (0.06) ముదావత్ పీరు తండ్రి హామ్లు (0.04) కాట్రావత్ కృష్ణ తండ్రి కోట్య (0.08) కె.శేఖర్ తండ్రి నారాయణ యం.గోపాల్ తండ్రి లచ్చిరాం బీర్ల అనిత భర్త సంతోష్ కుమార్ యం.మేగ్య తండ్రి పూల్య యం.హన్మియా తండ్రి లాలు యం.లక్ష్మి భర్త హీర్య పి.విజయ భర్త బాష్య యం.నాజ్య తండ్రి లాలు యం.ఇందిరమ్మ భర్త వెంకటయ్య యం.దాసు తండ్రి లచ్య జి.ఆంజనేయులు తండ్రి చంద్రయ్య బీర్ల సంతోష్ కుమార్ తండ్రి రామస్వామి టి.అలివేలమ్మ భర్త మాసయ్య యం.రాములు తండ్రి లచ్చిరాం యం.రాజు తండ్రి దాసు యం.రవి తండ్రి రాములు జి.ఆంజనేయులు తండ్రి చంద్రయ్య	ROAD	27	30	VB	లేవు	లేవు	లేవు	లేవు
12	34	పట్టా	మెట్ట	0.29	జర్పుల హేమ్య తండ్రి హార్య (0.06) జర్పుల బాలు తండ్రి హన్మ్య (0.07) జర్పుల రాజు తండ్రి సోమ్లు(0.03) జర్పుల శ్రీను తండ్రి సోమ్లు (0.02) జర్పుల శంకర్ తండ్రి సోమ్లు (0.03) జర్పుల మాను తండ్రి సోమ్లు (0.02) జర్పుల బాష తండ్రి సోమ్లు (0.03) జర్పుల హన్మ్య తండ్రి సోమ్లు (0.03) జె.లోక్య తండ్రి లాలు జె.హన్మ్య తండ్రి హరియా జె.బాష్య తండ్రి మాన్య జె.హచ్చి భర్త కాడియా జె.సేవ్య తండ్రి మాన్య జె.హామ్య తండ్రి హార్య జె.మేగ్య తండ్రి హార్య శాంతిబాయి భర్త మేగ్య జె.శంకర్ తండ్రి చత్రు జె. రవి తండ్రి చత్రు జె.మల్లేష్ తండ్రి బాలు జె.సేవ్య తండ్రి మాన్య జె.శారద భర్త శ్రీను జె.లక్ష్మణ్ తండ్రి మన్య జె.బాష్య తండ్రి మాన్య జె.రాములమ్మ భర్త మాను	35/3	ROAD	33	VB	లేవు	లేవు	లేవు	లేవు
13	35	పట్టా	మెట్ట	0.10	జె.రవి తండ్రి చత్రు జె.శంకర్ తండ్రి చత్రు	36	33	35/2	35/3	లేవు	లేవు	లేవు	లేవు
14	36	పట్టా	మెట్ట	0.20	జె.రాములు తండ్రి మాన్య (0.03) జె.బాలు తండ్రి మాన్య (0.01) జె.లోక్య తండ్రి లాలు (0.16) జె.లక్ష్మీదేవి భర్త రవి జె.సేవ్య తండ్రి మాన్య జె.శ్రీను తండ్రి బాలు జె.మల్లేష్ తండ్రి బాలు జె.సుజాత భర్త రమేష్ జె.రాములు తండ్రి మాన్య	43	35/1	42	VB	లేవు	లేవు	లేవు	లేవు
15	42	పట్టా	మెట్ట	0.24	టీకం హన్మంతు తండ్రి ముసలయ్య (0.05) జె.శంకర్ తండ్రి చత్రు (0.02) జె.సేవ్య తండ్రి మాన్య (0.02) ఎ.శివారెడ్డి తండ్రి వేమారెడ్డి (0.06) యం.శంకర్ తండ్రి చంద్య (0.01) యం.గోపాల్ తండ్రి మాన్య (0.01) యం.వీర్య తండ్రి చంద్య (0.01) యం.మాన్య తండ్రి రేఖ్య (0.01) యం.రాము తండ్రి రేఖ్య (0.01) యం.చిట్టి భర్త లక్ష్మణ్ (0.01) యం.రాములు తండ్రి బాలు (0.01½) యం. సోంలా తండ్రి బాలు (0.01½) టీకం మాదవి భర్త రాము టీకం రాములు తండ్రి కృష్ణయ్య యం.మారేని భర్త రాములు యం.గోపాల్ తండ్రి చంద్య జె.శంకర్ తండ్రి చత్రు	45	37	41	43	లేవు	లేవు	లేవు	లేవు
16	41	పట్టా	మెట్ట	0.02	యం.మాన్య తండ్రి రేఖ్య (0.01) యం.రాము తండ్రి రేఖ్య (0.00½) యం.చిట్టి భర్త లక్ష్మణ్ (0.00½) ఆర్.నారి తండ్రి బద్రు ఆర్.మంత్రీ తండ్రి లక్ష్మా ఆర్.రాజు తండ్రి లక్ష్మా ఆర్.సోంలా తండ్రి సక్రు ఆర్.భీముడు తండ్రి సక్రు కె.బాలోజి తండ్రి కిషన్ జి యం.గోవిందు తండ్రి దాసు యం. కృష్ణ తండ్రి దాసు కె.కృష్ణాజి తండ్రి కిషన్ జి	70/3	38	39	42	లేవు	లేవు	లేవు	లేవు
17	39	పట్టా	మెట్ట	0.17	కావలి ఊషన్న తండ్రి బుర్రయ్య (0.04) కావలి కొండయ్య తండ్రి రామయ్య (0.08) వడ్ల మల్లేష్ తండ్రి వెంకటయ్య (0.00½) వడ్ల లక్ష్మయ్య తండ్రి వెంకటయ్య (0.04½) కె.ఎల్లమ్మ భర్త భీమయ్య కె.సునీత భర్త శ్రీనివాసులు పి.శ్రీశైలం తండ్రి ఊశన్న కె.బుడ్డ ఊశన్న తండ్రి బుర్రయ్య కె.బుర్రయ్య తండ్రి బుడ్డ ఊశన్న వి.కృష్ణయ్య తండ్రి వెంకటయ్య వి.రాములు తండ్రి వెంకటయ్య వి.శివ తండ్రి వెంకటయ్య వి.విష్ణువర్ధన్ తండ్రి వెంకటయ్య వి.లక్ష్మీనారాయణ తండ్రి వెంకటయ్య వి.మల్లేష్ తండ్రి వెంకటయ్య యం.పార్వతమ్మ భర్త కొండయ్య	40	38	77	41	లేవు	లేవు	లేవు	లేవు
18	40	పట్టా	మెట్ట	0.20	కావలి మొగిలాలి తండ్రి ఊషన్న (0.07½) కావలి శివకుమార్ తండ్రి ఆంజనేయులు (0.06½) కావలి నాగమ్మ భర్త బుర్రయ్య(0.06) కె.శివకుమార్ తండ్రి ఆంజనేయులు కె.మొగులాల్ తండ్రి ఊషన్న కె.మాణిక్యమ్మ భర్త బంగారయ్య కె.నాగమ్మ భర్త బుర్రయ్య కె.సుజాత భర్త సాగర్	70/3	39	75	41	లేవు	లేవు	లేవు	లేవు
19	70	లావని పట్టా	మెట్ట	0.16	ఆర్ బాషనాయక్ తండ్రి రాములు (0.08) యం.రాములు తండ్రి లచ్చిరాం (0.03) యం.కిషన్ తండ్రి దాసు (0.04) మ్యాకల నర్సింహులు తండ్రి చిన్న లక్ష్మయ్య (0.01) గడ్డమీది పర్వతాలు తండ్రి కాశన్న (0.04) గడ్డమీది బాలయ్య తండ్రి కాశన్న (0.04) గడ్డమీది చిన్న మల్లయ్య తండ్రి కాశన్న(0.04) కె.సాగర్ తండ్రి భీమయ్య కె.శ్రీశైలం తండ్రి భీమయ్య యం.తార్య తండ్రి నర్సింగ్ యం.సోంలా తండ్రి సోమ్లు యం.గోబ్రియా తండ్రి చంద్రు యం.ముత్యాలి భర్త పూల్యా వి.బుర్రయ్య తండ్రి బాలయ్య బలకాడి బాష్య తండ్రి రాములు బర్ల మల్లేష్ తండ్రి నారాయణ యం.నర్సింహ్మ తండ్రి నారాయణ సి.బాలమ్మ భర్త చిన్న బాలయ్య సి.నర్సింహులు తండ్రి మాసయ్య సి.కోటయ్య తండ్రి మాసయ్య యం.గోశయ్య తండ్రి చిన్న లక్ష్మయ్య సి.శివయ్య తండ్రి పర్వతాలు ఆర్.సోంలా తండ్రి బాష్య కె.మల్లయ్య తండ్రి గోవిందు సి.అమృతమ్మ భర్త వెంకటయ్య వి.ఉద్దాలు తండ్రి బాలయ్య కె.శంకరయ్య తండ్రి చిన్నయ్య కె.రమేష్ తండ్రి అంజయ్య కె.శివకుమార్ తండ్రి అంజయ్య కె.పర్వతాలు తండ్రి అంజయ్య కె.రాంచంద్రయ్య తండ్రి అంజయ్య కె.శ్రీనివాసులు తండ్రి అంజయ్య ఆర్.లక్ష్మ తండ్రి రాములు	70/2	40	40/16	45	లేవు	లేవు	లేవు	లేవు
20	68	పట్టా	మెట్ట	0.12	గడ్డమీది పర్వతాలు తండ్రి కాశన్న గడ్డమీది లక్ష్మమ్మ భర్త పర్వతాలు గడ్డమీది చిన్న మల్లయ్య తండ్రి కాశన్న గడ్డమీది పార్వతమ్మ భర్త మల్లయ్య గడ్డమీది కాంతమ్మ భర్త బాలయ్య గడ్డమీది మహేష్ యాదవ్ తండ్రి మల్లయ్య వటమోని సత్యనారాయణ తండ్రి వెంకటయ్య గడ్డమీది చంద్రమ్మ భర్త మల్లయ్య గడ్డమీది వెంకటేష్ తండ్రి పర్వతాలు	66	69	VB	70/17	లేవు	లేవు	లేవు	లేవు
21	66	పట్టా	మెట్ట	0.06	మ్యాకల నర్సింహులు తండ్రి నారాయణ(0.06) యస్.గీత భర్త అనంత రెడ్డి సాయిలక్ష్మి మినరల్స్ ఎల్‌ఎల్‌పి ఆర్. సోంలా తండ్రి సక్రు యం.నర్సింహ్మ తండ్రి నారాయణ యం లక్ష్మీదేవమ్మ భర్త నారాయణ	59	58	67	60	లేవు	లేవు	లేవు	లేవు
22	67	పట్టా	మెట్ట	0.08	మ్యాకల నర్సింహులు తండ్రి నారాయణ (0.08) లక్ష్మీదేవమ్మ భర్త నారాయణ	VB	68	VB	66	లేవు	లేవు	లేవు	లేవు
			మొత్తం	9.28									

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్ మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము. నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51 తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము-II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

Sd/-
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్

Sd/-
అదనపు కలెక్టరు నాగర్ కర్నూల్

Sd/-
జిల్లా కలెక్టరు నాగర్ కర్నూల్

DIPR RO.NO:337/LA-PP/ADVT/PUBLICATION/2025-26

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి

రూ. 8 వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)



కేంద్రానికి సమర్పించింది. ఉత్తర భాగంలోని రహదారుల నిర్మాణానికి రూ.8వేల కోట్లు, భూసేకరణ కింద ఇవ్వాల్సిన నష్టపరిహారానికి అదనపు నిధులు అవసరమని డీపీఆర్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ డీపీఆర్.. ప్రాజెక్టు అప్రైజల్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ చెంతకు చేరింది. ఈ కమిటీ ఆమోదం లభించిన తర్వాత డీపీఆర్.. పబ్లిక్-ప్రైవేటు-పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీకి వెళ్తుంది. ప్రాజెక్టు నిర్మాణం, వ్యయం, ఆదాయం సహా పలు కీలక అంశాలపై ఈ కమిటీ సమీక్షిస్తుంది. ఈ కమిటీ కూడా ఆమోదిస్తే ఫైలు కేంద్ర క్యాబినెట్ ముందుకు వెళుతుంది. ఇదే చివరి దశ. ఈ రహదారి వల్ల దేశవ్యాప్తంగా ఎంత మేర రవాణా జరుగుతుంది, రాబడి ఎలా ఉంటుంది సహా వివిధ అంశాలపై కేంద్ర మంత్రివర్గం సమగ్రంగా చర్చిస్తుంది. అయితే, ఆయా అంశాలను పరిశీలించాకే ఆర్ఆర్ఆర్‌ను మంజూరు చేసిన నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ ఆమోదం త్వరగానే లభిస్తుందని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తంగా 2016లో రాష్ట్రానికి మంజూరైన ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులో ఉత్తరభాగం ఏళ్ల తర్వాత కీలకదశకు చేరుకుందని అధికారులు అంటున్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డిలో మొదలై చౌటుప్పల్ వరకు 161 కిమీల మేర ఉందన్న విషయం తెలిసిందే.

నిర్మాణ వ్యయం రూ.8వేల కోట్లు..

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం నిర్మాణానికి దాదాపు రూ.8వేల కోట్లు అవసరమని కేంద్రానికి పంపిన డీపీఆర్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. రహదారి నిర్మాణం కోసం సేకరించిన భూములకు చెల్లించాల్సిన పరిహారం దీనికి అదనమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటా కింద పరిహారం చెల్లించనుండగా ఇందుకోసం రూ.5,200 కోట్లు అవసరమని అంచనా. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని తొలుత 4 లేన్ల రహదారిగా నిర్మించాలని అనుకున్నారు. కానీ, ట్రాఫిక్ సర్వే గణాంకాల ఆధారంగా ఈ మార్గాన్ని ఆరు లేన్లగా నిర్మించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబర్‌లో పిలిచిన టెండర్ల స్థానంలో కొత్తగా 6 వరుసలతో రహదారి నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించనున్నారు.

నిర్మాణ విధానంలో మార్పులు.!

రహదారిని ఆరు లేన్లకు మార్చడంతో రోడ్డుతో పాటు సర్వీస్ రోడ్లు, కల్వర్టులు, సహా ఇతరత్రా అంశాలన్నింటిపై మరోమారు సమగ్ర నివేదిక రూపొందించారు. అదేవిధంగా టెండర్లు ఆహ్వానించిన సమయంలో పేర్కొన్న ఈపీసీ విధానం కాకుండా బిల్డ్-ఆపరేట్-టోల్ అండ్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో నిర్మిస్తే కేంద్రంపై భారం ఉండదని నివేదికలో పొందుపర్చారు. ఇందు కోసం ఈపీసీ, హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్), బీవోటీ విధానాలను వివరించారు. కాగా ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ ఆమోదించగానే నిర్మాణ విధానం, టెండర్ల ఖరారు సహా ఇతర అంశాలు కొలిక్కివస్తాయని, ఈ మొత్తం ప్రక్రియకు 3-4 నెలల సమయం పడుతుందని ఎన్‌హెచ్ఏఐ వర్గాలు చెబుతున్నాయి.

కల్వర్టులు, టోల్‌ప్లాజాలు ఇలా..

161 కిమీల మేర ఉండే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రోడ్డు మార్గంలో కొన్నిచోట్ల ఇరిగేషన్ శాఖకు సంబంధించిన మైనర్, మేజర్, బాక్స్ కల్వర్టులను నిర్మించాల్సి ఉంది. మొత్తం రోడ్డు విస్తీర్ణంలో 11 ఇంటర్‌చేంజ్‌లు, కొన్నిచోట్ల టోల్‌ప్లాజాలు రానుండగా, 6 చోట్ల రెస్ట్ ఏరియాలు ఏర్పాటు కానున్నాయి. చిన్న, మధ్య, భారీ తరహా కలిపి మొత్తం 187 అండర్ పాస్‌లు, నాలుగు రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)లు నిర్మించాల్సి వస్తోంది. ఇవికాక 26 మేజర్ బ్రిడ్జిలు, 81 మైనర్ బ్రిడ్జిలు, 400కు పైగా బాక్స్ కల్వర్టులు నిర్మించాలని డీపీఆర్‌లో పేర్కొనట్టు సమాచారం.

నేను ఎవరికీ భయపడను!

పోటా, టాడా కేసులకే భయపడలేదు.. కావాలనే నన్ను రెచ్చగొడుతున్నారు

▸ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ వ్యాఖ్య
▸ భవిష్యత్తుపై మా కూతురిదే నిర్ణయం
▸ అధిష్ఠానం నిర్ణయం మేరకే ఎన్నికల్లో పోటీ: మంత్రి సురేఖ
▸ మీనాక్షికి 16 పేజీల నివేదిక ఇచ్చిన కొండా దంపతులు

వరంగల్, జూలై 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాను ఎవరికీ భయపడనని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చెప్పారు. పోటా, టాడా కేసులకే భయపడలేదని అన్నారు. తాను ఇప్పటికే క్రమశిక్షణా సంఘం పరిశీలనలో ఉన్నానని.. కావాలనే కొందరు తనను రెచ్చగొడుతున్నారని చెప్పారు. 44 ఏళ్లుగా తన ఎపిసోడ్ నడుస్తూనే ఉందని, పనిచేసే వారిపైనే విమర్శలు ఉంటాయని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను మంత్రి కొండా సురేఖ, మురళి దంపతులు కలిసి 16 పేజీల నివేదికను అందించారు. అనంతరం మురళి మీడియాతో మాట్లాడారు. తాను ఎవరి గురించీ కామెంట్ చేయనన్నారు. భయపడుతూ పోతే తనపై 23 కేసులు పెట్టకపోయేవాళ్లని పేర్కొన్నారు. తొలిసారి మీనాక్షి నటరాజన్‌ను కలిశానన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే సభ గురించి మాట్లాడామని, వరంగల్ నుంచి జన సమీకరణపై చర్చించామని తెలిపారు. కాంగ్రెస్‌ను బతికించడం, రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడం, మరో పదేళ్ల రేవంత్‌రెడ్డిని సీఎంగా కొనసాగేలా చూడడమే తన ముందున్న లక్ష్యాలని చెప్పారు. బీసీల ప్రతినిధిగానే కొనసాగుతానని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు తాము పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించడం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేలను గెలిపించడమే తన బాధ్యత అని, తాను ఎవరికీ భయపడేది లేదని స్పష్టం చేశారు. తాను బీసీ కార్డుపైనే బతుకుతున్నానని, గ్రూపు రాజకీయాలతో సంబంధం లేదని మురళి చెప్పారు. తన కూతురు సోషల్ మీడియా పోస్టులతో తనకు సంబంధం లేదని, ఒక్కొక్కరి ఆలోచనలు ఒక్కోలా ఉంటాయని అన్నారు. మంత్రి కొండా సురేఖ మాత్రం తమ కుమార్తె పరకాల నుంచి పోటీ చేస్తానని చెప్పడంలో తప్పు లేదన్నారు. తను పార్టీ టికెట్ ఆశిస్తుందని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా.. కట్టుబడి ఉంటామని తెలిపారు. తన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే హక్కు ఆమెకు ఉంటుందన్నారు. కాగా, ఇటీవల కొండా దంపతుల కుమార్తె సుస్మిత తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌లో 'వచ్చే ఎన్నికల్లో పరకాల అభ్యర్థిని నేనే' అని పెట్టారు. పరకాల ఎమ్మెల్యేతో కొండా దంపతులకు విభేదాలు తారస్థాయికి చేరిన నేపథ్యంలో సుస్మిత పోస్ట్ పరకాల రాజకీయాల్లో రచ్చరచ్చగా మారింది. మరోవైపు పరకాల ఎమ్మెల్యేపై చేసిన వాఖ్యలపై క్రమశిక్షణ సంఘం కొండా మురళికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో సుస్మిత పోస్టు అగ్నికి ఆజ్యం పోసినట్లైందనే చర్చ జరుగుతోంది. దీనిపైనే కొండా దంపతులు మీనాక్షినటరాజన్‌కు వివరణ ఇచ్చినట్లుగా సమాచారం.

ఇదీ సంగతి..

రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా గత నెల 19న వరంగల్‌లో జరిగిన సభలో కొండా మురళి.. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలపై అనుచిత వాఖ్యలు చేశారు. దీనిపై 22న ఎమ్మెల్యేలు, తదితరులు మీనాక్షి నటరాజన్‌తో పాటు క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు. జూలై 5లోగా వివరణ ఇవ్వాలని కొండా మురళికి మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో కొండా దంపతులు మీనాక్షికి నివేదిక ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పలువురు ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటిపై పలు ఆరోపణలతో నివేదిక ఇచ్చినట్లుగా సమాచారం. తనకు తెలియకుండానే తన నియోజకవర్గంలో ఇతర ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పొంగులేటి పోస్టింగులు ఇప్పించడం, అభివృద్ధి పనుల్లో పాల్గొనడం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. అలాగే ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బొంగు అనే పదాన్ని వాడిన వీడియోను కూడా మీనాక్షికి చూపించినట్లుగా సమాచారం.

క్యాబినెట్‌లో చోటు కల్పించండి!

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు ఆశావహుల వినతి.. తమకే ఎందుకు ఇవ్వాలో తెలుపుతూ వివరణ

▸ ప్రత్యేకంగా కలిసిన కొండా దంపతులు

హైదరాబాద్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మంత్రి వర్గ విస్తరణలో చోటు కోసం చివరి దాకా పోటీ పడిన పలువురు ఎమ్మెల్యేలు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సమావేశమయ్యారు. తమకు ఉన్న అర్హతలను వివరించడంతోపాటు పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలూ నాయక్.. ఖర్గేతో ముఖాముఖి భేటీ కాగా, అందరి అభిప్రాయాలను ఆయన సావధానంగా విన్నారు. రెండు దశాబ్దాలుగా ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బతికించుకుంటూ వస్తున్నానని ప్రేమ్‌సాగర్‌రావు వివరించారు. పార్టీ కోసం దగ్గరి బంధువులతోనూ శత్రుత్వం పెంచుకోవాల్సి వచ్చిందని ఖర్గే దృష్టికి తెచ్చారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు.. ఇంద్రవెల్లి సభ సందర్భంగా తనకు హామీ కూడా ఇచ్చారని చెప్పినట్లు సమాచారం. తనకు కాకుండా ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికి మంత్రివర్గంలో చోటు కల్పించారంటూ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మరోవైపు.. రాష్ట్రంలో సగం జనాబా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఉంటే.. రెండు జిల్లాలకు కలిపి ఒక్క మంత్రి పదవి కూడా లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను పంపుతుందని ఖర్గే దృష్టికి తెచ్చారు. అర్బన్ ప్రాంతాల్లో బీజేపీ బలం పుంజుకుంటోందని, లోక్‌సభ ఎన్నికలే దీనికి ఉదాహరణ అని చెప్పారు. ఇచ్చిన జిల్లాకే మళ్లీ మంత్రి పదవి ఇవ్వడమూ సరికాదని, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. మంత్రి కావడానికి తనకు ఉన్న అర్హతలను వివరించారు. ఇదిలా ఉంటే పార్టీలో సీనియర్‌గా తనకు అవకాశం కల్పించాలని సుదర్శన్‌రెడ్డి కోరారు. మంత్రివర్గంలో బంజారాలకు అన్యాయం జరిగిందంటూ ఖర్గేకు బాలూ నాయక్ ఫిర్యాదు చేశారు. బంజారాల్లో 80శాతం మంది కాంగ్రెస్‌కే మద్దతుగా నిలిచారని,అయినా న్యాయం జరగలేదన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి.. తాను మంత్రి పదవికి ఏ విధంగా అర్హుడినో వివరిస్తూ ఖర్గేకు నివేదికను అందించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా.. మంత్రివర్గంలో చోటు దక్కని వ్యక్తిని తానొక్కడినేనని తెలిపారు. ఆశావహులు చెప్పినదంతా సావధానంగా విన్న ఖర్గే.. ఎవరికీ ఎలాంటి హామీ ఇవ్వలేదు. అలాగే, మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి సైతం ప్రత్యేకంగా ఖర్గేను కలిశారు. ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేలపై మురళి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన నేపథ్యంలో.. మురళి, సురేఖ నేరుగా ఖర్గేను కలవడం ఆసక్తికరంగా మారింది. కాగా, అగ్రికల్చర్ వర్సిటీ వీసీ జానయ్య, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళితోనూ ఖర్గే భేటీ అయి, ఆయా అంశాలపై వారితో చర్చించారు.


టీటీడీలో అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి: లక్ష్మణ్

తిరుమల, జూలై3(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో జరిగిన అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేసి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాయనున్నట్టు బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత టీటీడీ బోర్డు హయాంలో ఆయుర్వేద మందుల తయారీ కోసం రూ.3.90 కోట్ల వ్యయంతో నాశిరకం యంత్రాలు కొనుగోలు చేశారని, కనీసం అవి ఉపయోగంలోకి రాలేదని తెలిపారు. పరకామణి, ఆయుర్వేద ఫార్మసీ, లడ్డూ కల్తీ.. చివరికి అన్నప్రసాదాన్ని కూడా నాశిరకంగా అందించారని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇప్పటికే గత పాలకులను దేవుడు కఠినంగా శిక్షిస్తున్నాడు.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

విశేషం

వారే గురువులు

10న గురుపౌర్ణమి



మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ... 'లోకంలో ప్రత్యక్ష దేవతలు నలుగురు. వారు తల్లి, తండ్రి, గురువు, అతిథి' అంటోంది భారతీయ సంస్కృతి. "తొలి గురువైన వేదమాత, తల్లి మన జన్మభూమి, తండ్రి వేదప్రతిపాద్యుడైన భగవంతుడు, దైవానికి ప్రతీకలైన మిగిలినవారు... ఈ నలుగురే ప్రత్యక్ష దైవాలు" అనే వివరణ కూడా ఉంది. గురువులను భగవంతుడిగా భావించి, ఆరాధించడం భారతీయుల సంస్కృతి, సంప్రదాయం, సభ్యత. అందుకే ఆషాఢ శుద్ధ పౌర్ణమిని 'గురుపౌర్ణమి'గా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా శిష్యులు తమ గురువులను, గురు పరంపరను ఆరాధించడం అనాదిగా వస్తున్నదే.

గురువు ఎవరు? అతని మహిమ ఎలాంటిది? గురువు వద్ద ఎలా మసలుకోవాలి? ఎలా తరించాలి?... ఈ ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానం చెప్పే గ్రంథం 'గురుగీత'. ఇది 'స్కాంద పురాణం'లో... మూడు అధ్యాయాలలో, 351 శ్లోకాలలో... పార్వతీ పరమేశ్వరుల మధ్య సంవాద రూపంలో ఉంటుంది. 'సనత్కుమార సంహిత'గా పేర్కొనే ఈ గ్రంథం... "గురువు అనుగ్రహానికి దూరమైన దేనికీ ఈ ప్రపంచంలో మనుగడ లేదు" అని స్పష్టంగా చెప్పింది.

మార్గాన్ని చూపేది, గమ్యానికి చేర్చేది...

కఠోపనిషత్తులో 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత' అనే ఒక విశిష్టమైన సూక్తి ఉంది. అంటే "లేవండి, మేలుకొనండి, మీ కర్తవ్య నిష్ఠతో గమ్యం చేరుకోండి" అని భావం. తెల్లవారుతోంది. రామాయణ గాథలో... రోజంతా గురువు విశ్వామిత్రుడి వెంట నడిచి, అలసిపోయిన రామ లక్ష్మణులు ఒళ్ళు మరచి నిద్రపోయారు. అది గమనించి శ్రీరాముణ్ణి ఉద్దేశించి "కౌసల్యా సుప్రజా రామా! పూర్వాసంధ్యా ప్రవర్తతే" అంటూ విశ్వామిత్రుడు మేలుకొలిపాడు. ఈ రెండు... ముఖ్యంగా కఠోపనిషత్ లోని సూక్తి స్వామి వివేకానందుడికి ఎంతో ఇష్టం. సమాజాన్ని జాగృతపరచాలి. చైతన్యవంతం చేయాలి. ముందుకు నడిపించాలి. వివేకానందుడి అభీష్టం అదే. మరి అందుకు దోహదకారులైన బోధలు చేసేది, మార్గాన్ని చూపించేది, గమ్యానికి చేర్చేది ఎవరు? "గురువు కన్నా వేరెవ్వరూ లేరు" అన్నాయి వేదాలు. అందుకే వారిని ఆచార్యులుగా ఆరాధిస్తున్నాం. ఆర్ష సంస్కృతిని ఆపోశన పట్టినవారు, దాన్ని ఆచరించి, తరించి, ఇతరులను తరింపజేసేవారు, తాను పరమాత్మను లక్ష్యంగా చేసుకొని, సాధన చేసి, దర్శించి, ఇతరులకు బోధించేవారు.. వారే గురువులు.

విష్ణుస్వరూపుడు వేద వ్యాసుడు

పూర్వం ఎన్నో యుగాల నుంచి ఎందరో ఋషులు తమ తపఃఫలంగా సంపాదించిన జ్ఞానాన్ని క్రోడీకరించి, ఆ అనంతమైన రాశిని నాలుగు వేదాలుగా విభజించి, దాన్ని మనకు అందించినవాడు వ్యాసుడు. అందుకే 'వ్యాసాయ విష్ణురూపాయ' అని ఆయనకు నమస్కరిస్తున్నాం. వ్యాసుడు చెప్పినదాన్నే శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు తమ శిష్యపరంపరకు అందించారు. వ్యాసుని పుట్టినరోజు ఆషాఢ శుద్ధ పౌర్ణమి. అదే 'వ్యాస పౌర్ణమి'గా, 'గురుపౌర్ణమి'గా ప్రసిద్ధికెక్కింది. వేద, పురాణ, ఉపపురాణ, బ్రహ్మసూత్రాల ద్వారా... మానవాళికి జ్ఞాన, భక్తి, కర్మ మార్గాలను వ్యాసుడు ఉపదేశించాడు. ఆయనను, ఆ పరంపరలోని సద్గురువులను స్మరించుకోవడం మన విధి. గురు పరంపరకు ఎంతో విశిష్టత ఉంది. సద్గురువు ఒక పరంపరకు చెందినవాడై ఉండాలి. ఆయన అధ్యయనం చేసి, అనుష్ఠించి, తన అనుభవంలోకి తెచ్చుకొని, దాన్ని శిష్యులకు బోధించాలి. "గురువే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. అవ్యక్త పరబ్రహ్మం. నారాయణుడైనా, సదాశివుడైనా అతడే. 'నీ గురువు ఎవరు?' అని ప్రశ్నించుకుంటూ పోతే 'పరబ్రహ్మ' అనే సమాధానం వస్తుంది" అని శౌనకాది మహర్షులకు సూతుడు చెప్పిన సమాధానం 'గురుగీత' తొలి అధ్యాయంలో ఉంది. "నేను చెప్పేది విను అని శిష్యుడితో సద్గురువు అనడు. "నేను నేర్చుకున్నది నీకు చెబుతున్నాను" అంటాడు. ఎందుకంటే గురువు కూడా నిత్య విద్యార్థే. మనలోని అజ్ఞానాన్ని (గు) తొలగించి, జ్ఞాన విజ్ఞానాలను (రు) అందించేవాడే గురువు. ఈ మాటను అవగాహన చేసుకొని, గురువు అనే మాటకు అర్థాన్ని గ్రహించడమే జ్ఞానాన్ని పొందడానికి ఏకైక మార్గం. అదే పార్వతీపరమేశ్వర సంవాదమైన 'గురుగీత' సారాంశం కూడా.

• ఆయపిళ్ళ రాజపాప

ఆయన దీక్షకు నూరేళ్లు!

"ప్రతి ఒక్కరిలో భగవంతుడు ఉన్నాడు. కాబట్టి మీ ఎదుటి వ్యక్తిలోని ఆ దేవుణ్ణి దర్శించండి" అని ప్రబోధించిన మానవతావాది... "మానవ జీవిత లక్ష్యం భగవదైక్యం, మోక్షసాధన. నిరంతరం భగవంతుని ధ్యాసలో గడపడం, ప్రేమతో నిస్వార్థంగా సేవ చేయడం ద్వారా ఆ జీవిత లక్ష్యం నెరవేర్చుకోగలం" అని ప్రవచించిన ఆధ్యాత్మికవాది... అవతార్ మెహెర్ బాబా. ఆయన మౌనం చేపట్టి ఈనెల 10వ తేదీకి వందేళ్ళు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా 'మెహెర్‌బాబా శతవర్ష మౌన వార్షికోత్సవాల' కోసం భక్తులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

"నేను బోధించడానికి రాలేదు. మేలుకొలపడానికి వచ్చాను" అని ప్రకటించిన మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పుణేలో జన్మించారు. తల్లితండ్రులు పెట్టినపేరు మేర్వాన్. పుణేలోని దక్కన్ కళాశాలలో మేర్వాన్ చదువుకొనేవాడు. ఒకరోజు అతను కాలేజీ నుంచి వస్తున్నాడు. అప్పటికే నూరేళ్ళ వయసు పైబడిన హజ్రత్ బాబాజాన్ అనే మహిళా గురువు అయన నుదుటిమీద ముద్దాడింది. వెంటనే మేర్వాన్ బాహ్య ప్రపంచ చైతన్యాన్ని కోల్పోయాడు. ఆ తరువాత... మేర్వాన్‌ను భగవంతుని స్వరూపంగా నాటి గురువులైన షిరిడీ సాయిబాబా, ఉపాసినీ మహరాజ్, నారాయణ్ మహరాజ్, తాజుద్దీన్ బాబా తదితరులు కీర్తించారు. తదనంతరం మేర్వాన్‌ను 'మెహెర్ బాబా... అంటే దయగల తండ్రి' అని ఆయన శిష్యులు పిలవడం ప్రారంభించారు.

ప్రేమే నా మతం...

మెహెర్‌బాబా 1925 జూలై 10న మౌన దీక్ష చేపట్టారు. దాన్ని 1969 జనవరి 31న శరీరత్యాగం చేసేవరకూ... అంటే 44 ఏళ్ళు విడనాడలేదు. మౌనంగానే వేలాది కిలోమీటర్లు పర్యటించారు. మౌనం చేపట్టిన మొదటి ఏడాదిన్నరకాలం పలక మీద బలపంతో తన మాటలు చెప్పేవారు. ఆ తరువాత నుంచి 1954 అక్టోబర్ ఏడోతేదీ వరకు... అక్షరమాల ఉన్న ఒక పలక ద్వారా అనేక విషయాలు సంభాషించేవారు. తరువాత దాన్ని కూడా త్యజించి... కేవలం సంజ్ఞల ద్వారా తన సందేశాలను, ఆదేశాలను తన అనుయాయులకు అందించారు. 1950వ దశకంలో ఆయన ఘోరమైన రెండు కారు ప్రమాదాలకు గురయ్యారు. వాటిలో ఆయన దేహంలోని కుడి, ఎడమ భాగాలు దాదాపు నుజ్జు నుజ్జయ్యాయి. సాధారణ మానవులెవరూ ఈ ప్రమాదాలను తట్టుకొని తిరిగి నడవలేరని ప్రముఖ వైద్యులు ప్రకటించారు. భౌతికంగా ఎన్ని బాధలు ఎదురైనా తన మౌన దీక్షను ఆయన విడిచి పెట్టలేదు. మౌనం ఆయన ఆధ్యాత్మిక కార్యకలాపాలకు ఏమాత్రం ఆటంకం కాలేదు. తన మౌనం గురించి వివిధ సందర్భాల్లో ఆయన ప్రస్తావిస్తూ "నేను ఎప్పుడూ మౌనంగా లేను. నా ప్రేమికుల హృదయాలతో నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాను" అని చెప్పారు. పూర్వం శ్రీరామునిగా, శ్రీకృష్ణుడిగా, బుద్ధునిగా, ఏసు ప్రభువుగా... ప్రస్తుత కాలంలో మెహెర్‌బాబాగా మానవరూపంలో అవతరించానని స్పష్టం చేశారు. తాను ఎలాంటి మతం స్థాపించడానికి రాలేదని, అన్ని మతాలు ఒక్కటేనని, "నా మతం ప్రేమ" అని స్పష్టం చేశారు.



"మీరు చూస్తున్న ఈ ప్రపంచం ఒక మిథ్య. ఇది ఒక కలలాంటిది. ఈ నిజాన్ని మీకు తెలియజేయడానికే ఈ అవతార కాలంలో మెహెర్‌బాబాగా మీ ముందుకు వచ్చాను" అని చెప్పారు.

నిత్యజీవన ఆధ్యాత్మిక మర్మాల గురించి ఆయన వివరిస్తూ భగవంతుడి సేవలో నిజాయితీగా ఉండండి. నిస్వార్థసేవ, ప్రేమ... ఈ రెండూ దైవీలక్షణాలు. ఇతరుల నుంచి ఏదో బహుమతి అందుకోవాలని ఆశించకండి. వారికి ఏదో రూపంలో సాయం చేయడానికి ప్రయత్నించండి. తద్వారా మీకు నిజమైన ఆనందం లభిస్తుంది. అవమానాలు, అభినందనలు మీపై ఎలాంటి ప్రభావం చూపించకపోతే... మీరు నిరంతరం ఆనందంగా ఉంటారు. విమర్శించడం అనే దురలవాటు ప్రతి ఒక్కరి రక్తంలోనూ ఉంది. ఆ అవలక్షణాన్ని అదుపులో ఉంచుకోవాలి. ఎంత మంచి వ్యక్తి అయినా... కామాన్ని జయించలేకపోతే ఆధ్యాత్మిక జీవితంలో ముందుకి సాగలేరు" అని స్పష్టం చేశారు. మెహెర్‌బాబా సందేశాలు సరళంగా ఉంటాయి. వాటిని ఆచరించి, ఆచరింపజేస్తే విశ్వం యావత్తూ ప్రేమమయం అవుతుంది.

• డాక్టర్ మల్లాది కృష్ణానంద్
99595 53218

సందేశం



ఆ త్యాగం అనుపమానం

ముహర్రం పేరు వినగానే గుర్తుకు వచ్చే మొదటి చారిత్రక సంఘటన... కర్బలా మైదానంలో జరిగిన అపూర్వమైన సంగ్రామం. ఖిలాఫత్ వ్యవస్థను సుస్థిరంగా ఉంచడానికి హజ్రత్ హుసేన్ చేసిన మహత్తరమైన త్యాగానికి అది చిహ్నం. అంతేకాదు... ముహర్రం మాసంలోని పదవ రోజు... ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్షి.

రాజకీయపరంగా ఇస్లాం ధర్మంలో ఖలీఫా వ్యవస్థ ఉండేది తప్ప రాచరిక వ్యవస్థ లేదు. కానీ హజ్రత్ మావియా తన కుమారుడైన యజీద్‌కు యువరాజ పట్టాభిషేకం చేశాడు. అక్కడి నుంచే రాచరిక వ్యవస్థ ఆరంభమయింది. ఇస్లాం ధర్మానికి వ్యతిరేకమైన ఈ చర్యపై దైవప్రవక్త మహమ్మద్ మనుమడైన ఇమామ్ హుసేన్, ఆయన అనుచరులు బాహాటంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. యజీద్‌ను రాజుగా ఒప్పుకొనేది లేదంటూ తిరుగుబాటు చేశారు. అదే సమయంలో... ఇమామ్ హుసేన్ తమ వద్దకు వస్తే ఆయనను ఖలీఫాగా గుర్తిస్తామంటూ కూఫా నగర ప్రజలు ఉత్తరాలు రాశారు. మరోవైపు ప్రజలందరూ ఉవ్వెత్తున ఉద్యమించారు. ఈ నేపథ్యంలో యజీద్‌తో ముఖాముఖి చర్చలు జరపడానికి మక్కా నగరం నుంచి కుఫా నగరానికి తన 72 మంది ప్రత్యక్ష సహచరులతో, కుటుంబ సభ్యులతో ఇమామ్ హుసేన్ బయలుదేరారు. వారు కుఫా నగరానికి చేరకమునుపే... తన ప్రభుత్వాన్ని ఇమామ్ హుసేన్ గుర్తించేలా చేయడానికి యజీద్ కుట్రలు పన్నాడు. కానీ యజీద్‌ను రాజుగా గుర్తించడానికి ఆయన అంగీకరించలేదు. తనలో ప్రాణం ఉన్నంతవరకు అధర్మంతో పోరాడుతూనే ఉంటానని ప్రకటించారు. దాని ఫలితమే కర్బలా యుద్ధం.

ధర్మరక్షణ కోసం...

ఇమామ్ హుసేన్ ప్రదర్శించిన ధిక్కారానికి, తిరుగుబాటు ధోరణికి యజీద్ ఆగ్రహోదగ్రుడయ్యాడు. అతని సైన్యం హజ్రత్ హుసేన్‌ను, ఆయన పరివారాన్ని కర్బలా అనే ప్రదేశం దగ్గర అటకాయించింది. ఇరు పక్షాల మధ్యా భీకరమైన యుద్ధం జరిగింది. శత్రువులు నాలుగువేలమంది కన్నా ఎక్కువగా ఉండడంతో ఇమామ్ హుసేన్ సైన్యంలో చాలామంది అమరులయ్యారు. చివరకు ఇమామ్ హుసేన్ ఒంటరిగా యుద్ధరంగంలో మిగిలిపోయారు. దప్పికకు తట్టుకోలేక... శత్రుమూకను చెండాడుతూ ఫరాత్ నదివైపు నీళ్ళకోసం వెళ్ళారు. ఈలోగా మహిళలు, పిల్లలు ఉన్న తమ గుడారాలకు నిప్పు పెట్టారనే వదంతి విని... దప్పిక తీర్చుకోకుండానే వెనుతిరిగారు. గుడారాలకు నిప్పు పెట్టలేదు కానీ తన కుమారుడు అలీ అస్గర్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిసింది. ఆ పసిబాలుణ్ణి చేతుల్లోకి తీసుకొని... అతని కోసం గుక్కెడు నీళ్ళయినా ఇవ్వాలని శత్రుసైన్యాన్ని ఇమామ్ హుసేన్ ప్రాధేయపడ్డారు. కానీ పాషాణ హృదయులైన ఆ సైనికులు... ఆయన కుమారుడి మీద బాణాల వర్షం కురిపించారు. ఒక బాణం ఆ పసికందు గొంతులో దిగి... రక్తం చిమ్మింది. ఈ ఘోరాన్ని చూసిన ఇమామ్ హుసేన్ శత్రుసైన్యంపై విరుచుకుపడ్డారు. శత్రువులు ఆయనను హతమార్చడానికి నలువైపులా కమ్ముకొని ఉన్నారు. ఆరోజు నమాజ్ సమయం కావడంతో ఆయన యుద్ధాన్ని ఆపి... సజ్దా చెయ్యడానికి శిరస్సును భూమి మీద పెట్టారు. వెంటనే శత్రువులు ఆయన మీద దాడి చేసి హతమార్చారు. ఆయన శిరస్సును, చేతులను ఖండించారు. వాటిని బల్లేలకు, బరిసెలకు తగిలించి గంతులేశారు. ఇలా ఒక మహా మనిషి తను నమ్ముకున్న ధర్మాన్ని రక్షించడం కోసం అసువులుబాశారు. ఆయన ప్రదర్శించిన పోరాట పటిమ, అనుపమాన త్యాగం చరిత్రలో నిలిచిపోయాయి.

• మహమ్మద్ వహీదుద్దీన్

హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జిలు!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. కొత్తగా నలుగురిని నియమిస్తే ఈ సంఖ్య 30కి చేరనుంది.

గౌస్ మీరా మొహియుద్దీన్: హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందిన గౌస్ మీరా మొహియుద్దీన్ 1969లో జన్మించారు. 1993లో ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేయడంతోపాటు ప్రత్యేక తెలంగాణ హైకోర్టు ఏర్పడిన తర్వాత తెలంగాణ బార్ కౌన్సిల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఇప్పటివరకు కొనసాగుతున్నారు.

సుద్దాల చలపతిరావు: జనగామకు చెందిన సుద్దాల చలపతిరావు 1971 జూన్ 25న జన్మించారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో 1998లో న్యాయవాదిగా నమోదు చేసుకున్న ఆయన.. న్యాయవాది వై.రామారావు చాంబర్స్‌లో జూనియర్‌గా 2004 వరకు పనిచేశారు. హైకోర్టు, రంగారెడ్డి, సిటీసివిల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ సహా పలు సంస్థలకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు.

వాకిటి రామకృష్ణారెడ్డి: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగులో 1970 సెప్టెంబరు 14న జన్మించారు. బీకాం, ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఆయన 1997లో న్యాయవాదిగా ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది ఎ.అనంతారెడ్డి ఆఫీస్‌లో జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2005 నుంచి సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు, ఆ తర్వాత తెలంగాణ, ఏపీ హైకోర్టులు, సిటీసివిల్, రంగారెడ్డి, సికింద్రాబాద్ కోర్టుల్లో వకాలత్ చేశారు. పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ప్రాతినిధ్యం వహించిన ఆయన ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫు న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

గాడి ప్రవీణ్‌కుమార్: నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో 1971లో జన్మించారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి లా డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో 1998లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వంలోని రక్షణ, హోం, కార్మిక, ఉపాధి శాఖల తరఫున ప్రాతినిధ్యం వహించారు. ఈడీ, ఇండియా మింట్, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ వంటి అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థల తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రస్తుతం డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా పనిచేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఒక న్యాయమూర్తి

ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త జడ్జిల నియామకానికి సుప్రీం కొలీజియం సిఫారసు చేసింది. ఏపీ హైకోర్టుకు తుహిన్ కుమార్ నియామకానికి సిఫారసు చేసింది. అలాగే ఢిల్లీ హైకోర్టుకు ఇద్దరు న్యాయాధికారులు; రాజస్థాన్ హైకోర్టుకు న్యాయవాది అనురూప్ సింఘీ, ఓ జ్యుడీషియల్ అధికారిని; మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఐదుగురు జ్యుడీషియల్ అధికారులను; పంజాబ్-హరియాణాకు పదిమంది జ్యుడీషియల్ అధికారులను సిఫారసు చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది.

సెల్‌ఫోన్‌తో పైరసీ!

(మొదటిపేజీ తరువాయి)

సైబర్ క్రైమ్ అధికారులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా జనా కిరణ్‌కుమార్ ఐటీఐ చదివి నగరానికి వచ్చి వనస్థలిపురం ఎన్జీవో కాలనీలో ఉంటూ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం అతడు ట్విటర్‌లో.. 'తమిళ్‌ఎంవీ' అనే పైరసీ వెబ్‌సైట్‌కు చెందిన వీడియో ఒకటి చూశాడు. కొత్త సినిమాలను రికార్డ్ చేసి పంపితే డబ్బులు ఇస్తామని ఆ వీడియోలో చెప్పడంతో.. వెంటనే వారిని మెయిల్ ద్వారా సంప్రదించి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం మేరకు.. ఏడాదిన్నరగా తెలుగులో రిలీజైన ప్రతి కొత్త సినిమానూ రికార్డ్ చేసి వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. ఒక్కో సినిమాకూ అతడు రూ.30వేల నుంచి రూ.40 వేల దాకా తీసుకుంటున్నాడని సైబర్ క్రైం డీసీపీ కవిత తెలిపారు. కొత్త సినిమా విడుదలైన వెంటనే కిరణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో మొదటి రోజు మొదటి ఆటకు టికెట్ తీసుకునేవాడు. జేబులో మొబైల్ పెట్టుకొని సినిమాకు వెళ్లి.. ఫోన్‌ను జేబులోనే ఉంచి సినిమాను పూర్తిగా రికార్డ్ చేసేవాడు. ఆ వీడియో ఫార్మాట్ మార్చి.. టెలిగ్రాం లింక్ ద్వారా తమిళ్‌ఎంవీ నిర్వాహకులకు పంపేవాడు. వారు ఈ రికార్డింగ్‌లను హెచ్‌డీ క్వాలిటీలోకి మార్చి ఆన్‌లైన్‌లో ఉంచేవాడు. ఇలా అతడు ఏడాదిన్నర వ్యవధిలో 40-60 దాకా కొత్త సినిమాలను వేర్వేరు థియేటర్లలో చూసి ఎవరికీ అనుమానం రాకుండా రికార్డ్ చేసినట్టు సైబర్ క్రైం అధికారులు గుర్తించారు. ఈ పని చేస్తూ.. పోలీసులకు పట్టుబడకుండా ఉండడానికి కిరణ్‌కుమార్ పలు జాగ్రత్తలు తీసుకున్నట్టు డీసీపీ కవిత తెలిపారు. సినిమాల రికార్డింగ్ కోసంప్రత్యేకంగా ఒక మొబైల్‌ను వాడేవాడని.. రికార్డ్ చేసే సమయంలో తప్ప మిగతా సమయంలో దాన్ని స్విచ్ఛాఫ్ చేసి ఉంచేవాడని చెప్పారు. తమిళ్‌ఎంవీ నుంచి తనకు రావాల్సిన సొమ్మును క్రిప్టో కరెన్సీలో తీసుకుని.. జెబ్ పే, కాయిన్ డీసీఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆ కరెన్సీని మన కరెన్సీలోకి మార్చేవాడు. ఆ డబ్బును మూడు బ్యాంకు ఖాతాల్లో జమ చేసి అవసరమైనప్పుడు తీసుకునేవాడు. చివరిగా ఈ ఏడాది మేలో రిలీజైన ఒక కొత్త సినిమాను రికార్డ్ చేసి విక్రయించాడని డీసీపీ తెలిపారు. ఈ ఏడాది మే 9న 'సింగిల్' సినిమా రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. రిలీజైన రెండో రోజే ఆ సినిమా పైరేటెడ్ వెర్షన్ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చింది. దాంతో తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి ఎర్రా మణీంద్ర బాబు సైబర్ క్రైం అధికారులకు ఫిర్యాదు చేశారు. పైరసీ కారణంగా తెలుగు సినీ పరిశ్రమకు ఒక్క 2024లోనే రూ.3700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సైబర్ క్రైం అధికారులు సాంకేతిక ఆధారాల సాయంతో కిరణ్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ శ్రీదేవి.. చిత్రంలో యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ మాధవీదేవి, నర్సింహారెడ్డి, జగన్

అన్ని రంగాల్లో మహిళలకు గౌరవం దక్కాలి

» జస్టిస్ సుజోయ్‌పాల్

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం, గౌరవం దక్కాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. మధ్యప్రదేశ్‌లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య 50 శాతం దాటిందని, భవిష్యత్తులో పురుషులే రిజర్వేషన్ కోరాల్సిన అవసరం రావచ్చని పేర్కొన్నారు. హైకోర్టు జెండర్ సెన్సిటైజేషన్ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం కార్యక్రమాన్ని గురువారం హైకోర్టు బార్ అసోసియేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ పాల్ మాట్లాడుతూ తెలంగాణలో సైతం మహిళా న్యాయమూర్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రిజర్వేషన్ లేకుండానే హైకోర్టులో 30 శాతం కంటే ఎక్కువ మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారని పేర్కొన్నారు. కమిటీ ఛైర్‌పర్సన్ జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ.. హైకోర్టులో లింగ వివక్ష లేకుండా చూడటంతోపాటు ఫిర్యాదులపై విచారణ చేపట్టేందుకు ఈ కమిటీ ఏర్పాటైందని తెలిపారు. దీనికి కేవలం రెండు ఫిర్యాదుల మాత్రమే వచ్చాయని, వాటిని సైతం పరిష్కరించామని పేర్కొన్నారు. కమిటీ సభ్యురాలు జస్టిస్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, టీహెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ జగన్ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

'కూలీ'లో ఆమిర్‌ఖాన్



రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'కూలీ'లో బాలీవుడ్ నటుడు ఆమిర్‌ఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ మేరకు చిత్రబృందం 'ఎక్స్' వేదికగా పోస్టర్‌ని విడుదల చేసింది. 'కూలీ నుంచి చివరి పాత్ర 'దాహా' వచ్చేసింది' అంటూ క్యాప్షన్ పెట్టింది. పోస్టర్‌లో ఆమిర్ ఖాన్ గోల్డెన్ వాచ్, గోల్డ్ ఫ్రేమ్ ఉన్న గ్లాసెస్ ధరించి సిగార్ తాగుతూ మాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. సినిమాలో ఆయన డాన్ పాత్రలో నటిస్తున్నట్లు అర్థమవుతోంది. కాగా, నాగార్జున ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. డి.సురేశ్ బాబు, సునీల్ నారంగ్, దిల్ రాజు యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 'కూలీ' తెలుగు థియేట్రికల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది.

రామాయణ ఫస్ట్ గ్లింప్స్



బాలీవుడ్‌లో భారీ అంచనాలతో రూపొందుతున్న చిత్రం 'రామాయణ'. రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి సీతారాములుగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. నితీష్ తివారి దర్శకుడు. రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. గురువారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్, ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. రామాయణం గొప్పతనాన్ని వివరిస్తూ మొదలైన వీడియోలో నటీనటుల పాత్రలను పరిచయం చేశారు.

ఇండస్ట్రీ రికార్డులు మారతాయి

- జ్యోతికృష్ణ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మించారు. ఏ.ఎం. జ్యోతికృష్ణ, క్రిష్ దర్శకత్వం వహించారు. ఈ నెల 24న 'హరిహర వీరమల్లు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ గురువారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఢిల్లీ సుల్తానుల బారి నుంచి సనాతన ధర్మ రక్షణకు నడుం బిగించిన చారిత్రక యోధుడి పాత్రలో పవన్ కల్యాణ్ ఆకట్టుకున్నారు. మొఘల్ సైన్యంతో వీరమల్లు పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. 'ఆంధీ వచ్చేసింది', 'అందరూ నేను రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తారు... కానీ మీరు మాత్రం నేను రాకూడదని కోరుకుంటున్నారు' లాంటి డైలాగ్‌లు ప్రస్తుతం పవన్ కల్యాణ్ రాజకీయ నేపథ్యాన్ని గుర్తుచేసేలా ఉన్నాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమంలో జ్యోతికృష్ణ మాట్లాడుతూ 'కొందరు 'హరిహర వీరమల్లు' సినిమా గురించి తప్పుగా ప్రచారం చేశారు. మేం అవన్నీ పట్టించుకోకుండా అవాంతరాలను అధిగమించి సినిమాను పూర్తి చేశాం. 'ఖుషీ', 'గబ్బర్‌సింగ్' చిత్రాల తర్వాత పవన్ స్టామినా ఏంటో చూపించే చిత్రమిది. ఈ సినిమాకు పునాది వేసిన క్రిష్ గారికి ధన్యవాదాలు. ఈ సారి రిలీజ్ డేట్ మారదు. ఇండస్ట్రీ రికార్డులు మారతాయి' అని అన్నారు. ఏ.ఎం. రత్నం మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్ చేసిన పూర్తిస్థాయి పాన్ ఇండియా చిత్రమిది. సినిమా ట్రైలర్‌ను మించి ఉంటుంది. ఇప్పటి దాకా మీరు పవర్‌స్టార్‌ను చూశారు. ఈ సినిమాలో రియల్ స్టార్‌ను చూస్తారు' అన్నారు.

మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను

- వర్ష బొల్లమ్మ



'తమ్ముడు' సినిమా కోసం అడవిలో షూటింగ్ చేయాల్సి ఉంటుంది. మీకు ఇబ్బంది ఉంటే ముందే చెప్పండి' అని దర్శకుడు వేణు శ్రీరామ్ నన్ను అడిగారు. 'దీన్నొక సవాల్‌గా తీసుకొని నటిస్తాను' అని ఆయనకు చెప్పాను. ఈ చిత్రం కోసం మార్షల్ ఆర్ట్స్ సైతం నేర్చుకున్నాను' అని హీరోయిన్ వర్ష బొల్లమ్మ అన్నారు. నితిన్ కథానాయకుడిగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా వర్ష బొల్లమ్మ మీడియాతో ముచ్చటించారు.

• కథ విన్నప్పుడు నా పాత్ర కొత్తగా, సవాల్‌గా అనిపించింది. ఈ చిత్రంలో నితిన్‌కు సహాయపడే యువతిగా చిత్ర అనే పాత్రలో కనిపిస్తాను. కథలో నా పాత్రకు మంచి ప్రాధాన్యం ఉంది. యాక్షన్ సన్నివేశాల్లో నటించేందుకు బాగా శ్రమించాల్సి వచ్చింది.

• నితిన్ సెట్‌లో సరదాగా ఉంటారు. లయ కష్టపడే విధానం మాకు స్ఫూర్తినిచ్చింది. సన్నివేశం తను అనుకున్న విధంగా వచ్చేవరకూ వేణు శ్రీరామ్ ఓపిగ్గా పనిచేసేవారు. ప్రస్తుతం రెండు వెబ్‌సిరీస్‌లు చేస్తున్నాను.

ఆకట్టుకునే అంశాలతో షో టైమ్



'ఒక చిన్న కుటుంబంలో జరిగే కథతో 'షో టైమ్' చిత్రం తెరకెక్కింది. తక్కువ పాత్రలతో సాగే కథలో ఎన్నో ఆసక్తికరమైన మలుపులు ఉన్నాయి. ప్రతి అంశం ప్రేక్షకుడిని రంజింపచేస్తుంది. ప్రేక్షకులకు మంచి వినోదం అందిస్తుంది' అని హీరో నవీన్‌చంద్ర అన్నారు. ఆయన కథానాయకుడిగా మదన్ దర్శకత్వం వహించిన చిత్రమిది. కిశోర్ గరికపాటి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. మదన్ మాట్లాడుతూ 'ఈ తరహా చిత్రాలు మలయాళంలో ఎక్కువగా వస్తాయి. తెలుగు ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని అందించే చిత్రమిది' అని చెప్పారు.

యువతకు స్ఫూర్తినిచ్చే 'సోలో బాయ్'



'ఇండస్ట్రీలో ఎత్తుపల్లాలు ఉంటాయని తెలిసే వచ్చాను. మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతోనే నిర్మాతగా సినిమాలు చేస్తున్నాను. తమ కాళ్ల మీద నిలబడాలని తపించే యువతకు స్ఫూర్తినిచ్చేలా మా 'సోలో బాయ్' చిత్రం ఉంటుంది' అని నిర్మాత సెవెన్‌హిల్స్ సతీశ్ అన్నారు. గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి జంటగా నవీన్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సెవెన్ హిల్స్ సతీశ్ 'సోలో బాయ్' విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

• నిర్మాతగా నా గత చిత్రాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరిమిత బడ్జెట్‌తో మంచి ఔట్‌పుట్ వచ్చేలా 'సోలో బాయ్' చిత్రాన్ని నిర్మించాం. మధ్యతరగతి కుటుంబాల్లోని యువత జీవితంలో స్థిరపడేందుకు చేసే ప్రయత్నాలు, ఆ క్రమంలో అనుభవించే సంఘర్షణ నేపథ్యంలో హృదయాలకు హత్తుకునేలా దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు.

• అనుకున్న బడ్జెట్ కన్నా తక్కువలోనే 'సోలో బాయ్' సినిమా పూర్తి చేశాం. మా హీరో గౌతమ్ కృష్ణ నాకు మంచి స్నేహితుడు. అతనికి 'బిగ్ బాస్'తో వచ్చిన గుర్తింపు మా సినిమా ప్రచారానికి తోడ్పడుతోంది. నార్నే నితిన్‌తో థ్రిల్లర్ జానర్‌లో ఓ చిత్రం చేయబోతున్నాను.

నేడు సామాజిక న్యాయ సమరభేరి సభ

(మొదటిపేజీ తరువాయి)

ప్రసంగించనున్నారు. సభకు నియోజకవర్గానికి 500 మంది చొప్పున గ్రామ కమిటీల అధ్యక్షులు.. జిల్లా, మండల కార్యవర్గ సభ్యులను తరలించేందుకు ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి సాధారణ విమానంలో హైదరాబాద్ వచ్చిన ఆయనకు శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహే‌ష్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, దామోదర, పొన్నం ప్రభాకర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. శంషాబాద్ విమానాశ్రయంలోని వీవీఐపీ లాంజ్‌లో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి తదితరులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌కు వచ్చిన ఖర్గే.. రాత్రి అక్కడే బస చేశారు. పలువురు ముఖ్య నాయకులతో ఆయన ముఖాముఖీ సమావేశాలు నిర్వహించారు. ఖర్గే రాక సందర్భంగా శుక్రవారం ఉదయం గాంధీభవన్‌లో రాజకీయ వ్యవహారాల కమిటీ, టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా భేటీల్లోనూ పాల్గొననున్న ఖర్గే.. ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేస్తారు. అనంతరం ఎల్బీ స్టేడియంలో జరిగే సామాజిక న్యాయ సమరభేరి సభలో పాల్గొంటారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు సీతక్క, పొన్నం


ఎల్బీ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం

హైదరాబాద్ సిటీ: ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను గురువారం సాయంత్రం మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఏర్పాట్లన్నీ పూర్తి కాగా, సభకు వచ్చేవారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. స్టేడియంలో వేదికకు, ప్రతినిధులకు వేర్వేరుగా ప్రత్యేక షామియనాలు ఏర్పాటు చేశారు. వర్షం వచ్చినా సభకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఎల్బీ స్టేడియం చుట్టూ పలువురు నేతలు భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. సభకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 నియోజకవర్గాల నుంచే దాదాపు 25వేల మంది ప్రతినిధులను తరలించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

రాజాసింగ్‌పై బీజేపీ సీరియస్!

- ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు కోసం స్పీకర్‌కు లేఖ రాసేందుకు సిద్ధం



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ రాష్ట్ర ముఖ్యులపై ఆరోపణలు గుప్పిస్తూ, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరేందుకు బీజేపీ సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రత్యేకంగా లేఖ రాయనున్నట్టు సమాచారం. గతంలో పలుమార్లు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన సందర్భాల్లో రాజాసింగ్‌ను క్షమించినా, ఇప్పుడు కఠిన నిర్ణయం తీసుకోవాలని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. "రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవికి పోటీచేసేందుకు రాజాసింగ్‌కు నామినేషన్ పత్రం ఇచ్చినా.. ఆయన దాఖలు చేయకపోగా, పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేశారు. దీనిని జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. ఆయన రాజీనామాను ఆమోదిస్తూనే ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాలని నిర్ణయించింది" అని వెల్లడించాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు రాజాసింగ్ సన్నిహితంగా ఉంటారని, గతంలో రాజాసింగ్‌ను పార్టీ నాయకత్వం సస్పెండ్ చేస్తే ఎత్తి వేయించేందుకు రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో సంజయ్ ప్రయత్నించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసారి సంజయ్ చెప్పినా వినకుండా రాజాసింగ్ రాజీనామా చేశారని పేర్కొన్నాయి.

రేపు రాంచందర్‌రావు బాధ్యతల స్వీకరణ

బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎస్.రాంచందర్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. పార్టీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పదాధికారులు, సీనియర్ నేతలతో కలసి ఉదయం 9 గంటలకు గన్‌పార్కులోని అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారు. అక్కడి నుంచి రాష్ట్ర కార్యాలయానికి చేరుకుని, 10 గంటలకు బాధ్యతలు చేపడతారు. తర్వాత చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు.

ముడి పామాయిల్‌పై
దిగుమతి సుంకం పెంచాలి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు తుమ్మల లేఖ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేమన్నారు. కేంద్రం మే 31న ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించిందని తెలిపారు. రైతులకు లాభదాయకంగా ఉంటేనే పామాయిల్ సాగుకు ముందుకొస్తారని, కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించడం బాధాకరమని తుమ్మల పేర్కొన్నారు. దిగుమతి సుంకాన్ని పెంచాలని నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు.

త్వరలో జీపీవోలకు నియామక పత్రాలు: సీసీఎల్‌ఏ

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనాధికారులుగా (జీపీవో) ఎంపికైన వారికి త్వరలో నియామక ఉత్తర్వులు ఇస్తామని భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ తెలిపారు. రెవెన్యూ సంఘాల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. తొలిదశలో ఎంపికైన 3,454 మంది నియామకాలను పూర్తిచేసిన తరువాత, రాష్ట్రంలో ఉన్న 10,954 గ్రామాలకు జీపీవోల నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ట్రెసా ప్రతినిధులు వంగా రవీందర్‌రెడ్డి, గౌతం కుమార్ మాట్లాడుతూ.. వీఆర్‌ఏల సర్వీసు సమస్యలను ప్రస్తావించారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని సూచించారు. తహసీల్దారు కార్యాలయాల్లో పని ఒత్తిడి ఉన్నందున జూనియర్ అసిస్టెంట్ల ద్వారా కూడా భూభారతి దరఖాస్తులపై విచారణ చేయించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇస్తామని లోకేశ్ కుమార్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తెలియజేశారు.

దేవాదాయ శాఖలో డిప్యుటేషన్లు రద్దు

దేవాదాయ శాఖలో ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి డిప్యుటేషన్లను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి డిప్యుటేషన్లు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ గత నెల 13న దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది మంత్రి కొండా సురేఖను సచివాలయంలో కలిసి అభ్యంతరం చెప్పారు. సొంత శాఖలో ఉన్న వారికి పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు అందిన అభ్యర్థనను పరిగణలోకి తీసుకున్న మంత్రి డిప్యుటేషన్ల రద్దు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. డిప్యుటేషన్ల రద్దు, సొంత శాఖలో పదోన్నతులు, ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.


ప్లాన్‌లో మారనున్న వనదేవతల గద్దెల డిజైన్

మేడారంలో వనదేవతల గద్దెలకు కొత్త రూపు

- కొత్త డిజైన్ రూపొందించిన వాస్తుశిల్పి రాజశేఖర్

తాడ్వాయి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని వనదేవతలైన సమ్మక్క సారలమ్మల గద్దెల స్వరూపం మారనుంది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా శాశ్వత ప్రాతిపదికన గద్దెల డిజైన్‌ను మార్చనున్నారు. మేడారంలోని ఐటీడీఏ అతిథి భవనంలోని సమావేశ మందిరంలో జరిగిన మహాజాతర సమీక్ష సమావేశంలో దేవాదాయ ఆర్కిటెక్ట్(వాస్తుశిల్పి) రాజశేఖర్ ప్రొజెక్టర్ ద్వారా స్ర్కీన్‌పై గద్దెల డిజైన్‌ను ప్రదర్శించారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరిగే మేడారం మహాజాతరకు కొత్త గద్దెలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు కొత్తగా రూపొందించిన గద్దెల డిజైన్‌లపై ఆదివాసీ సంఘాలు ఎలా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

ఉత్తమ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ పోటీలు

- 27లోగా ఎంట్రీలు : పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ

తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలు, వారసత్వ వైభవాన్ని ప్రతిబింబించేలా ఫొటోలు, వీడియోలు తీసినవారికి నగదు పురస్కారాన్ని అందించనున్నట్టు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరి క్రాంతి తెలియజేశారు. వచ్చే ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనున్న పర్యాటక కాంక్లేవ్ కోసం ఈ ఫొటోలను వినియోగించనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలవారు జూలై 27లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తెలంగాణ పల్లె జీవనం, ప్రకృతి సౌందర్యం, చారిత్రాత్మక నిర్మాణాలు, పండుగలు, సంప్రదాయ వృత్తులు తదితర అంశాలను ప్రధానంగా పరిశీలనలోకి తీసుకుంటామని ఎండీ వల్లూరి క్రాంతి వివరించారు. వీడియో గ్రాఫర్‌లకు ప్రథమ బహుమతిగా రూ. 10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు నగదు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలాగే ఉత్తమ ఫొటో గ్రాఫర్‌లకు ప్రథమ బహుమతిగా రూ. 4వేలు, రెండో బహుమతిగా రూ. 3వేలు, మూడో బహుమతిగా రూ. 2వేలు నగదు అందించనున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు పర్యాటక సంస్థ వెబ్‌సైట్ https://tourism.telangana.gov.in సందర్శించాలని సూచించారు.

వ్యాపార కేంద్రంగా హైదరాబాద్!

పెట్టుబడులకు స్వర్గధామంగా మారుస్తాం.. అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ'

- రాష్ట్రంలో పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ
- ప్రభుత్వాలు మారినా విధానాలు మారవు
- మలబార్ ఆభరణాల తయారీ యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తెలంగాణలో పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తామని, వ్యాపారాలు లాభదాయకంగా కొనసాగేలా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చి, ప్రపంచ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన విధానాల్లో, ప్రోత్సాహకాల్లో మార్పు ఉండదని స్పష్టం చేశారు. వాటిని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మహేశ్వరం పారిశ్రామిక పార్కులో ప్రముఖ ఆభరణాల తయారీ సంస్థ మలబార్ నిర్మించిన 'మలబార్ జెమ్స్ అండ్ జ్యూయలరీ' తయారీ కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దేశంలో ఏ నగరం పోటీ కాదని, ప్రపంచ స్థాయి నగరాలతోనే పోటీ అని చెప్పారు. ఇందులో భాగంగానే మహేశ్వరంలో అంతర్జాతీయ స్థాయిలో 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత ఇప్పుడు తమ ప్రభుత్వం నాలుగో నగరాన్ని నిర్మించి.. దేశానికి ఫ్యూచర్ సిటీని అందించే ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విజన్ 2047 ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ పేరుతో దీన్ని డిసెంబరు 9న ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. చరిత్రలో గుర్తుండిపోయేలా మహేశ్వరం నియోజకవర్గంలో 35 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు.


ప్రదర్శనకు ఉంచిన ఆభరణాలను పరిశీలిస్తున్న సీఎం, మంత్రి దుద్దిళ్ల

గోల్డ్‌లో కూడా లెజెండ్

బంగారం కొనేవాళ్లలో తెలుగు మహిళలదే అగ్రస్థానమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. రాష్ట్రంపై నమ్మకం ఉంచి ఇక్కడ తయారీ యూనిట్ ప్రారంభించిన మలబార్ సంస్థకు అభినందనలు తెలిపారు. మలబార్ తయారీ యూనిట్ ఏర్పాటుతో ఇక్కడ బంగారం, వజ్రాభరణాల రంగంలో నూతన శకం ప్రారంభమైందని అన్నారు. దేశంలో ఐటీ, ఫార్మా రంగంలో హైదరాబాద్ లెజెండ్‌గా ఉందని.. ఇపుడు గోల్డ్‌లో కూడా లెజెండ్‌గా మారనుందని చెప్పారు. 2035 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త పారిశ్రామిక విధానం-2025 రూపకల్పనకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఈ విధాన రూపకల్పనలో పారిశ్రామిక దిగ్గజాలను భాగస్వాముల్ని చేశామన్నారు. పరిశ్రమలకు వేగంగా, పారదర్శకంగా అనుమతులు మంజూరు చేసేలా టీజీఐపా‌స్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. తమది నిబంధనల పేరిట వేధించే ప్రభుత్వం కాదని, భుజం తట్టి ప్రోత్సహించే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వమని చెప్పారు. కొత్తగా ప్రారంభించిన మలబార్ యూనిట్.. తెలంగాణను తయారీ రంగ హబ్‌గా తీర్చిదిద్దడంలో దిక్సూచిగా ఉంటుందన్నారు. మలబార్ సంస్థ ఫర్నిచర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. తెలంగాణ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేందుకు చేతులు కలపాలని కోరారు. 2023-24లో తెలంగాణ తయారీ రంగ ఎగుమతులు రూ.12 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించారు. ఏకగవాక్ష విధానంలో టీజీఐపాస్ ద్వారా 4200 యూనిట్లకు అనుమతులు ఇచ్చామని, ఇందులో 98 యూనిట్లకు 15 రోజుల్లోనే అనుమతులు ఇచ్చామని చెప్పారు.

2750 మందికి ఉపాధి

మహేశ్వరంలో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్తగా ఏర్పాటు చేసిన సమీకృత తయారీ కేంద్రం ద్వారా 2,750 మందికి ఉపాధి కల్పించనున్నట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి.అహ్మద్ చెప్పారు. తమ కంపెనీ సీఎస్ఆర్ కింద తెలంగాణలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

అధికారికంగా రోశయ్య జయంతి

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
- నేడు హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ

హైదరాబాద్/ అమీర్‌పేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన 92వ జయంతి. తమ ప్రభుత్వం ఆయనకు అరుదైన గౌరవం కల్పించిందని పేర్కొన్నారు. రోశయ్య జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆయనను స్మరించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారని గురువారం తెలిపారు. ఆయన 50 ఏళ్ల క్రియాశీల రాజకీయాల్లో చురుగ్గా ఉన్నా.. వివాద రహితుడిగా పేరు పొందారని సీఎం పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజీనామా చేసిన తర్వాత తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య సేవలు అందించారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కాగా, 450 కిలోల రోశయ్య విగ్రహాన్ని లక్డీకాపూల్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మెట్రో రైల్వే స్టేషన్ సమీపాన పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారు. ఈ నేపథ్యంలో ఆయన విగ్రహావిష్కరణ ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితర అధికారులు సమీక్షించారు. రోశయ్య ఆయన విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్ చొరవ చూపడంపై డాక్టర్ కొణిజేటి రోశయ్య స్మారక వేదిక హర్షం వ్యక్తం చేసింది. వేదిక సభ్యులు కామిశెట్టి అనిల్ కుమార్, ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ జాతీయ అధ్యక్షుడు సీఏ బెల్డి గురువారం రోశయ్య నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే ఆయన విగ్రహం తయారు చేయడంతోపాటు ఆవిష్కరిస్తున్నందుకు వైశ్యులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు
సర్కారు శుభవార్త

- టీచర్లుగా పదోన్నతికి గరిష్ఠ వయోపరిమితి 50 ఏళ్లకు పెంపు
- ఫైలుపై మంత్రి సీతక్క సంతకం.. త్వరలో ఉత్తర్వులు
- దీంతో 4,322 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారు అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి పొందేందుకు గరిష్ఠ వయోపరిమితిని 45ఏళ్ల నుంచి 50ఏళ్లకు పెంచుతూ మహిళా శిశు సంక్షేమశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఆ శాఖ మంత్రి సీతక్క సంబంధిత ఫైలుపై గురువారం సంతకం చేశారు. ఇటీవలే అంగన్‌వాడీ టీచర్ల రిటైర్‌మెంట్ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచారు. ఈ నేపథ్యంలో 50 ఏళ్ల వయసులో టీచర్‌గా పదోన్నతి పొందే హెల్పర్లు 15 ఏళ్లు విధులు నిర్వర్తించే అవకాశం ఉండనుంది. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించి త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. సర్కారు తాజా నిర్ణయంతో 45 ఏళ్లు దాటిన 4,322 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి దక్కనుంది. మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ, కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ఆ శాఖ డైరెక్టర్ సృజన, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, తెలంగాణ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార మెరుగుదల పరిశీలనకు ప్రోగ్రెస్ రిపోర్ట్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వారికి అందించే ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా వంద రోజులపాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎస్‌హెచ్‌జీలకు ఆర్టీసీ ద్వారా రూ.కోటి చెల్లింపు

ఆర్టీసీకి అప్పగించిన అద్దె బస్సుల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) రూ.కోటి ఆర్జించాయని మంత్రి సీతక్క తెలిపారు. అద్దె ప్రాతిపదికన ఎస్‌హెచ్‌జీలు 150 బస్సులను ఆర్టీసీకి అప్పగించాయని, ఒక్కో బస్సుకు ఆర్టీసీ ప్రతి నెలా రూ.70 వేలు చెల్లిస్తోందన్నారు. మొదటి నెల అద్దెకు సంబంధించిన రూ.కోటి 5 లక్షల చెక్కును ఆర్టీసీ యాజమాన్యం సెర్ప్ సీఈవోకు అందజేసిందని తెలిపారు. ఎస్‌హెచ్‌జీలకు ఈ నెల 5న ప్రజాభవన్‌లో చెక్కులను పంపిణీ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి వస్తే అన్నీ చర్చిస్తాం

సభ పెట్టాలంటున్న కేటీఆర్, హరీశ్ ఫ్లోర్ లీడర్లా ?.. వారిద్దరి మాటలకు నేను స్పందించను

- ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కేంద్రమే నిర్మిస్తుంది
- హ్యామ్ రోడ్లతో రాష్ట్ర రూపురేఖలు మారతాయి
- మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ శాసనసభకు వస్తే ప్రతిపక్ష పార్టీ నేతలు కోరే అన్ని అంశాలు అక్కడ చర్చిస్తామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా ఆయన ఇచ్చే సలహాలు, సూచనలను తీసుకుంటామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు, కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై మంత్రి కోమటి రెడ్డి ఈ మేరకు స్పందించారు. రాష్ట్రంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో నిర్మించదల్చిన రహదారులపై హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ కేంద్ర కార్యాలయంలో మంత్రి కోమటి రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని అంటున్న కేటీఆర్, హరీశ్‌రావు ఏమైనా ఫ్లోర్ లీడర్లా ? అని మండిపడ్డారు. వారిద్దరూ మాజీ మంత్రులని, ప్రస్తుతం ఎమ్మెల్యేలు మాత్రమేనని పేర్కొన్నారు. వాళ్ల మాటలకు తాను స్పందించనని, వారిది తన స్థాయి కాదని మంత్రి స్పష్టం చేశారు. వార్తల్లో కనిపించాలనే హరీశ్ రావు ఆలోచన లేకుండా మాట్లాడుతుంటారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తోపాటు తన పాత్ర కూడా కీలకమని కోమటిరెడ్డి అన్నారు. కాగా, కేసీఆర్ తన హయాంలో ఆర్ అండ్ బీ శాఖను విస్మరించారని కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్రటేరియట్, యాదగిరిగుట్ట, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని విమర్శించారు. ఆర్ అండ్ బీ పరిధిలో ఓ 42 బ్రిడ్జిలకు అనుమతులిచ్చి వాటికి అప్రోచ్ రోడ్లు వేయకుండా నిలిపేశారని, ఫలితంగా ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి బీఆర్ఎస్ దాదాపు రూ.9వేల కోట్లు బకాయిలు పెట్టిందని మంత్రి చెప్పారు.

హ్యామ్ రోడ్లకు ఆగస్టులో టెండర్లు

సీఎం రేవంత్ సూచనల మేరకు హ్యామ్ విధానంలో రహదారుల అభివృద్ధి చేయాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. ఇందుకోసం కొన్ని రహదారులను గుర్తించామని, 14 ప్యాకేజీలుగా పనులు చేయాలని అధికారులు ప్రాథమికంగా తేల్చారని కోమటిరెడ్డి చెప్పారు. త్వరలోనే వాటిని ఖరారు చేసి ఆగస్టులో టెండరు ప్రక్రియ ప్రారంభించి సెప్టెంబరులో పనులు మొదలుపెట్టేలా కార్యాచరణ చేస్తున్నామని వివరించారు. హ్యామ్ విధానంలో టోల్‌ప్లాజాలు ఉండవని స్పష్టం చేసిన మంత్రి.. ఈ రోడ్లతో రాష్ట్ర రూపురేఖలు మారతాయన్నారు. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన కాంట్రాక్టర్ల బిల్లులను చెల్లించేందుకు నెలకు 150-200 కోట్లను శాఖకు మంజూరు చేసేలా సీఎం సుముఖత వ్యక్తం చేశారని వెల్లడించారు.

ఆర్‌ఆర్‌ఆర్ కోసం త్వరలో మోదీని కలుస్తా

రీజినల్ రింగు రోడ్డు ఉత్తర, దక్షిణభాగాల అంశంపై చర్చించేందుకు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని త్వరలోనే కలుస్తానని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఉత్తర భాగంలో ఇప్పటికే 96 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని, టెండర్లను ఆహ్వానించేలా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. దక్షిణభాగానికి సంబంధించి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం పొందిన అలైన్‌మెంట్‌ను కేంద్రానికి సమర్పించి దాని ప్రకారమే రోడ్డు నిర్మించాలని అడుగుతామని తెలిపారు. ఉత్తర భాగంతోపాటు దక్షిణ భాగాన్ని కూడా నిర్మించాలని కేంద్రాన్ని కోరతామని, ఈ అంశంలో ఇప్పటికే పలుమార్లు లేఖలు ఇచ్చామని చెప్పారు. ఆర్ఆర్ఆర్‌లో దక్షిణ భాగాన్ని కేంద్రమే నిర్మిస్తుందని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

కేసీఆర్‌కు తీవ్ర జ్వరం.. ఆస్పత్రిలో చేరిక

- వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పి
- కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: సీఎం రేవంత్



హైదరాబాద్, సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అస్వస్థతకు గురయ్యారు. వారం రోజులుగా తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పితో బాధపడుతున్న ఆయన గురువారం సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి భవనం తొమ్మిదో అంతస్తుల్లోని ప్రత్యేక గదిలో ఆయనకు ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్, సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఎంవీ రావు పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తొలుత కేసీఆర్ ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్ నుంచి కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. అక్కడి నుంచి సతీమణి శోభ, కేటీఆర్, శైలిమ, హరీశ్, సంతోష్‌తో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు కేసీఆర్‌కు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తంలో షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నట్లు, సోడియం లెవల్స్ తగ్గినట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన మందులు ఇస్తున్నారు. ఇతర వైటల్ పారామీటర్స్ సాధారణంగానే ఉన్నాయని, కేసీఆర్ బలహీనంగా ఉన్నారని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్ ఎంవీరావు గురువారం రాత్రి విడుదల చేసిన హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు. కాగా కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అత్యుత్తమ వైద్యం అందించాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు.

ఈఈలుగా
పదోన్నతులు కల్పించండి

- మంత్రి ఉత్తమ్‌ను కోరిన 2004 బ్యాచ్ ఇంజనీర్లు

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (డీఈఈ)లుగా 12-13 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని తక్షణమే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఈఈ)లుగా పదోన్నతి కల్పించాలని 2004 బ్యాచ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇంజనీర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి, వినతిపత్రాన్ని అందించారు. శాఖలో తమకంటే జూనియర్లకు ఈఈలుగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టారని, ఈ నియామకాలన్నీ రద్దు చేయాలని కోరారు. భవిష్యత్తులో ఎఫ్ఏసీలుగా జూనియర్లకు అవకాశం ఇవ్వకుండా రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2009 తర్వాత రెగ్యులర్ ప్యానల్ లిస్టు సిద్ధం కాలేదని, తక్షణమే 2004 బ్యాచ్ డిప్యూటీ ఈఈలకు పదోన్నతులు కల్పించి, న్యాయం చేయాలని కోరారు. పదోన్నతుల అంశాన్ని వెనువెంటనే పరిష్కరిస్తామని మంత్రి వారికి భరోసా ఇచ్చారు.

ఆల్మట్టికి పెరుగుతున్న వరద

- 93 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- జూరాలకు 69 వేలు, శ్రీశైలానికి 75 వేల క్యూసెక్కుల ప్రవాహాలు
- ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా కొనసాగుతున్న జలవిద్యుదుత్పత్తి..

హైదరాబాద్/నాగార్జునసాగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ కృష్ణాలో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద క్రమంగా పెరుగుతోంది. గురువారం ఆల్మట్టి ప్రాజెక్టుకు 93 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. జలవిద్యుత్తు ఉత్పాదనతో 42 వేల క్యూసెక్కులను, గేట్ల ద్వారా 46 వేల క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. శుక్రవారం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు దాటే అవకాశముందని సమాచారం. ఇక నారాయణపూర్ ప్రాజెక్టుకు 86 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 73 వేల క్యూసెక్కులు గేట్ల ద్వారా, 6 వేల క్యూసెక్కులను విద్యుదుత్పత్తికి విడుస్తున్నారు. జూరాల ప్రాజెక్టుకు 69 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుదుత్పత్తితో పాటు గేట్ల ద్వారా 66 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 11 వేల క్యూసెక్కులను విద్యుదుత్పత్తికి విడుస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 75 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 58 వేల క్యూసెక్కులను విద్యుదుత్పత్తి కోసం వదులుతున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 50 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 3 వేల క్యూసెక్కులను విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్నారు. పులిచింతలకు ఇన్‌ఫ్లో లేనప్పటికీ కృష్ణా డెల్టా అవసరాల కోసం జలవిద్యుత్తు ఉత్పత్తికి 600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా ఉన్న జలాశయాల కింద భారీగా విద్యుదుత్పత్తి జరుగుతోంది. గురువారం తెలంగాణలోని జలవిద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల ద్వారా 28 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుదుత్పతి కావడం విశేషం. ఇటు గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు స్వల్పంగా వరద పెరుగుతోంది. నిజాంసాగర్‌కు 1,000 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్‌కు 8,718 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 1,293 క్యూసెక్కుల వరద వస్తుండగా.. శ్రీపాద ఎల్లంపల్లికి 955 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. వచ్చే వారం రోజుల్లో ఎగువ గోదావరితో పాటు వార్ధా, వెన్‌గంగా, ప్రాణహిత, ఇంద్రావతి సబ్ బేసిన్లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రవాహాలు పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు.



కరీంనగర్-వేములవాడ రహదారిపైకి వరద నీరు

కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి దుస్థితి ఇది. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ వద్ద రోడ్డు పక్కన నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. ఇటీవలి వర్షాలకు భారీగా నీరు నిలిచి రోడ్డుపై గుంతలు పడ్డాయి. గురువారం ఓ ఆటో ఇలా బోల్తా పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోయాయి. - ఆంధ్రజ్యోతి, భగత్‌నగర్



హెల్ప్‌లైన్ కేంద్రంలో ధ్రువపత్రాల పరిశీలన కోసం వేచిఉన్న అభ్యర్థులు

ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో అభ్యర్థుల అప్‌సెట్!

- సర్వర్ డౌన్.. నిలిచిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- సాంకేతిక విద్యాశాఖ తీరుపై ఆగ్రహం

హైదరాబాద్ సిటీ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏర్పడిన అవాంతరాలతో ఎప్‌సెట్ అభ్యర్థులు అప్‌సెట్ అవుతున్నారు. సర్వర్ సమస్యలతో సతమతమవుతున్నారు. రెండ్రోజులుగా సర్వర్ డౌన్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలన నిలిచిపోయింది. సుమారు గంటన్నర నుంచి రెండుగంటల పాటు సర్వర్ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో స్లాట్ బుక్ చేసుకుని కౌన్సెలింగ్ హాల్‌లోకి వెళ్లిన అభ్యర్థులు ఎంతకీ బయటకు రాలేదు. వారికోసం బయట వేచి ఉన్న తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈలోగా తరువాతి స్లాట్లను బుక్ చేసుకున్న అభ్యర్థులు పెద్దసంఖ్యలో హెల్ప్‌లైన్ కేంద్రాల వద్దకు రావడంతో రద్దీ ఏర్పడింది. మెయిన్ సర్వర్‌లో సమస్యలు తలెత్తినందున, తమ చేతుల్లో ఏమీ లేదని హెల్ప్‌లైన్ కేంద్రాల సిబ్బంది నిస్సహాయతను వ్యక్తం చేశారు. సర్వర్ డౌన్‌తో వెరిఫికేషన్ ప్రక్రియ రెండుగంటల పాటు ఆలస్యం కావడంతో దూర ప్రాంతాల నుంచి సాయంత్రం వేళల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలకు వచ్చిన అభ్యర్థులు తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు రాత్రివేళ సరైన రవాణా సౌకర్యాలు లేక ఇక్కట్ల పాలయ్యారు. ప్రాసెసింగ్ ఫీజుల పేరిట కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న సాంకేతిక విద్యాశాఖ అధికారులు సర్వర్ మెయింటెనెన్స్‌పై దృష్టి సారించకపోవడాన్ని అభ్యర్థుల తల్లిదండ్రులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. కాగా, కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్న క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

వాట్సాప్ పోస్టుతో ఉరి

- ఇందిరమ్మ ఇల్లు రాక.. వాట్సాప్ గ్రూప్‌లో యువకుడి ఆవేదన
- భగ్గుమన్న కాంగ్రెస్ పార్టీ అభిమానులు
- సెల్‌ఫోన్‌ను లాక్కొన్న పోలీసులు
- కేసుల భయంతో యువకుడి బలవన్మరణం

గోవిందరావుపేట, జూలై 3 (ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో ఆవేదనకు గురైన ఓ యువకుడు తమ గ్రామ వాట్సాప్ గ్రూపులో పెట్టిన పోస్టు.. అతని బలవన్మరణానికి కారణమైంది. బాధితుడి బంధుమిత్రుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయికి చెందిన చుక్క రమేశ్(25) చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో.. అమ్మమ్మ వద్ద పెరిగారు. తర్వాత హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేశారు. ఇటీవల చల్వాయికి తిరిగి వచ్చి, ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో రమేశ్ ఆవేదనకు గురయ్యారు. 'చల్వాయి సమాచారం' పేరిట ఉన్న వాట్సాప్ గ్రూపులో ఆవేదన వ్యక్తం చేశారు. అనర్హులకు ఇళ్లు వచ్చాయని ఆరోపించారు. ఇదే గ్రూపులో పస్రా ఎస్సై, డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన వారు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రమేశ్ పోస్టులు పెడుతున్నారంటూ 15 రోజులుగా అతణ్ని టార్గెట్‌గా చేసుకున్నారు. ఈ క్రమంలో న్యూసెన్స్ కేసంటూ డయల్-100కు ఫిర్యాదు వెళ్లాయి. రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం రమేశ్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. గురువారం ఠాణాకు రావాలని ఆదేశించారు. కేసు భయంతో రమేశ్ ఇంట్లో ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా.. రమేశ్ మృతికి పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తలేనని ఆరోపిస్తూ.. మృతుడి బంధువులు, బీఆర్ఎస్ నేతలు గ్రామంలోని 163వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రమేశ్ అమ్మమ్మ విశాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. ఆస్పత్రి వద్ద రమేశ్ మృతదేహానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రమేశ్ మృతికి మంత్రి సీతక్క బాధ్యత వహించాలని, అతని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమాచార శాఖలో 150 ఔట్ సోర్సింగ్ పోస్టులు

హైదరాబాద్, జూలై 3: సమాచార, ప్రజా సంబంధాల (ఐ అండ్ పీఆర్) శాఖలో వివిధ సర్వీసులకు ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు ప్రాతిపదికన 150 పోస్టులను భర్తీ చేసేందుకు తెలంగాణ సర్కారు అనుమతించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టులకు ఎంపికైన వారు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఏడాది కాలం పాటు సేవలందించాల్సి ఉంటుంది. ఉత్తర్వులో పేర్కొన్న మేరకు థర్డ్ పార్టీ ద్వారా వీరికి వేతనాలు అందించనున్నారు.

కేటీఆర్ ఆదేశాలతోనే నిధులు విడుదల చేశాం!

(మొదటిపేజీ తరువాయి)

పాటు ప్రశ్నించారు. అంతకు ముందు నిధుల విడుదలకు సంబంధించి రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చిన హెచ్ఎండీఏ మాజీ అధికారి బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు విచారించారు. నిధుల విడుదల ఏ విధంగా జరిగింది? ఆదేశాలు ఎవరు ఇచ్చారు? నోట్‌ఫైల్ తయారైన తర్వాత నిధుల విడుదలకు ఆదేశాలు వచ్చాయా? లేదంటే.. ఆదేశాలు వచ్చి నిధుల విడుదల జరిగాక ఫైల్ తయారైందా? అనే కోణంలో అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అప్పటి మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే నిధులను విడుదల చేశామని, ఎఫ్ఈవోకు నిధుల విడుదల చేయాలని కేటీఆర్ వాట్సాప్ మేసేజ్ ద్వారా ఆదేశించారని అర్వింద్‌కుమార్ చెప్పినట్లు తెలుస్తోంది. బిజినెస్ రూల్స్ ప్రకారం నిధుల విడుదలకు సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని తాను.. మంత్రిగా ఉన్న కేటీఆర్‌కు చెప్పానని, ముందు నిధులు విడుదల చేయాలని.. అవన్నీ తాను చూసుకుంటానని కేటీఆర్ అన్నారని అర్వింద్‌కుమార్ ఏసీబీకి వాంగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. రూ.45.71కోట్ల నగదును ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ద్వారా బ్రిటన్ పౌండ్ల రూపంలో ఎఫ్ఈవోకు చెల్లించామని ఆయన వివరించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ విచారణ తర్వాత అర్వింద్‌కుమార్‌నూ ప్రశ్నించడంతో నిధుల విడుదల ఏ విధంగా జరిగిందనే విషయంలో ఏసీబీ అధికారులు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి త్వరలో చార్జీషీటు దాఖలు చేయడానికి ఏసీబీ అధికారులు సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం.

వరద జలాల లెక్క ఎలా?

వాటినెలా లెక్కిస్తారు?.. పోలవరం-బనకచర్లపై ఏపీకి కేంద్ర జలసంఘం ప్రశ్న

- పోలవరం నుంచి విడుదలయ్యే వరద లెక్కల ఆధారంగా అధ్యయనం చేయాలి
- అసలిది గోదావరి ట్రైబ్యునల్ అవార్డుకు లోబడి ఉందా?
- ప్రాజెక్టులవారీగా నీటి వినియోగం, సాగునీటి వివరాలు సమర్పించండి
- ఏపీ ప్రభుత్వానికి సీడబ్ల్యూసీ స్పష్టీకరణ



అమరావతి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) పలు వివరాలు, గణాంకాలు సమర్పించాలని కోరింది. వరద జలాల ఆధారంగా ఈ పథకాన్ని తలపెట్టినందున.. అసలు వరద జలాల నిర్వచనమేంటో చెప్పాలని, వాటిని ఎలా లెక్కిస్తారో వివరించాలని రాష్ట్రానికి సూచించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను రాష్ట్రప్రభుత్వం మే 26న జలసంఘానికి నివేదించిన సంగతి తెలిసిందే. దీనిని పరిశీలించిన జలసంఘం.. తన పరిశీలనలు, అభిప్రాయాలతో ప్రాథమిక నివేదికను నాలుగు రోజుల కిందట (గత నెల 30న) రాష్ట్రానికి పంపింది. అదే రోజు కేంద్ర పర్యావరణ-అటవీ మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) ఢిల్లీలో ఈ ప్రాజెక్టుపై కొర్రీలు వేసి ప్రతిపాదనను వెనక్కి పంపడం గమనార్హం. గోదావరికి వరద సమయంలో రోజుకు 2 టీఎంసీల చొప్పున వంద రోజుల్లో 200 టీఎంసీలను పోలవరం నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు తరలించాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశమన్న సంగతి తెలిసిందే. అసలింత వరద ఉందా.. ఈ ప్రాజెక్టు గోదావరి జలవివాదాల ట్రైబ్యునల్ అవార్డు ప్రకారమే ఉందా అని జలసంఘం ప్రశ్నించడం గమనార్హం, అటు ఈఏసీ, ఇటు జలసంఘం లేవనెత్తిన సందేహాలు, అడిగిన వివరణలకు సమాధానాలు ఇచ్చేందుకు.. అన్ని రాష్ట్రాల డేటా కలిగి ఉన్న కేంద్రప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌తో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ లోతుగా కసరత్తు చేస్తోంది.

రాష్ట్రాన్ని జలసంఘం అడిగిన డేటా ఇదీ..

- ఇంద్రావతి, శబరి, దిగువ గోదావరి సబ్‌బేసిన్లలో మిగులుజలాలు అందుబాటులో లేవని సాధ్యాసాధ్యాల నివేదికలో అధికారులు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని జలవనరుల ప్రాజెక్టులు.. అనుమతులు ఉన్నవి, లేనివీ.. పూర్తయినవి, నిర్మాణంలో ఉన్న వాటి వివరాలు, ప్రతిపాదిత నీటి వినియోగం గణాంకాలు సమర్పించాలి. ఎంత నీటి అందుబాటుతో ఈ ప్రాజెక్టులు తలపెట్టారో కూడా తెలియజేయాలి.
- రాష్ట్రంలో ప్రస్తుత, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత ప్రాజెక్టులు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియజేసే ఇండెక్స్ మ్యాప్‌లు సమర్పించాలి.
- సాగునీరు, బహుళార్థ సాధక ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ల రూపకల్పన మార్గదర్శకాల (2010) ప్రకారం.. ఏదైనా ప్రాజెక్టును పరిశీలించాలంటే.. నీతి ఆయోగ్ సిఫారసు చేసిన విధంగా 75 శాతం నీటి డిపెండబిలిటీ ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ఆంధ్ర సహా బేసిన్ రాష్ట్రాలకు గోదావరి ట్రైబ్యునల్ కేటాయింపులు, ప్రాజెక్టులవారీ వినియోగాన్ని లెక్కించాక.. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి 200 టీఎంసీల వరద జలాల మళ్లింపునకు ఎంత డిపెండబిలిటీ ఉందో లెక్కించి చెప్పాలి.
- అధికారులు సమర్పించిన ఎక్సెల్ షీట్‌లో ఎలాంటి ఫార్ములాలు గానీ, గణాంక విధానాలు గానీ లేవు. వాటన్నిటినీ సమర్పించాలి.
- ప్రాజెక్టులవారీగా నీటి వినియోగం డేటా, సాగు ప్రాంతం, రిజర్వాయర్ల నుంచి నీటి విడుదల రికార్డుల గణాంకాలను మాకు పంపాలి.
- గోదావరి ట్రైబ్యునల్ అవార్డు కేటాయింపులను మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ, ఏపీ పూర్తిగా వాడుకున్నట్లు నివేదికలో తెలిపారు. ఆ కేటాయింపుల వినియోగం వివరాలు కూడా మాకు సమర్పించండి.
- పోలవరం డ్యాం నుంచి వరద జలాలను.. పోలవరం కుడి ప్రధాన కాలువతో పాటు సమాంతరంగా తవ్వే కాలువ ద్వారా రోజుకు 18 వేల క్యూసెక్కుల (510 క్యూమెక్కులు) చొప్పున కృష్ణా నది(ప్రకాశం బ్యారేజీ)లోకి తరలిస్తామని నివేదికలో పేర్కొన్నారు. అయితే వరద జలాలను ఎలా లెక్కిస్తారు.. ఏ ప్రాతిపదికన లెక్కిస్తారు.. ట్రైబ్యునల్ అవార్డుకు అనుగుణంగానే అవి ఉన్నాయా అనే వివరాలను మాకు పంపండి.
- రోజుకు 18 వేల క్యూసెక్కుల చొప్పున 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలంటే.. 129 రోజుల సమయం పడుతుంది. మరి ఇన్ని రోజులు వరద అందుబాటులో ఉంటుందో లేదో.. పోలవరం వద్ద వరద నీటి విడుదల లెక్కల ఆధారంగా తాజా సర్వే చేపట్టాలి. ట్రైబ్యునల్ అవార్డును పరిగణనలోకి తీసుకున్నారో లేదో కూడా చెప్పాలి.

వివాహితను చంపిన ఆర్ఎంపీ అరెస్టు

గుర్రంపోడు, జులై 3 (ఆంధ్రజ్యోతి): వివాహితపై లైంగిక దాడి చేసి, ఆమె అడ్డు తొలగించుకునేందుకు గడ్డిమందు ఇంజక్షన్ ఎక్కించి బాధితురాలి మరణానికి కారకుడైన ఆర్ఎంపీ డాక్టర్ మహేశ్‌ను గుర్రంపోడు పోలీసులు అరెస్టు చేశారు. కొండమల్లేపల్లి సీఐ నవీన్‌కుమార్ గురువారం వివరాలను వెల్లడించారు. గుర్రంపోడు మండలానికి చెందిన ఆర్ఎంపీ మహేశ్ ఏడాదిగా ఓ వివాహితతో సన్నిహితంగా ఉన్నాడు. ఆమె తనపై కేసులు పెడతానని, తాము ఏకాంతంగా ఉన్నప్పటి ఫొటోలు, వీడియోలు ఉన్నాయని హెచ్చరించడంతో.. అడ్డు తొలగించుకోవడానికి పథకం పన్నాడు. గత నెల 29న రాత్రి 8.30 సమయంలో కొండమల్లేపల్లి బస్టాండ్ వద్ద ఆమెను కారులో ఎక్కించుకుని, నల్లగొండ వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో.. కొప్పోలు సమీపంలో కారును ఆపాడు. ఆమె వద్దంటున్నా వినకుండా.. లైంగిక దాడికి పాల్పడ్డాడు. "నువ్వు బలహీనంగా కనిపిస్తున్నావు. ఈ మాత్రలు వేసుకో" అని పేర్కొంటూ.. 8 ట్యాబ్లెట్లను మింగించాడు. గడ్డిమందు ఇంజక్షన్ చేశాడు. అదే ఇంజక్షన్‌ను నీటిలో కలిపి, బలవంతంగా తాగించాడు. ఇక ఆమె చనిపోతుందని నిర్ధారించుకుని, కారును ముందుకు పోనిచ్చాడు. కొంత దూరం వెళ్లాక తనకు వాంతి అవుతుందని బాధితురాలు చెప్పడంతో.. దేవరకొండ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. గడ్డిమందు తాగిందని చెబుతూ.. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి పారిపోయాడు. పరిస్థితి విషమించి, బాధితురాలు చనిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. మహేశ్‌ని గురువారం అరెస్టు చేశారు. వివాహిత మరణానికి కారణమైన సిరంజీలు, ట్యాబ్లెట్లు, గడ్డి మందు డాబ్బా, కారు, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. కాగా.. బాధితురాలు చనిపోయిన రోజు పోలీసుల కథనం మరోలా ఉన్న విషయం తెలిసిందే.! రోడ్డు పక్కన నిలిపిన కారులో కొన ఊపిరితో ఉన్న బాధితురాలిని తామే ఆస్పత్రిలో చేర్పించాలమని తొలుత పోలీసులు పేర్కొన్నారు. తాజాగా సీఐ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాత్రం.. నిందితుడు మహేశ్ ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

తనిఖీలకు వచ్చిన వారికి లంచం

(మొదటిపేజీ తరువాయి)

జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు ఆరుగురిని అరెస్టు చేశారు. వరంగల్ జిల్లాలోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ట్రస్టీ ఫాదర్ జోసెఫ్ కొమ్మారెడ్డి రెండు విడతల్లో రూ.20 లక్షలు, రూ.46 లక్షలు లంచంగా చెల్లించినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఫాదర్ కొలంబో ట్రస్టు సభ్యులు, వరంగల్ డయాసీస్ ప్రస్తుత అడ్మినిస్ట్రేటర్‌తో పాటు మరికొంత మందిని విచారించడానికి సీబీఐ సిద్ధమైనట్లు సమాచారం. ఎఫ్ఐఆర్‌లో 36 మంది పేర్లు ఉండగా, అందులో ఆరుగురు ఏపీ, తెలంగాణ వారు. ఎన్ఎంసీ పెద్దలు లంచాల కోసం పలు ప్రాంతాల్లో తమ అనుకూల వ్యక్తుల సాయం తీసుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి అనంతపురం కదిరి ప్రాంతానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్, హైదరాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన డాక్టర్ అంకం రాంబాబు, విశాఖపట్నం అక్కయ్యపాలెంకు చెందిన డాక్టర్ కృష్ణకిశోర్‌లు మెడికల్ కాలేజీల నుంచి లంచాలు వసూలు చేసి ఢిల్లీలోని ఎన్ఎంసీ సభ్యుడు డాక్టర్ వీరేంద్ర కుమార్‌కు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిలో హరిప్రసాద్ పలు ప్రైవేటు వైద్య కళాశాలలకు కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తూ తనిఖీల సమయంలో డమ్మీ ఫ్యాకల్టీలను ఏర్పాటు చేయడం, ఎన్ఎంసీ లైసెన్సు పునరుద్ధరణ కోసం లేఖలు తేవడం, ఇందుకోసం లంచాలు వసూలు చేయడంలో కీలకపాత్ర పోషించినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలోని గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ వెంకట్ నుంచి రూ.50 లక్షలు వసూలు చేసి ఆ మొత్తాన్ని డాక్టర్ కృష్ణ కిషోర్ ద్వారా హవాలా మార్గంలో ఢిల్లీకి పంపినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఇదే కేసుకు సంబంధించి గతంలో ఛత్తీస్‌గఢ్‌లోని శ్రీరావత్‌పురా మెడికల్ కాలేజీకి చెందిన ముగ్గురు డాక్టర్లు, ముగ్గురు మధ్యవర్తులను సీబీఐ అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి ఇప్పటి వరకు కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీల్లోని 40 చోట్ల సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎన్ఎంసీతో కుమ్మక్కైన మరికొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలపైనా సీబీఐ దృష్టిసారించినట్లు సమాచారం.

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు నిరాశ

- సీట్ల పెంపునకు హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కోర్సుల విలీనం, సీట్ల పెంపుపై 14 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు హైకోర్టులో నిరాశ ఎదురయింది. బీటెక్-సీఎస్ఈ ఇతర విభాగాల్లో సీట్లు పెంచుకోవడానికి, కోర్సుల విలీనానికి ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ అంగీకరించినా రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వడం లేదని పేర్కొంటూ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, సీఎంఆర్, ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ తదితర కాలేజీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లను కొట్టివేస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం ఈ ఏడాది మే 2న తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆయా కాలేజీలు డివిజన్ బెంచ్‌లో రిట్ అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. కాలేజీల తరఫున న్యాయవాదులు వాదిస్తూ.. ఇతర ఇంజినీరింగ్ కాలేజీలకు సీట్ల పెంపునకు అవకాశం ఇచ్చి.. కేవలం రాజకీయ కక్షతో తమ కాలేజీలకు అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. పిటిషనర్ కాలేజీలు ఉన్న ప్రాంతంలో ఇప్పటికే చాలా కాలేజీలు ఉన్నాయని.. అదే లొకాలిటీలో మళ్లీ సీట్ల పెంపు కోరడం సరికాదని తెలిపారు. ఇబ్బడిముబ్బడిగా కాలేజీలు, సీట్లు పెరిగిపోకుండా ప్రభుత్వ నియంత్రణ కూడా ఉండాలని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టవ్యతిరేకం కాదని పేర్కొంది. ఈ మేరకు సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ ఇంజనీరింగ్ కాలేజీల పిటిషన్‌లను కొట్టివేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.